www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 19-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 305 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్టి ఉ. 7.32 తదుపరి సప్తమి; నక్షత్రం: స్వాతి ఉ. 10.40 తదుపరి విశాఖ; వర్జ్యం: సా. 4.55-6.43; దుర్ముహూర్తం: మ. 12.05-12.52; అమృతఘడియలు: తె. 3.39-5.27; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వన్డే సమరం

నేటి నుంచే చాంపియన్స్ ట్రోఫీ



హాట్ ఫేవరెట్ భారత్

రేపు బంగ్లాతో తొలి పోరు

ఆదివారం పాకిస్థాన్‌తో..

వివరాలు స్పోర్ట్స్‌లో

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన!

రాజకీయాలకు అతీతంగా వర్సిటీలకు కొత్త వీసీల ఎంపిక

తొమ్మిది వర్సిటీలకు నియామకం పూర్తి

ప్రతిభకు పట్టంకట్టిన కూటమి సర్కార్

జాతీయ విద్యా సంస్థల నుంచి ఇద్దరు

ఢిల్లీ, హైదరాబాద్, ఉస్మానియాలకు చోటు

నియామకాల్లో సామాజిక సమతుల్యం

సుదీర్ఘ కసరత్తు చేసిన మంత్రి లోకేశ్



జీపీ రాజశేఖర్ — ఆంధ్రా యూనివర్సిటీ | ప్రసన్నశ్రీ — ఆదికవి నన్నయ | వి.వెంకట బసవరావు — రాయలసీమ వర్సిటీ

అమరావతి/విశాఖపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో రాజకీయ కేంద్రాలుగా మారిన విశ్వవిద్యాలయాలను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. యూనివర్సిటీలకు కీలకమైన వైస్ చాన్స్‌లర్ల(వీసీ) నియామకంలో రాజకీయాలకు తావులేకుండా ప్రతిభకు ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. వారిలో ఇద్దరు జాతీయ విద్యా సంస్థల ప్రొఫెసర్లు ఉండగా, ఢిల్లీ, హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీల నుంచి ఒక్కొక్కరు చొప్పున నియమితులయ్యారు. సామాజిక సమతుల్యం పాటిస్తూ తొమ్మిది మందిలో ముగ్గురు బీసీలు, ఒక ఎస్సీ, ఒక ఎస్టీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇద్దరు కమ్మ, ఒక కాపు, ఒక బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. అలాగే ప్రాంతాల మధ్య కూడా సమానత్వం ఉండేలా అన్ని ప్రాంతాలకూ వీసీల నియామకాల్లో ప్రాధాన్యత ఇచ్చింది. గత ప్రభుత్వంలో యూనివర్సిటీలకు వైసీపీ అనుకూల వ్యక్తులను వీసీలుగా నియమించడంతో

మిగతా 3వ పేజీలో...

టీచర్ల పనితీరు మదింపు

విద్యార్థుల కనీస అభ్యసన పరిజ్ఞానానికి టీచర్లనే బాధ్యులుగా చేయాలి 14

తద్వారా మెరుగైన విద్యా ప్రమాణాలు

ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయండి

పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం



మహా కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించి హారతిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ దంపతులు, కుమారుడు అకీరా, దర్శకుడు త్రివిక్రమ్

వేల ఏళ్లుగా సనాతన ధర్మం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్ఘాటన 2

సతీసమేతంగా మహా కుంభమేళాలో పుణ్యస్నానం

రిటైర్డ్ తహశీల్దార్ పేరుతో 400 ఎకరాలు!

అందులో ప్రభుత్వ, ప్రైవేటు భూములు

ఉమ్మడి విశాఖ జిల్లాలో విచిత్రం.. 4 నెలల క్రితం ఆయన కన్నుమూత

ఆ భూముల్లో కొన్నిటికి గత నెలలో ఇతరుల పేరిట మ్యుటేషన్లు

ఎలా జరిగిందో, ఎవరు చేయించుకున్నారో అంతుబట్టని వైనం

ఇందులో మోసం లేదంటున్న రెవెన్యూ అధికారులు

హక్కుదార్లు తెలియకే తహశీల్దార్ ఖాతా నంబరంటూ సమర్థన

ఉమ్మడి విశాఖ జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో చిత్ర విచిత్రాలు వెలుగుచూస్తున్నాయి. ఓ మండలంలో పనిచేసిన తహశీల్దార్ పేరిట వందల ఎకరాలు నమోదై ఉన్నాయి. ఆయన 4 నెలల క్రితం మరణించారు. అయితే గత నెలలో ఆయన పేరిట ఉన్న కొన్ని భూములకు ఇతరుల పేర్ల మీద మ్యుటేషన్ జరిగింది. ఇలా ఎలా జరిగిందో అంతుచిక్కడం లేదు. 14

కన్సల్టెంట్ల పెత్తనం!

అన్ని శాఖల్లో కలిపి వంద మందికిపైగా కన్సల్టెంట్లు



ఉద్యోగులకు సమాంతరంగా ప్రైవేట్ వ్యవస్థ

'వాళ్లే కావాలి' అంటున్న కొందరు కార్యదర్శులు

రొటీన్ నివేదికలు, పనులకూ కన్సల్టెంట్లే

ఎస్‌వోలు, ఏఎస్‌వోలు ఇచ్చే సమాచారానికి హైఫై ఇంగ్లీషు అద్దడమే వీరి పని

జగన్ హయాంలో వచ్చిన కన్సల్టెంట్ రాజ్

ఇప్పుడూ మారకపోగా.. మరింత అధికం!

అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిధులతో చేపట్టే ప్రాజెక్టుల అమలుకు కన్సల్టెంట్ల నియామకం తప్పనిసరి. నిధుల వినియోగం, నివేదికల రూపకల్పనకు వీరిని నియమిస్తారు. ఒప్పందంలోనే దీని గురించి ఉంటుంది.

అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా వినూత్నమైన పాలసీలు రూపొందించేందుకు కన్సల్టెంట్లను నియమించుకోవడంలో తప్పు లేదు. కానీ.. జగన్ ప్రభుత్వం వచ్చాక భారీ స్థాయిలో 'కన్సల్టెన్సీ రాజ్' తీసుకొచ్చారు. ఇప్పుడు అది మరింత పెరిగింది.

బడ్జెట్ రూపకల్పన కోసం ఎవరైనా ఆర్థిక నిపుణుడి సలహా తీసుకోవచ్చు. సలహాదారుగా నియమించవచ్చు. కేంద్రం నుంచి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి నిధులు ఎలా సమీకరించవచ్చు... తదితర అంశాలపై సలహాలు ఇచ్చేందుకు కన్సల్టెంట్లను నియమించుకోవడంలో తప్పు లేదు. కానీ.. ప్రతిఏటా జరిగే బడ్జెట్ రూపకల్పనకూ వీరినే ఆశ్రయిస్తున్నారు. బిల్లులు, చట్టాలను కూడా కన్సల్టెంట్లతో చేయిస్తున్నారు.

ప్రస్తుతం 16వ ఆర్థిక సంఘాన్ని అడగాల్సిన నిధుల కోసం ఆర్థిక శాఖలో ఏకంగా 11 మంది కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు.

కన్సల్టెంట్లలో ఎక్కువమంది బెంగళూరు, చెన్నై నుంచి వస్తారు. రావడం.. పోవడం.. అంతా వాళ్లిష్టం. జీతాలు మాత్రం లక్షల్లోనే!

సచివాలయంలో ఎస్‌వోలు, ఏఎస్‌వోలు అనుభవజ్ఞులు! విషయ పరిజ్ఞానం ఎక్కువ. కన్సల్టెంట్లకు ఉన్న అర్హత... హైఫై ఇంగ్లీష్ వాడటమే!

ప్రత్యేక కథనం 14లో..



12

కేసుల దర్యాప్తులో పురోగతి ఏదీ?

అనుచిత పోస్టులు పెట్టినవారిని అరెస్ట్ చేసి లోపలేస్తున్నారంతే

దర్యాప్తు చేసి ఉంటే వివరాలు కోర్టు ముందు ఉంచేవారు కదా!

న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు తేలిగ్గా భావిస్తున్నారు

'సోషల్ కేసుల'పై హైకోర్టు వ్యాఖ్య

థర్డ్‌క్లాస్ నా.. కొ..! పోరా బయటికి..!!

టీటీడీ ఉద్యోగిపై బోర్డు సభ్యుడి వీరంగం 12

మహాద్వారం వద్ద ఆపడంతో ఆగ్రహం

ఆలయ ప్రాంగణంలోనే తిట్ల దండకం

ఎండీఎంఏ మత్తులో ఇంజనీరింగ్ విద్యార్థులు 14

బెంగళూరు నుంచి తీసుకొచ్చి విక్రయం

గుంటూరులో 9 మంది అరెస్ట్.. ఇద్దరు పరారీ

ఆక్వాతో అభివృద్ధి

ఏపీకి గ్రోత్ ఇంజన్‌గా ఆక్వా పరిశ్రమ

టెక్నాలజీ వాడితే అద్భుత ఫలితాలు

నూతన పద్ధతులతో 30% వృద్ధి సాధ్యం

ఏఐతో రొయ్యల వ్యాధులు విశ్లేషించవచ్చు

ప్రకృతి సేద్యంతో ప్రపంచవ్యాప్త డిమాండ్

ఆక్వా రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

నిబంధనల ప్రకారమే సాగు చేపట్టాలి

'ఆక్వా టెక్ 2.0' సదస్సులో సీఎం



ఆక్వా సదస్సును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వా రంగం గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. టెక్నాలజీని వాడితే ఆక్వా రంగంలో మరిన్ని అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు. ఖర్చులు తగ్గించేందుకు, నాణ్యత పెంచేందుకు కృత్రిమ మేధ (ఏఐ)ను

మిగతా 14వ పేజీలో...

రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడులు

22,726 మందికి ఉద్యోగాలు

ప్రతిపాదనలు పంపిన పారిశ్రామిక సంస్థలు

భూముల కేటాయింపునకు ఎస్ఐపీసీ ఓకే

ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలకు అంగీకారం

2

బట్టలూడదీయిస్తాం!

రిటైరైనా, సముద్రాల అవతల ఉన్నా పిలిపిస్తాం

టీడీపీ కలకాలం అధికారంలో ఉండదు

మళ్లీ నేను వస్తాను.. ఎవరినీ వదిలిపెట్టను

పోలీసులపై జగన్ దురుసు వ్యాఖ్యలు 13

జైలులో 40 నిమిషాలు వంశీతో ములాఖత్

బెదిరింపులు మానుకోవాలి.. పోలీస్ అధికారుల సంఘం డిమాండ్



జైలులో వంశీని పరామర్శించిన తర్వాత మాట్లాడుతున్న జగన్

వైసీపీ 'ట్రూత్ బ్లాస్ట్' తుస్..!

రాత్రి 7 గం.లకు 'గన్నవరం' నిజాలు వెల్లడిస్తామని హంగామా

ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడ.. చివరికి అంతా బుస్ అని తేలిన వైనం

అంతకంటే ముందే సత్యవర్ధన్ కిడ్నాప్ దృశ్యాలు విడుదల చేసిన టీడీపీ

స్నానానికి పనికిరావు!

కలుషితమైన త్రివేణి సంగమ జలాలు

కుంభమేళా ప్రాంతంలో పడిపోయిన నీటి నాణ్యత

స్థాయిని మించిన ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా

ఆందోళన వ్యక్తం చేసిన ఎన్జీటీ 2

నీటి నాణ్యత పెంపునకు యూపీ సర్కారు చర్యలు

మహాకుంభ్ కాదు.. మృత్యుకుంభ్!

ఏర్పాట్లలో యూపీ విఫలం

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజం



కుటుంబసభ్యులతో కలిసి పుణ్యస్నానాలు చేస్తున్న వెంకయ్య

కుంభమేళా ధార్మిక వారసత్వానికి ప్రతీక

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లోని గంగ, యమున, సరస్వతి నదీమ తల్లుల త్రివేణీ సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించడం ఓ అలౌకిక ఆధ్యాత్మిక అనుభూతిని అందించిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహాకుంభమేళాలో మంగళవారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనాల్లో మహాకుంభమేళా ఒకటని, భారతీయ సనాతన ధార్మిక వారసత్వానికి ప్రతీక అని ఈ సందర్భంగా 'ఎక్స్‌'లో ఆయన పేర్కొన్నారు.

వేల ఏళ్లుగా సనాతన ధర్మం: పవన్ కల్యాణ్

» సతీసమేతంగా కుంభమేళాలో పుణ్యస్నానం

న్యూఢిల్లీ, అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'వేల సంవత్సరాలుగా కుంభమేళా జరుగుతున్నట్లు చరిత్ర చెబుతోంది. ప్రతిసారీ రావాలని భావించినా కుదరలేదు. ఇప్పుడు మహా కుంభమేళాకు రావడం చాలా ఆనందం కలిగిస్తోంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. భార్య అనా కొణిదెల, కుమారుడు అకిరానందన్, సినీ దర్శకుడు త్రివిక్రమ్, టీటీడీ సభ్యుడు ఆనంద సాయితో కలిసి మంగళవారం ఆయన మహాకుంభ మేళాలో పుణ్యస్నానాలు చేశారు. త్రివేణి సంగమానికి హారతులిచ్చారు. పవన్ మీడియాతో మాట్లాడుతూ 'భారతీయులంతా విభిన్నమైన జాతులు, తెగలు, సంప్రదాయాలను ఆచరిస్తున్నప్పటికీ సనాతన ధర్మం విషయంలో మాత్రం ఏకమవుతారు. సనాతన ధర్మం ఇలాగే భవిష్యత్తులోనూ పరిఢవిల్లాలి. ప్రపంచంలో ఇలాంటి మహా కార్యక్రమం ఇప్పటి వరకు జరగలేదు. మహాకుంభమేళాలో జరిగిన కొన్ని ఘటనలు దురదృష్టకరం. సనాతన ధర్మాన్ని నమ్మే, పాటించే వారిపై ఇలాంటి సమయంలో కొందరు నేతలు ఇష్టానుసారం మాట్లాడటం బాధ్యతారాహిత్యమే. మహా కుంభమేళా నిర్వహణలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పని చేస్తోంది. సనాతన ధర్మం నమ్మే వారి మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడడం మంచిది కాదు' అన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన 'మృత్యు కుంభమేళా' వ్యాఖ్యలపై స్పందిస్తూ.. కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీస్తున్నామని మమతాబెనర్జీ గుర్తించడం లేదన్నారు.

ఉక్రెయిన్ యుద్ధంపై రష్యా- అమెరికా చర్చలు

రియాద్, ఫిబ్రవరి 18: ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేదెలాగన్న దానిపై రష్యా, అమెరికాలకు చెందిన ఉన్నతస్థాయి దౌత్యవేత్తలు మంగళవారం నాడు సౌదీ అరేబియాలో చర్చలు జరిపారు. మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం మీదే ప్రధానంగా చర్చ జరిగినప్పటికీ, ఉక్రెయిన్ అధికారులెవరూ సమావేశంలో పాల్గొనకపోవడం, లేదా వారికి ఆ అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం. తమ భాగస్వామ్యం లేని ఈ చర్చల ఫలితాన్ని అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇప్పటికే స్పష్టం చేశారు. రష్యా- అమెరికా చర్చల తరువాత జెలెన్ స్కీ తన సౌదీ పర్యటన వాయిదా వేసుకున్నారు. మరోవైపు అవసరమైతే జెలెన్ స్కీతో చర్చించడానికి పుతిన్ సిద్ధంగా ఉన్నారని క్రెమ్లిన్ ప్రకటించింది.

నా చావుకు తమ్ముడు, మరదలే కారణం!

» సూసైడ్ వీడియోలో ఓ వ్యక్తి వెల్లడి.. భయంతో ఆ ఇద్దరి ఆత్మహత్య

బెంగళూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తన సోదరుడు, మరదలు ఐపీఎల్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ కోసం భారీగా అప్పులు చేయడం వల్ల ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు తమ్ముడు, అతని భార్యే కారణమని పేర్కొంటూ ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో రికార్డు చేశాడు. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో అతని సోదరుడు, మరదలు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. కర్ణాటకలోని రమ్మనహళ్ళిలో ఈ దుర్ఘటన చేసుకుంది. మృతులను జెస్సీ ఆంటోని(40), అతని సోదరుడు జోబి ఆంటోని(40), జోబి భార్య షర్మిల(35)గా గుర్తించారు. జెస్సీ జోబీ కవలలు. జోబీ భార్య షర్మిల. ఐపీఎల్, ఆన్‌లైన్ గేమ్‌ల కోసం జెస్సీ పేరిట ఉండే ఇంటిపై జోబి దంపతులు అప్పులు చేశారు. ఈ క్రమంలో జెస్సీ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఆత్మహత్యకు తమ్ముడు, మరదలే కారణమని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. తన చెల్లెలిని, బిడ్డను హత్య చేయాలని వారు ప్రేరేపించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో జోబి ఆంటోని, ఆయన భార్య షర్మిల ఉరి వేసుకున్నారు.

తమిళనాడులో బాలికపై ఏడుగురి గ్యాంగ్ రేప్

చెన్నై, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా కునియముత్తూరు ప్రాంతంలో 17 ఏళ్ల బాలికపై ఏడుగురు కాలేజీ విద్యార్థులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కోయంబత్తూరు ఉక్కడం ప్రాంతానికి చెందిన బాలిక ఇంటర్ ఫెయిలై బామ్మ ఇంట్లో ఉంటోంది. ఇటీవల ఆ బాలికకు సామాజిక మాధ్యమాల ద్వారా కునియముత్తూరుకు చెందిన కాలేజీ విద్యార్థితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆ బాలికను మాయమాటలతో కునియముత్తూరులో ఉన్న తన గదికి రప్పించుకున్న ఆ విద్యార్థి.. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేగాక ఆరుగురు సహచర విద్యార్థులను కూడా తన గదికి రప్పించి, ఆమెపై సామూహిక అత్యాచారం చేయించాడు. బాలికను సోమవారం ఉదయం వారు ఆమె ఇంటివద్ద విడిచిపెట్టి పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏడుగురు విద్యార్థులను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

మహిళల్లో కేన్సర్ నివారణకు 6 నెలల్లో వ్యాక్సిన్

ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి 18: మహిళల్లో కేన్సర్ నివారణకు అయిదారు నెలల్లో వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ శాఖల సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. నూతన వ్యాక్సిన్‌పై ప్రస్తుతం ప్రయోగాలు జరుగుతున్నాయని తెలిపారు. 9 నుంచి 16 ఏళ్లలోపు ఉన్న బాలికలకు కూడా దీన్ని టీకాల రూపంలో ఇవ్వవచ్చని చెప్పారు.

తీవ్రవాదం.. నక్సలిజంపై ఉక్కుపాదం

» దక్షిణాది రాష్ట్రాల పోలీసుల సమావేశంలో నిర్ణయం

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దేశంలో తీవ్రవాదం, నక్సలిజాన్ని అణచివేయడానికి అన్ని రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని మంగళవారం తిరుపతిలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల సమావేశం అభిప్రాయపడింది. ఈ సమావేశానికి ఏపీ నుంచి అనంతపురం డీఐజీ షిమోషి, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు పాల్గొన్నారు. దేశంలో తీవ్రవాదం అణచివేయడంలో కొంత విజయం సాధించినా, వారి మూలాలు ఇంకా ఏదో ఒక రాష్ట్రంలో ఉన్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు. వీటిపై అంతర్రాష్ట్ర అధికారులు చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.



కెనడాలోని టొరంటో పియర్‌సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెనుప్రమాదం తప్పింది. 76 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో మినియాపొలీస్ నుంచి టోరంటో చేరుకున్న విమానం.. పియర్‌సన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా రన్‌వేపై పల్టీ కొట్టి తలకిందులుగా పడిపోయింది. ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు.

స్నానానికి పనికిరావు..

కలుషితమైన త్రివేణి సంగమ జలాలు.. కుంభమేళా ప్రాంతంలో పడిపోయిన నీటి నాణ్యత

» ఆందోళన వ్యక్తం చేసిన ఎన్జీటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: మహా కుంభ మేళా సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న త్రివేణీ సంగమ ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా పడిపోయింది. మురుగుతో నీరు కలుషితం అయిపోతోంది. ఇక్కడి నీటి కాలుష్యం ప్రాథమిక ప్రమాణాల స్థాయిని మించిపోయి స్నానానికి అనుకూలం కాని విధంగా మారిపోయింది. నీటిలో ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా స్థాయిని మించి పెరిగిపోయింది. తాము పరీక్షించిన అన్ని ప్రాంతాల్లోనూ ఆ బ్యాక్టీరియా ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా ఉందని ఈ నెల 3న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఓ నివేదిక ద్వారా తెలిపింది. ఇటీవల ఓ కేసు విచారణలో ఎన్జీటీ ధర్మాసనం సీపీసీబీ నివేదికను సమీక్షించి ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణ చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తాము కోరినా స్పందించని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (యూపీపీసీబీ)పై ఎన్జీటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో బుధవారం జరిగే తదుపరి విచారణకు యూపీపీసీబీ సభ్య కార్యదర్శితో పాటు ఇతర అధికారులు పాల్గొనాలని ఆదేశించింది. కాగా, త్రివేణి సంగమంలో నీటి నాణ్యతపై అడిషనల్ కలెక్టర్ వివేక్ చతుర్వేది వివరణ ఇచ్చారు. పుణ్య స్నానాలకు వీలుగా నదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. అన్ని ఘాట్లలో పీసీబీ బృందం ప్రతిరోజు నీటి పరీక్షలు చేస్తోందని, నీటి నాణ్యత నియంత్రణలోనే ఉందని చెప్పారు. పువ్వులు, కొబ్బరికాయలు, ఇతరత్రా పూజా సామగ్రిని ప్రతి రెండు గంటలకు ఓసారి మెషీన్ల సాయంతో తొలగిస్తున్నామని వెల్లడించారు. మహా కుంభమేళా పూర్తయ్యే వరకు నదిలో నీటిని శుభ్రంగా ఉంచటానికి నిరంతరం పరవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక మహా కుంభ మేళా నిర్వహణకు రూ. 7 వేల కోట్లు కేటాయించిన యూపీ ప్రభుత్వం.. జలాలు, వ్యర్థాల నిర్వహణకు రూ. 1,600 కోట్లు ఖర్చుపెడుతోంది. అత్యాధునిక పద్ధతుల్లో మురుగు నీటి నిర్వహణ, వ్యర్థాల తరలింపు చర్యలు చేపడుతోంది.

55 కోట్ల మంది పుణ్యస్నానాలు

గత నెల రోజులకు పైగా కొనసాగుతున్న మహా కుంభమేళాలో ఇప్పటి వరకు అపూర్వ స్థాయిలో 55 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్థానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. దేశంలో సనాతన ధర్మాన్ని పాటించే 110 కోట్ల జనాభాలో సగం మంది మూడు నదుల సంగమంలో స్నానాలు చేశారని, ఈ సంఖ్య మహాకుంభ్ ముగిసే ఈనెల 26వ తేదీ నాటికి 60 కోట్లు దాటుతుందని ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలోని దాదాపు 143 కోట్లు ఉన్న మొత్తం జనాభా పరంగా చూస్తే.. ఇప్పటి వరకు 38 శాతానికి పైగా ప్రజలు పుణ్యస్నానాలు చేశారని తెలిపింది. కాగా, మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 45 కోట్ల మంది భక్తులు పాల్గొంటారని యోగి సర్కార్ అంచనా వేసింది. అయితే ఆ సంఖ్య ఈ నెల 14వ తేదీకే 50 కోట్లు దాటిందని ప్రభుత్వం పేర్కొంది. ఇందులో అత్యధికంగా మౌని అమావాస్య రోజున దాదాపు 8 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారని తెలిపింది.



ప్రయాగ్‌రాజ్‌లో శాస్త్రి బ్రిడ్జి కింద గంగా నదిలోనే కట్టిన టాయిలెట్లు ఇవి. చాలా చోట్ల ఇలాగే నిర్మించారు. మానవ వ్యర్థాలు నదిలో కలిసిపోతున్నాయని, నీటి కాలుష్యానికి ఇదొక కారణమని ఎన్జీటీ ఆందోళన వ్యక్తం చేసింది

కిలోమీటర్‌కు రూ.100

మహా కుంభ మేళాకు వస్తున్న భక్తులు అయోధ్య దర్శనానికి కూడా వెళుతున్నారు. రద్దీని నియంత్రించేందుకు అయోధ్యలోకి వాహనాలను అనుమతించడంలేదు. ఇదే అదనుగా కొంత మంది బైక్ ట్యాక్సీల అవతారం ఎత్తారు. కిలో మీటర్‌కు రూ. 100 వసూలు చేస్తూ భక్తులను అడ్డంగా దోచుకుంటున్నారు. ఇలా అనధికారికంగా భక్తుల వద్ద భారీ మొత్తంలో వసూలు చేస్తున్న వారిని రెండు రోజులుగా పట్టుకుంటున్నారు. 30 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. తమ ఆపరేషన్ కొనసాగుతుందని రామ జన్మభూమి పోలీసు అధికారులు చెప్పారు. కాగా వీఐపీ దర్శనం చేయిస్తానని తన వద్ద ఓ ట్రావెల్ ఏజెంట్ రూ. 1.8 లక్షలు వసూలు చేసి మోసం చేశారని మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ అయోధ్య పోలీసులు ఫిర్యాదు చేశారు.

మహాకుంభ్ కాదు.. మృత్యుకుంభ్!

ఏర్పాట్లలో యూపీ ప్రభుత్వం విఫలం

బెంగాల్ సీఎం మమత ధ్వజం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్.. 'మృత్యుకుంభ్'గా మారుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ యోగి సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో చాలా మంది చనిపోయారని, యూపీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎంత పరిహారం ఇచ్చిందని ప్రశ్నించారు. తొక్కిసలాటలో చనిపోయిన తమ రాష్ట్రానికి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం కూడా చేయలేదని, తమ ప్రభుత్వం పోస్టుమార్టం చేసిందన్నారు. మరణాలకు సరైన కారణం తెలియకుంటే.. ప్రభుత్వం పరిహారం ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. మహా కుంభ్‌లో భక్తులకు సరైన ఏర్పాట్లు కూడా చేయలేదని, చేసిన ఏర్పాట్లలోనూ అసమానతలు ఉన్నాయని, అధికారులకు సరైన ప్రణాళికలు లేవని విమర్శించారు. 'ఇది మృత్యుకుంభ్..! నేను మహాకుంభ్‌ను, గంగా మాతను గౌరవిస్తాను. అయితే ఈ కార్యక్రమానికి సరైన ప్లానింగ్ లేదు' అని మమత అన్నారు. డబ్బున్న వాళ్లు, వీఐపీలకు రూ.లక్షతో క్యాంపులను(టెంట్లు) అందుబాటులో ఉంచారని, అయితే పేదల కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవని పేర్కొన్నారు. సీఎం మమత వ్యాఖ్యలపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. ఆమె చేసిన వ్యాఖ్యలు హిందువులు, మహాకుంభమేళాపై దాడిగా అభివర్ణించారు. హిందూ సమాజం, సాధువులు నిరసన తెలపాలని కోరారు.

లోకం తీరు



అమెరికాలో శతాధిక వృద్ధులు 2 కోట్ల మంది అట!

» 200 ఏళ్లు దాటిన 2 వేల మంది

» 369 ఏళ్ల వ్యక్తి కూడా ఉన్నాడట!

» విస్మయం కలిగిస్తున్న అమెరికా సామాజిక భద్రత డేటాబేస్ గణాంకాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 18: అగ్రరాజ్యం అమెరికాలో శతాధిక వృద్ధులు 2 కోట్ల మంది ఉన్నారట! వారిలో 200 ఏళ్ల వయసు పైబడిన వారి సంఖ్య 2 వేల మార్కు దాటేసిందట! ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే 369 ఏళ్ల వయసు వ్యక్తి ఒకరున్నారట! అమెరికా సామాజిక భద్రత విభాగం (ఎస్ఎస్‌ఏ) డేటాబేస్‌లోని ఈ గణాంకాలు చర్చనీయాంశంగా మారాయి. 'డోజ్' సారథి ఎలాన్ మస్క్ 'ఎక్స్‌'లో ఈ వివరాలను వెల్లడిస్తూ 'ఇది చరిత్రలోనే అతిపెద్ద మోసమ'ని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో వృథా ఖర్చును కట్టడి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన 'డోజ్' విభాగం... ఈ డేటాబేస్ తీగ లాగితే డొంక కదిలింది. సామాజిక భద్రత నంబర్లు ఉన్న వారి సంఖ్య ప్రస్తుతం అమెరికా జనాభాను దాటిపోయిందంటూ మస్క్ విస్మయం వ్యక్తం చేశారు. 2023 జూలైలో నిర్వహించిన ఆడిట్‌లో ఎస్ఎస్ఏ డేటాబేస్‌లో కోటీ 89 లక్షల మంది వందేళ్లు దాటిన వారున్నట్లు గుర్తించారు. కానీ జనాభా లెక్కల ప్రకారం దేశంలో 86 వేల మంది మాత్రమే వందేళ్లు దాటిన వారు ఉన్నట్లు తేలింది. 1886, 1893లో పుట్టినవాళ్లు కూడా ఇంకా జీవించి ఉన్నట్లు డేటాబేస్ చూపిస్తోంది. వీరందరికీ సోషల్ సెక్యూరిటీ నంబర్లు ఉన్నాయి. మరణాలకు సంబంధించిన సమాచారం ఎస్ఎస్ఏ రాకపోవడం, వచ్చినా నమోదు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దాంతో ఎప్పుడో గతించినా... డేటాబేస్ మాత్రం బతికే ఉన్నట్టు చూపిస్తోంది.

నన్ను చంపడానికి రెక్కీ

» బద్వేలు వైసీపీ నేత నుంచి కాపాడండి

» టీడీపీ గ్రీవెన్సులో బాధితుడి మొర

» ఇకపై న్యాయవాదితోనూ బాధితులకు సలహాలు: మంత్రి అనగాని

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన బద్వేల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ యర్రగొల్ల గోపాలస్వామి గుంటూరులో ఉంటున్న తమపై దాడికి యత్నిస్తున్నారని, ఓ భూకుంభకోణం కేసులో గోపాలస్వామి జైలుకు పోవడానికి కారణం తానేనని కక్ష పెంచుకుని తనను చంపేందుకు రెక్కీ నిర్వహిస్తున్నారని ముర్రా రాజన్న అనే వ్యక్తి టీడీపీ నేతలకు మొరపెట్టుకున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి పీతల సుజాత అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి గ్రామానికి చెందిన కె.ధనుంజయరావు.. తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు మంజూరైనా అడంగల్‌లో ఇనాం భూమిగా ఉందని, దీన్ని వెబ్ పోర్టల్‌లో మార్పించాలని కోరారు. ఏలూరు జిల్లా ఏలూరు మండలం వెంకటాపురానికి చెందిన ఫణికుమార్.. తాను సివిల్ ఇంజనీరింగ్ చదువుకున్నానని, వైసీపీ ప్రభుత్వం రెండేళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి, మూడేళ్లు ఇవ్వకపోవడంతో సర్టిఫికెట్లు కాలేజీలో ఉండిపోయాయని.. తన సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. వినతులు స్వీకరించిన అనంతరం అనగాని మాట్లాడుతూ.. టీడీపీ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం కుటుంబ సభ్యుల మధ్య తగాదాలే ఉంటున్నాయని, కోర్టుల్లో తేల్చుకోవాల్సిన అర్జీలూ ఉంటున్నాయని తెలిపారు. వాటి కోసం గ్రీవెన్స్‌లో లాయర్‌ను ఉంచి, అవసరమైన సలహాలు ఇప్పిస్తామన్నారు.

అర్ధరాత్రి సీఈసీ నియామకం

సుప్రీం ఉత్తర్వుల ఉల్లంఘనే!

ఎంపిక ప్రక్రియపై సుప్రీంలో విచారణ ఉండగా ఇలా చేస్తారా: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్త ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్‌కుమార్‌ను నియమించాలని అర్ధరాత్రి నిర్ణయించడం ద్వారా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అగౌరవంగా, అమర్యాదకరంగా వ్యవహరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని అన్నారు. అసలీ ఎంపిక ప్రక్రియనే సవాల్ చేస్తూ దాఖలుచేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరుగనుండగా.. సోమవారం రాత్రి పొద్దుపోయాక హడావుడిగా నిర్ణయం తీసుకోవడం ఏమిటని మంగళవారం 'ఎక్స్‌'లో ప్రశ్నించారు. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని ప్రధాని, విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేపట్టాలని ఆదేశిస్తూ 2023 మార్చి 2న రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. 'దురదృష్టవశాత్తూ.. ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తప్పించి.. ఆ స్థానంలో ప్రధాని నియమించే కేబినెట్ మంత్రిని చేర్చుతూ కేంద్ర ప్రభుత్వం 2023 ఆగస్టులో చట్టం తెచ్చింది. ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులను దారుణంగా ఉల్లంఘించడమే. సుప్రీంకోర్టు విచారణ పూర్తయ్యేదాకా కొత్త సీఈసీ ఎంపికను వాయిదా వేయాలన్నది కాంగ్రెస్ పార్టీ నిశ్చిత వైఖరి. కమిటీ సమావేశంలో ప్రధానికి, హోం మంత్రికి నా అసమ్మతి తెలియజేశాను. ఓ పక్క ఎంపిక కమిటీ కూర్పునే సుప్రీంకోర్టులో సవాల్ చేసినప్పుడు.. మరో 48 గంటల్లో కోర్టు ముందు విచారణకు రానున్నప్పుడు అర్ధరాత్రి కొత్త సీఈసీని ఎంపిక చేశారు' అని రాహుల్ ఆక్షేపించారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల కమిషన్ వ్యవహారాల్లో కార్యనిర్వాహక విభాగం జోక్యం చేసుకోరాదని హెచ్చరిస్తూ 1949 జూన్‌లో రాజ్యాంగ సభలో అంబేడ్కర్ చేసిన ప్రసంగాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, సుప్రీం కోర్టు తీర్పునకు రాహుల్ వక్ర భాష్యం చెబుతున్నారని ఆ పార్టీ ఐటీ విభాగం ఇన్‌చార్జి మాలవీయ విమర్శించారు. సుప్రీం తీర్పునకు ముందు సీఈసీ, కమిషనర్లను ప్రధాని సిఫారసు మేరకే రాష్ట్రపతి నియమించేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏలుబడిలో ఎన్నికల కమిషనర్లను ఎలా నియమించారో రాహుల్ మరచిపోయారా అని 'ఎక్స్‌'లో నిలదీశారు.

నేడు సుప్రీంకోర్టులో విచారణ

సీఈసీ, ఎన్నికల కమిషనర్లను 2023నాటి చట్టం ప్రకారం నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రాధాన్య ప్రాతిపదికన బుధవారం విచారణ జరుపుతామని సుప్రీం కోర్టు వెల్లడించింది. రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఉల్లంఘించి.. ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తప్పిస్తూ తీసుకొచ్చిన చట్టం కింద కేంద్రం సోమవారం సీఈసీ, ఎన్నికల కమిషనర్‌ను నియమించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

370 రద్దు వెనుక జ్ఞానేశ్‌కుమార్

నూతన ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ)గా నియమితులైన జ్ఞానేశ్‌కుమార్.. మోదీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాల్లో, వాటి అమల్లో కీలక భూమిక పోషించారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు, ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీరు, లద్ధాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ తీసుకొచ్చిన చట్టాలకు రూపకల్పన చేసింది ఆయనే. అంతే కాదు.. అయోధ్యలో రామాలయ నిర్మాణం చేపట్టిన రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటులోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 2018-21 నడుమ కేంద్ర హోం శాఖలో ఆయన అదనపు కార్యదర్శిగా పనిచేశారు. 2019లో 370 అధికరణ రద్దు, జమ్మూకశ్మీరు పునర్విభజన జరిగాయి. ఆ పునర్విభజన బిల్లును తయారుచేసే బాధ్యతను మోదీ ప్రభుత్వం జ్ఞానేశ్‌కుమార్‌కు అప్పగించింది. ప్రభుత్వం అతి రహస్యంగా తీసుకొచ్చిన బిల్లుల్లో ఇదొకటి. ఈయన కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. గతేడాది జనవరి 31న పదవీవిరమణ చేశారు. అదే మార్చిలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు సీఈసీగా 2029 జనవరి 26 వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా, ప్రస్తుత సీఈసీ రాజీవ్ మంగళవారం పదవీ విరమణ చేశారు.

రాష్ట్రానికి రూ. 1.07 లక్షల కోట్ల పెట్టుబడులు

» 22,726 మందికి ఉద్యోగాలు

» ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ పచ్చజెండా..

» భూముల కేటాయింపునకు అంగీకారం

» ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలకు ఓకే

అమరావతి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రూ. 1,07,670 కోట్ల పెట్టుబడులతో 22726 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు పలు పరిశ్రమలు ప్రతిపాదనలు పంపాయి. ఈ ప్రతిపాదనలకు మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎస్ విజయానంద్ నేతృత్వంలో సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రతిపాదనలు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న ఎస్ఐపీబీ భేటీలో ఆమోదించాల్సి ఉంది.

ఎస్ఐపీసీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో కొన్ని..

నాయుడుపేటలో ప్రీమియర్ ఎనర్జీస్ రూ. 1,742 కోట్లతో 1,000 మందికి ఉపాధి కల్పించేలా ఎంపీ సెజ్ ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలను ఇవ్వనుంది.

కడప జిల్లాలో దాల్మియా సిమెంట్స్ రూ.2,833 కోట్లతో ఏటా మూడున్నర మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ ప్లాంటు నిర్మించనుంది. 354 మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది. దీనికీ ప్రత్యేక రాయితీలివ్వాలని నిర్ణయించారు.

కృష్ణపట్నంలో కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్ (రిలయన్స్) రూ.1,566 కోట్లతో మెగా ఇండస్ట్రియల్ పార్కు స్థాపించనుంది. 400 మందికి ఉపాధి.

ఓర్వకల్లులో పీపుల్‌టెక్ ఎంటర్ ప్రైజెస్ రూ. 1,800 కోట్ల పెట్టుబడితో 4,800 మందికి ఉద్యోగాలు కల్పించేలా మొబిలిటీ పార్కు ఏర్పాటు. ఈ సంస్థకు 1,200 ఎకరాల కేటాయింపు.

ఇండోసోల్ సోలార్ కరేడులో రూ. 69,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థకు ప్రత్యేక ప్యాకేజీ కింద భూ బదలాయింపునకు ఎస్ఐపీసీ ఆమోదం తెలిపింది

లులూ ఇంటర్నేషనల్ షాపింగ్‌మాల్‌ను వైజాగ్‌లో ఏర్పాటు చేసేందుకు ఇచ్చిన ప్రతిపాదనలను ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌గా మార్పుచేయడాన్ని ఎస్ఐపీసీ ఆమోదించింది.

ఏపీఎన్‌జీఈఎల్ హరిత్ అమ్రిత్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ. 22,000 కోట్లతో 8,300 మందికి ఉపాధి కల్పించేలా 4,000 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది.

అన్నమయ్య జిల్లాలో రూ. 8,240 కోట్లతో 4,000 మందికి ఉపాధి కల్పించేలా పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రం ఏర్పాటుకు ఆమోదం.

సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ప్రైవేటు లిమిటెడ్ రూ. 1,057 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం.

టూరిజంలో మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్ అండ్ కన్వెక్షన్ రూ.400 కోట్ల పెట్టుబడితో 3,050 మందికి ఉద్యోగాలు ఇస్తామంటూ తెలిపింది. ఈ సంస్థకు 40 ఎకరాలివ్వడానికి ఆమోదం.

ఓబెరాయ్ విల్లాస్ రిసార్ట్స్‌కు 50 ఎకరాలను కేటాయించేందుకు ఎస్ఐపీసీ ఆమోదం.



ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం!

» ఖతార్ రాజు తమీమ్‌తో ప్రధాని చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: భారత్-ఖతార్‌ల మధ్య బంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చడంపై దృష్టి పెట్టాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, ఇంధనం, ప్రజా సంబంధాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సంప్రదాయ సంబంధాలను మరింత పటిష్ఠపర్చుకోవాలని తీర్మానించుకున్నారు. రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన ఖతార్ రాజు షేక్ తమీమ్‌తో మంగళవారం మోదీ సమావేశమయ్యారు. ద్వంద్వ పన్నుల నుంచి మినహాయింపు, పన్ను ఎగవేత అంశాలపై ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

వర్సిటీల ప్రతిష్ఠ దెబ్బతింది. ఆంధ్రా, నాగార్జున యూనివర్సిటీలు పూర్తిస్థాయి రాజకీయ కేంద్రాలుగా పనిచేశాయి. దీంతో యూనివర్సిటీలను తిరిగి గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ప్రతిభ ఆధారిత నియామకాలపై దృష్టి పెట్టారు. సామాజిక, ప్రాంతీయ సమతుల్యం పాటిస్తూనే విద్యారంగంలో నిష్ణాతులైన వారిని వీసీలుగా తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. జాతీయ విద్యా సంస్థల స్థాయిలో రాష్ట్ర యూనివర్సిటీలను తీర్చిదిద్దేలా ఈ నియామకాలపై దృష్టిపెట్టారు. ఇప్పటికే ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్‌ను నియమించారు. రాబోయే ఐదేళ్లలో అంతర్జాతీయ ర్యాంకింగ్ టాప్-100లో రాష్ట్ర యూనివర్సిటీలను ఉంచడమే లక్ష్యంగా వీసీల నియామకం చేపట్టారు.



సీఎస్ఆర్‌కే ప్రసాద్ – జేఎన్‌టీయూ- కాకినాడ | ఫణితి ప్రకాశ్‌బాబు – యోగి వేమన | అల్లం శ్రీనివాసరావు – విక్రమ సింహపురి | హెచ్.సుదర్శన్‌రావు – జేఎన్‌టీయూ-అనంతపురం | వి.ఉమ – పద్మావతి మహిళా వర్సిటీ | కె.రామ్‌జీ – కృష్ణా యూనివర్సిటీ

ఇవీ ప్రత్యేకతలు!

- 'ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న జీపీ రాజశేఖర్‌ను ఆంధ్రా యూనివర్సిటీకి వీసీగా నియమించారు. విశాఖపట్నానికి చెందిన ఆయన 13 ఏళ్లుగా ఖరగ్‌పూర్ ఐఐటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 2023లో 'నేషనల్ మేథమెటీషియన్ ఆఫ్‌ది ఇయర్‌'గా గుర్తింపు పొందారు. కృత్రిమ మేధ(ఏఐ)పై కూడా ఆయనకు అవగాహన ఉంది.
- 'ఎన్ఐటీ వరంగల్‌లో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న సీఎస్ఆర్‌కే ప్రసాద్ జేఎన్‌టీయూ కాకినాడకు వీసీగా నియమితులయ్యారు. బాపట్లకు చెందిన ఆయన 17 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో ఉన్నారు. 'భారత్-అమెరికా' ఉన్నతవిద్య సంప్రదింపుల్లో పాల్గొన్నారు.
- హైదరాబాద్ యూనివర్సిటీలో లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫణితి ప్రకాశ్‌బాబు.. యోగి వేమన యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ప్రొఫెసర్‌గా 31 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన లండన్, చెన్నై, జర్మనీల్లో బయాలజీపై పరిశోధనలు చేశారు. ఆయన స్వస్థలం ఎన్టీఆర్ జిల్లాలోని జగయ్యపేట.
- ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీలో అప్లైడ్ ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అల్లం శ్రీనివాసరావు విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కర్నూలుకు చెందిన ఆయనకు ప్రొఫెసర్‌గా 13 ఏళ్ల అనుభవం ఉంది. 2003, 2004లో పరిశోధనలపై అవార్డులు సాధించారు.
- ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న వి. వెంకట బసవరావును రాయలసీమ యూనివర్సిటీ వీసీగా నియమించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ చేసిన ఆయన అనేక హోదాల్లో పనిచేశారు. మంగళగిరికి చెందిన ఆయన పలు అవార్డులు అందుకున్నారు.
- ప్రస్తుతం జేఎన్‌టీయూ-అనంతపురం సంస్థలో ఇన్‌చార్జ్ వీసీగా ఉన్న హెచ్. సుదర్శన్‌రావు అదే యూనివర్సిటీకి వీసీగా నియమితులయ్యారు. ఆళ్లగడ్డకు చెందిన ఆయన ఐఐటీ-ముంబైలో పీహెచ్‌డీ చేశారు. 2008లో ఇంటర్నేషనల్ ఇంజనీర్ అవార్డు సాధించారు.
- పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా ఉన్న వి. ఉమ అదే యూనివర్సిటీకి వీసీగా నియామకం అయ్యారు. 23 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో ఉన్న ఉమ తెనాలికి చెందిన వారు.
- ఆంధ్రా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న కె. రామ్‌జీ.. కృష్ణా యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆయన ఐఐటీ-రూర్కీలో పీహెచ్‌డీ చేశారు. 18 ఏళ్లుగా ప్రొఫెసర్‌గా ఉన్నారు. గతంలో బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి వీసీగా పనిచేశారు.
- ఆంధ్రా యూనివర్సిటీలో ఆంగ్ల ప్రొఫెసర్‌గా ఉన్న ప్రసన్నశ్రీ ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. 22 ఏళ్లుగా ప్రొఫెసర్‌గా ఉన్నారు. రాష్ట్రపతి అవార్డు పొందారు. కువియా, కోయ, పోర్జ, జాతపు, కొండదొర, గడబ, కోలం, గోండి, కోటియా, సవర, కుర్రు, సుగాలి, గిరిజన తెగలకు 'లిపి'ని రూపొందించారు.

కొత్తగా నియమితులైన వీసీలు

యూనివర్సిటీ	వీసీ పేరు	ప్రస్తుత స్థానం
ఆంధ్రా యూనివర్సిటీ	జీపీ రాజశేఖర్	ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్
జేఎన్‌టీయూ- కాకినాడ	సీఎస్ఆర్‌కే ప్రసాద్	ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్
యోగి వేమన	ఫణితి ప్రకాశ్‌బాబు	హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్
విక్రమ సింహపురి	అల్లం శ్రీనివాసరావు	ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్
రాయలసీమ యూనివర్సిటీ	వి. వెంకట బసవరావు	ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్
జేఎన్‌టీయూ-అనంతపురం	హెచ్.సుదర్శన్‌రావు	జేఎన్‌టీయూ-అనంతపురం ప్రొఫెసర్
పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం	వి.ఉమ	పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్
కృష్ణా యూనివర్సిటీ	కె.రామ్‌జీ	ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్
ఆదికవి నన్నయ	ప్రసన్నశ్రీ	ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్



శ్రీగిరిపై నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, అమరావతి: ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బ్రహ్మోత్సవాల సమయంలో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ప్రముఖులకు 4 విడతలుగా బ్రేక్ దర్శనం కల్పిస్తారు. ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు, పాదయాత్రికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాగా, శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబును దేవదాయశాఖ అధికారులు ఆహ్వానించారు. మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, వేదపండితులు ఉండవల్లిలోని సీఎం నివాసానికి చేరుకుని ఆయనకు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందించారు.

మిలీషియా కమాండర్ లొంగుబాటు

ఎటపాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం ఓఎస్డీ జగదీష్ అడహళ్లి ఎదుట మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ మడకం రామా మంగళవారం లొంగిపోయాడు. ఎటపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓఎస్డీ ఈ వివరాలు వెల్లడించారు. మావోయిజంతో సాధించేదేమీ లేదన్న అభిప్రాయంతో పాటు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడై పోలీసుల ఎదుట లొంగిపోయాడని ఓఎస్డీ వివరించారు..

తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా

కాకినాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నాలుగోసారీ వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. వరుసగా నాలుగుసార్లు ఎన్నిక రద్దయిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ వ్యవహారాన్ని అధికారులు తీసుకువెళ్లారు. కాగా, నాలుగోసారి ఎన్నిక నేపథ్యంలో మంగళవారం తుని మున్సిపాల్టీ ఎదుట తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికకు టీడీపీ తరఫున పదిమంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వైసీపీ తన 17మంది కౌన్సిలర్లను నిర్బంధించి ఎన్నికకు రాకుండా అడ్డుకుంది.

అడ్డుగా వచ్చిన ఎలుగుబంటిని తప్పించబోయి..
దివ్యాంగుడి మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

హరిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా మందస మండలం ముకుందపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందసకు చెందిన దివ్యాంగుడు తామాడ జయరాం(40) మృతి చెందగా.. అతని భార్య కన్నికు తీవ్ర గాయాలయ్యాయి. దంపతులు వారి త్రి చక్రవాహనంపై సోంపేట నుంచి మందస వస్తుండగా.. ముకుందపురం వద్ద ఎలుగుబంటి అడ్డుగా వచ్చింది. దీన్ని తప్పించబోయిన జయరాం వాహనాన్ని అదుపులోకి తెచ్చుకోలేకపోయాడు. దీంతో వాహనం రోడ్డుపైనే బోల్తాపడింది. జయరాం తలకు బలమైన గాయమవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్యకు కాళ్లు, ముఖంపై గాయాలయ్యాయి. జయరాం కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు.

భారీ మెజారిటీ రావాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి లోకేశ్ సమీక్ష
- ఎన్నికల వ్యూహంపై పార్టీ నేతలకు దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షం పోటీలో లేదని నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. పార్టీ నేతలంతా రాబోయే వారం రోజులు ఎమ్మెల్సీ ఎన్నికలపైనే దృష్టి పెట్టి పనిచేయాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉభయగోదావరి, గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం ఉండవల్లి నివాసంలో పార్టీ నేతలతో లోకేశ్ సమీక్షించారు. ప్రతి ఓటరును పార్టీ నేతలు నేరుగా కలవాలని, అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా చొరవ చూపాలని సూచించారు. కూటమి నేతలను కలుపుకొని ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికలు జరిగే 67 నియోజకవర్గాల్లో క్లస్టర్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని నిర్దేశించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల విజయం కోసం బుధవారం నుంచి ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో ఎంపీ భరత్, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

26,27 తేదీల్లో ఎమ్మెల్సీ పోలింగ్ జరిగే జిల్లాల్లో సెలవు

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగే జిల్లాల్లో పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, అవసరమైతే ఓట్ల లెక్కింపు రోజు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సెలవు ప్రకటించే అధికారాన్ని ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఈమేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఈనెల 27న రెండు గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 27న పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగుతుంది.

వక్ఫ్ బోర్డు సీఈవోగా మహ్మద్ అలీ

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోగా మహ్మద్ అలీ నియామకం అయ్యారు. మంగళవారం మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

ఏపీ ఇన్నోవేషన్స్ సొసైటీ సీఈవో ఎంపికకు ప్యానెల్

ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్స్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నియామకానికి ప్యానెల్ ఏర్పాటు కానుంది. ఈమేరకు మంగళవారం ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వు జారీచేశారు. ఐటీ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే ఈ ప్యానెల్‌లో ఐటీశాఖ స్పెషల్ సెక్రటరీ, ఐఐఎం విశాఖపాకల్టీ సభ్యుడు, రాష్ట్ర ఐటీ అసోసియేషన్స్ ప్రతినిధి,ఏపీటీఎస్ ఎండీ సభ్యులుగా ఉంటారు.

కాలినడకమార్గంలో గుండెపోటుతో భక్తుడి మృతి

తిరుమల, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం కాలినడకన తిరుమలకు వస్తున్న ఓ తెలంగాణ భక్తుడు మంగళవారం గుండెపోటుతో మరణించాడు. రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్‌కు చెందిన వెంకటేశ్(50) కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి శ్రీవారిమెట్టు మార్గంలో మంగళవారం ఉదయం తిరుమలకు బయలుదేరాడు. 400వ మెట్టు వద్ద ఒక్కసారిగా ఛాతినొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

పారాణి ఆరనే లేదు...

- వివాహమైన మూడో రోజే నవ వధువు ఆత్మహత్య



సుస్మిత

కంభం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాళ్లపారాణి ఆరక ముందే ఓ నవవధువు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా కంభం మండల దేవనగరంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవనగరం గ్రామానికి చెందిన బి.లింగయ్య, సువార్తమ్మ కుమార్తె సుస్మిత(21)కు పెద్దారవీడు మండలం సిద్దినాయుడుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఈనెల 16న వివాహమైంది. పెళ్లి కుమారుడి గ్రామంలో వివాహం జరిగింది. సోమవారం ఉదయం సుస్మిత, వెంకటేశ్వర్లు దేవనగరం వచ్చారు. దేవనగరం నుంచి వరుడు గ్రామానికి బుధవారం సారె తీసుకుని వెళ్లాలి. అందు కోసం మంగళవారం ఉదయం నుంచి కుటుంబసభ్యులు హడావుడిగా ఉన్నారు. ఆ సమయంలో సుస్మిత తాను బాబాయి వాళ్ల ఇంట్లో నిద్రపోతానని వెళ్లింది. పెళ్లి కుమారుడు అత్తగారి ఇంట్లో నిద్రపోయాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సుస్మితను భోజనానికి పిలిచేందుకు అన్న మహేష్ వెళ్లాడు. ఇంట్లో చెల్లెలు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటం గమనించి కిందికి దించాడు. విషయం తెలిసి కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి చూసి అప్పటికే మృతిచెందినట్టు గుర్తించారు. వివాహమైన మూడో రోజే సుస్మిత అఘాయిత్యానికి పాల్పడటంతో రెండు కుటుంబాల వారు బోరున విలపిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఇష్టం లేని పెళ్లి చేశారని, దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పెళ్లికుమారుడి కుటుంబసభ్యులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్టు ఎస్సై నరసింహారావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త సీఈసీ

దాదాపు మూడేళ్ళపాటు భారత ఎన్నికల సంఘం సారథిగా ఉన్న రాజీవ్‌కుమార్ స్థానంలోకి జ్ఞానేశ్ కుమార్ వచ్చారు. సీఈసీగా జ్ఞానేశ్ పదోన్నతి పొందడంతో ఆ స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషీ నియమితులైనారు. జ్ఞానేశ్‌కు ప్రమోషన్, మూడునెలల్లోనే హర్యానానుంచి జోషీని తెచ్చి ఈసీగా నియమించడం లక్ష్యంగా సోమవారం ఎంపిక కమిటీ భేటీ అయినప్పుడు విపక్షనాయకుడు రాహుల్ గాంధీ ఆ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదావేయాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం తొలిసారిగా ఈ ఎంపికలు ఉండబోతున్నందున, సెలక్షన్ ప్యానెల్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కోర్టు నిగ్గుతేల్చేవరకూ కొత్త సీఈసీపై నిర్ణయాన్ని వాయిదావేయాలన్నది రాహుల్ సూచన. కానీ, ఆయన మాటను లక్ష్యపెట్టకుండా ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఈ రెండు పోస్టులు నింపేసినందుకు కాంగ్రెస్ ఆగ్రహిస్తోంది. త్రిసభ్య కమిటీ సమావేశంలో సమర్పించిన నోట్‌ను రాహుల్‌గాంధీ ప్రజాక్షేత్రంలో పెట్టి, ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తున్నారు. అంతా బానే ఉంది కానీ, సదరు పిటిషన్ విచారణలో ఉన్నంతమాత్రాన నియామకాలు ఆపేయాలన్న నియమమేమీ లేదు. కొత్తచట్టం ప్రకారం నడవడానికి వీల్లేదనో, ఎంపికలు కూడదనో సుప్రీంకోర్టు చెప్పలేదు. పైపెచ్చు, పిటిషన్‌దారు చేసిన అటువంటి విన్నపాన్ని త్రోసిపుచ్చి, పరోక్షంగా మార్గాన్ని సుగమం చేసింది కూడా. రాహుల్ వాదనలో ఔచిత్యం లేకపోలేదు. కానీ, కేసు విచారణలో ఉన్నందున కాస్తంత ఓపికపడితే సరిపోతుందని, వ్యవస్థల ఔన్నత్యాన్నీ, మర్యాదలను కాపాడినట్టూ అవుతుందని ప్రభుత్వ పెద్దలు కూడా అనుకోవాలి కదా!

రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టును చూపి బెదిరిస్తున్నారు కానీ, అదేమీ హడావుడి పడటంలేదు. మోదీ ప్రభుత్వం తనకు నచ్చిన చట్టం చేసుకొని, మెచ్చినవారిని నియమించుకుంటున్నందుకు అభ్యంతరమూ లేదు. ప్రశాంత్‌భూషణ్ ఒత్తిడిచేస్తున్నా న్యాయమూర్తులు ప్రశాంతంగానే ఉన్నారు. బుధవారం కేసు విచారణ ఉండగా, సోమవారమే ఈ రెండు నియామకాలు జరిగిన విషయాన్ని ప్రశాంత్ భూషణ్ మంగళవారం మరోమారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వరుసలో నలభయ్యోస్థానంలో ఉన్న ఈ కేసు బుధవారం సైతం విచారణకు రాకపోవచ్చుననీ, ప్రాధాన్యత రీత్యా దానిని ముందుగానే చేపట్టాలని ఆయన విజ్ఞప్తిచేస్తే, రేపటి సంగతి రేపు చూద్దామని జస్టిస్ సూర్యకాంత్ తేల్చేశారు. ఇప్పటివరకూ మూడు నియామకాలు ఇదే తీరున జరిగిన విషయాన్ని కూడా పిటిషనర్ న్యాయమూర్తికి గుర్తుచేశారు. నిజానికి, ఫిబ్రవరి 12న జరగాల్సిన విచారణ19వ తేదీకి వాయిదావేసినప్పుడే, అంతలోగా సీఈసీ నియామకం పూర్తయిపోతుందని పిటిషన్‌దారులు ఆందోళన వెలిబుచ్చారు. జరగాల్సింది జరుగుతుందనీ, అన్నీ అంతిమతీర్పుకు కట్టుబడి ఉంటాయని న్యాయమూర్తులు ఓ నామమాత్రపు హామీ ఇచ్చారు.

ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేనందున, అది తయారయ్యేలోగా, ప్రధాన న్యాయమూర్తి కూడా భాగస్వామిగా ఉన్న ప్యానెల్ ద్వారా భర్తీ జరగాలని సుప్రీంకోర్టు 2023 మార్చిలో తీర్పు చెప్పింది. అదే ఏడాది చివర్లో కేంద్రప్రభుత్వం చట్టం చేసుకుంది, అందులో చీఫ్ జస్టిస్ స్థానంలోకి హోంమంత్రి వచ్చారు. తటస్థుడైన మూడో వ్యక్తికి చోటులేకపోయింది. చట్టం తయారైంది కానీ, సారాంశంలో సుప్రీంకోర్టు ఆశయమైతే అందులో మిగల్లేదు. ఎన్నికల కమిషనర్ల నియమకాలు అన్ని రకాల ప్రభావాలకు అతీతంగా, స్వతంత్రంగా, కార్యనిర్వాహక వ్యవస్థకూ, రాజకీయాలకూ అతీతంగా జరగాలన్నది ఆ తీర్పు సారాంశం. కానీ, ఉన్న ముగ్గురిలో ఇద్దరు అధికారపక్షం నుంచే ఉన్నప్పుడు విపక్షనేత మాట చెల్లుబాటయ్యే అవకాశమే ఉండదు. పైగా, ప్రజాస్వామ్యంలో అతిముఖ్యమైన ఎన్నికల ప్రక్రియను ఒత్తిళ్ళకు అతీతంగా నిర్వహించాల్సిన ముగ్గురు అధికారులను కమిటీలో ఉన్న ముగ్గురు రాజకీయ నాయకులు నియమించడం మరో విచిత్రం. అంతిమంగా ఈ ప్రక్రియకు గౌరవమే లేకుండా పోయింది. ఎన్నికల సందర్భంలో కమిషనర్ల నిర్ణయాలు వివాదాస్పదం కావడం నిత్యకృత్యమైంది. కొత్తచట్టం మీద సుప్రీంకోర్టు కొత్తగా ఏమి చెబుతుందో తెలియదు కానీ, ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన జమ్మూకశ్మీర్‌ను చక్కబెట్టడం నుంచి, రామజన్మభూమి ట్రస్టు ఏర్పాటువరకూ ఎన్నో రాచకార్యాలను చక్కబెట్టిన జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో రాబోయే నాలుగేళ్ళలో ఇరవై అసెంబ్లీ ఎన్నికలు జరిగి, సార్వత్రిక ఎన్నికలకు కూడా రంగం సిద్ధం కాబోతున్నది.

నిన్నగాక మొన్నటి దాకా తాము దేశాన్ని ఏలిన నాయకులమనే అభిజాత్యాన్ని కాంగ్రెస్ నేతలు వీడలేకపోతున్నారు. యువతకు చేరువ కావడానికి ముమ్మరంగా ప్రయత్నించవలసిన కాంగ్రెస్ ఇంకా పురా వైభవ స్మృతులలోనే మునిగి తేలుతోంది. 7–18 సంవత్సరాల వయసులోని నవతరాన్ని ఆకర్షించే దిశగా 'జవహర్ బాల మంచ్'ను నెలకొల్పాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు జారీ చేసిన ఆదేశాలను అధికారంలో ఉన్న తెలంగాణలోనే పట్టించుకోవడం లేదు!

కాంగ్రెస్ : కూలుతున్న మహావృక్షం

గల్ఫ్ లేఖ

భారతవని రాజకీయ మహావృక్షం భారత జాతీయ కాంగ్రెస్ క్రమేణా బలహీనపడుతోంది. పార్లమెంటులో ప్రభావశీలతను, ప్రజల్లో ఆకర్షణ శక్తిని కోల్పోతోంది. ఒకటి, రెండు మినహాయించి ప్రతీ ఎన్నికలలోనూ ఈ జాతీయ సంస్థ ప్రాబల్యం సన్నగిల్లుతోంది. దేశ జనాభాలో సగానికి మించి ఉన్న యువతతో మమేకం కాలేకపోతోంది. అసలు యువజనులను తన వైపు ఆకట్టుకోవడంలో సాఫల్య వైఫల్యాలు అటుంచి కనీసం వారిని తన రాజకీయ కార్యకలాపాలలో భాగస్వాములుగా చేసుకునేందుకు ఒక అడుగు కూడ ముందుకు వేయడం లేదు.

దేశ ప్రగతి నిర్మాణ శక్తి యువతే కదా. అయినా యువ భారతీయులతో యువనేత రాహుల్‌గాంధీ సారథ్యంలో సైతం మమేకం కాలేకపోవడం కాంగ్రెస్ కష్టాలకు ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఒకప్పుడు అనునిత్యం వివిధ కార్యక్రమాలతో నిమగ్నమై నేటి తరానికి మేటి నాయకులను అందించిన యువజన కాంగ్రెస్ నేడు ఫెక్సీలకు కూడ పనికి రాకుండ పోగా, విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యుఐ ఉనికినే కోల్పోయింది. గతంలో ఢిల్లీ కాంగ్రెస్‌లోనే కాదు జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీ యూత్ బ్రిగేడ్‌లో ప్రముఖుడుగా భాసించిన సందీప్ దీక్షిత్ ఘోర పరాజయం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన విషయం కానే కాదు. షీలా దీక్షిత్ తనయుడు అయిన సందీప్‌కు వచ్చిన ఓట్లు కాంగ్రెస్ పతనావస్థకు సంకేతం. మారిన, మారుతున్న లోకం పోకడలను అర్థం చేసుకోకుండా ఒకనాటి తమ అధికార దర్పంతో ఎక్కువ స్థానాలకు పట్టుబట్టడం, ఆ తర్వాత పరాజయం పాలై ప్రభావం కోల్పోవడం కాంగ్రెస్‌కు పరిపాటి అయిపోయింది.

నిన్నగాక మొన్నటి దాకా తాము దేశాన్ని ఏలిన నాయకులమనే అభిజాత్యాన్ని కాంగ్రెస్ నేతలు వీడలేకపోతున్నారు. నాటి నవాబులూ సరిగ్గా ఇలానే వ్యవహరించేవారు. లక్నో నవాబుల వారసురాలుగా చెప్పుకున్న ఒక మహిళకు 1985లో రాజీవ్‌గాంధీ న్యూ ఢిల్లీలో ఒక బంగ్లాను కేటాయించారు. నవాబు వాజీద్ అలీ షా వారసురాలుగా తాను ఆ బంగ్లాలో ఉండడం తన వంశ స్థాయికి తగదని ఆమె తిరస్కరించారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు వేచి ఉండే గదిలో తొమ్మిది సంవత్సరాలు గడిపిన అనంతరం, ఆమెకు ఢిల్లీ శివారులోని ఒక నిర్మానుష్య శిథిల భవంతి అయిన మల్చా మహల్‌ను కేటాయించారు. తలుపులు లేని ఆ హర్మ్యంలో విద్యుత్ కాదు కదా కనీసం మంచి నీటి వసతి కూడ లేదు. అలా తాను ఇంకా నవాబు వంశస్థురాలుననే భ్రమల్లో ఆమె బతికింది. ఈ రకంగా అనేక మంది గడిచిపోయిన గతం నుంచి వర్తమానంలోకి రాకుండ భ్రమల్లో గడుపుతుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకగణం పరిస్థితి కూడ సరిగ్గా ఇదే విధంగా ఉంది.



చెప్పవచ్చినదేమిటంటే యువతకు చేరువ కావడానికి ముమ్మరంగా ప్రయత్నించవలసిన కాంగ్రెస్ ఇంకా పురా వైభవ స్మృతులలోనే మునిగి తేలుతోంది. ప్రత్యర్థి బిజెపి తన వాట్సాప్ విశ్వవిద్యాలయం ద్వారా దేశంలోనే కాదు విదేశాలలోని భారతీయ యువతను సైతం ఆకర్షించడంలో సఫలమయింది. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే వ్యూహాలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ప్రగతిశీల భావజాల ప్రాతిపదికపై పార్టీని పునర్నిర్మించేందుకై 7–18 సంవత్సరాల వయసులోని నవతరాన్ని ఆకర్షించే దిశగా 'జవహర్ బాల మంచ్' (జె.బి.యం)ను నెలకొల్పాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు జారీ చేసిన ఆదేశాలను అధికారంలో ఉన్న తెలంగాణలోనే పట్టించుకోవడం లేదంటే కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. ఇక రాహుల్‌గాంధీ నిత్యం ఉద్ఘాటిస్తుండే సైద్ధాంతిక విధానాలు ఆయన్ను అనుసరిస్తున్న ఎంత మంది నాయకులకు అర్థమవుతున్నాయనేది ఒక అంతు చిక్కని ప్రశ్న. యువ కిశోరాలుగా దేశాన్ని ఆకర్షించిన కన్హయ కుమార్, హార్దిక్ పటేల్, జిగ్నేష్ మేవానీలను సరైన రీతిలో వినియోగించుకోలేదు. ఇదే కన్హయ కుమార్ బిజెపిలో చేరి ఉంటే ఆ పార్టీ అతన్ని ఏ విధంగా ఉపయోగించుకునేదో ఒక్కసారి ఆలోచించాలి. ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో యువతలో బలమైన సంస్థాగతమైన పట్టు కలిగి ఉండి మజ్లిస్, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలను దీటుగా ఎదుర్కొన్న హైద్రాబాద్ నగర కాంగ్రెస్ విభాగం నేడు నిర్వీర్యమైపోయింది. పార్టీ నిర్మాణాన్ని పక్కన పెడితే నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి కనీసం కార్యవర్గాన్ని కూడ నియమించుకోలేకపోతున్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్ కార్యకలాపాలు ఏ రీతిలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. తెలంగాణలో వారసత్వంగానైనా కొంత మంది యువనేతలు శాసన సభకు ఎన్నికయినప్పటికి పార్టీ పట్ల వారి విధేయత ఎంత అనేది ఒక అంతుబట్టని ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు ఎవరైనా విదేశీ పర్యటనలకు వస్తే వారిని కలుసుకోవడానికి ప్రవాసులు ఇష్టపడడం లేదు. పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నాయకగణం కూడా తమ విదేశీ పర్యటనల్లో జనాలను కలుసుకోవడానికి ఇష్టపడక పోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

1999లో ఢిల్లీలో కురిసిన భారీ వర్షాలకు 24, అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఒక మహా వృక్షం తన నీడలో ఉన్న ఒక చిన్న మందిరంపై కూలిపోవడాన్ని అపశకునంగా అనేక మంది భావించారు. సంవత్సరాల తరబడి వేళ్ళు దెబ్బతిన్న చెట్టు ఒక్క పది నిమిషాల వర్షానికి కూలిపోవడం ఆశ్చర్యం కాదని ఆ సందర్భంగా సోనియాగాంధీ వ్యాఖ్యానించారని చెబుతారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అనే మహా వృక్షం వేళ్ళన్నీ కూడ పూర్తిగా దెబ్బతిని కూలిపోతోంది. ఈ పతన క్రమంలో అక్కడక్కడ మిగిలి ఉన్న పచ్చని కాండాన్ని చూసి మురిసిపోతే ఎలా?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ ఘటనలు ఏ వైఫల్యాలకు సంకేతం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రతీదాన్నీ వ్యతిరేక దృక్పథంతో చూడడం సరైంది కాదని లోకమంతా పచ్చగా ఉన్నదని నమ్మేవారు అంటారు కాని కొన్ని దృశ్యాలు చూసినప్పుడు మనసు కలచివేస్తుంటే మాట్లాడకుండా ఎలా ఉండగలం? అమెరికా నుంచి వందలాది భారతీయులను పెడరెక్కలు విరిచి కట్టి జంతువుల్లా సైనిక విమానాల్లో పడవేసి వెనక్కు పంపుతున్న దృశ్యాలు గతంలో కోవిడ్ సమయంలో వేలాది కూలీలు నగరాలనుంచి తమ ఊళ్లకు మైళ్లకు మైళ్ల నడిచి వెళ్లిన దృశ్యాలను తలపించడం లేదా? 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభమేళా వస్తుందని, ఫలానా రోజు మునిగితే ఇంకా పుణ్యం వస్తుందని ప్రభుత్వమే ప్రచారం చేస్తే తండోపతండాలుగా తరలి వచ్చిన ప్రజలు తొక్కిసలాటకు గురై మృత్యువాత పడ్డ దృశ్యాలను చూసి బాధపడకుండా ఎలా ఉండగలం? ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసి ఒకసారి ప్లాట్ ఫారంపైకి జనం వచ్చేలా చేసి ఒకర్నొకరు తొక్కుకుని అయిదుగురు పిల్లలతో సహా 18 మంది మరణించడానికి ఎవరు బాధ్యులు? బిహార్‌లో కిక్కిరిసిన రైలులో ఎక్కలేమన్న ఆగ్రహంతో ఏసీ కోచ్‌ల కిటికీల అద్దాలను రాళ్లతో పగులగొట్టి మరీ చొచ్చుకు వచ్చిన దుండగులకు ఏ నదిలో మునిగితే మాత్రం పాపవిమోచనం లభిస్తుంది?

ఈ దృశ్యాలన్నీ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనుకుంటున్న భారతదేశానికి శుభ సూచకాలు మాత్రం కాదని చెప్పగలం. తమ స్వంతదేశం నుంచి అమెరికాకు పొట్ట చేత బట్టుకుని వచ్చిన లక్షలాది మందిలో భారతీయులు సంఖ్యరీత్యా అయిదవ స్థానంలో ఉంటారని మైగ్రేషన్ పాలసీ ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. నలుగురు భారతీయుల్లో ఒకరికి సరైన పత్రాలు ఉండవని సెంటర్ ఫర్ మైగ్రేషన్ స్టడీస్ వంటి సంస్థలు చెబుతున్నాయి. స్వంత ఊళ్లో పనిదొరక్క వలస కూలీలు పట్టణాలకు వలస వచ్చినట్లే స్వంతదేశంలో పని దొరక్క ఏదో ఒక ఏజెంట్‌కు డబ్బులు ముట్టచెప్పి అమెరికాలాంటి దేశాలకు వెళుతున్నారంటే దానికి కారణం ఏమిటి? సముద్రాలు, కొండలు, కోనలు, అడవులు దాటి భార్యాపిల్లలతో పాటు మైళ్లకు మైళ్లు నడిచి దొంగ మార్గాల్లో భారతీయులు అమెరికాలో ప్రవేశించేందుకు ఎందుకు తహతహలాడుతున్నారు? మన దేశంలో వారు శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని పొంది హుందాగా జీవించేందుకు అవకాశాలు దొరకనందువల్లే కదా? మన నిరుద్యోగ సమస్యను మనం పరిష్కరించుకోలేక, అమెరికా మన వారిని అమానుషంగా పంపిస్తున్న తీరును బహిరంగంగా ఖండించలేక మన నేతలు సతమతమవుతున్నారు. 'అక్రమంగా వెళ్లిన వారిని వెనక్కు తీసుకుంటాం, మనుషులను అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటాం' అని వినిపిస్తున్న అధికారిక స్వరాల్లో బలహీన నిస్సహాయత ప్రతిధ్వనిస్తోంది. 'మావారిని వెనక్కు పంపండి కాని వారి పట్ల మానవత్వంతో వ్యవహరించండి..' అని అమెరికాను అభ్యర్థించినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ పార్లమెంట్‌లో చెప్పిన తర్వాత కూడా అదే విధంగా చేతులకు గొలుసులతో, కాళ్లకు సంకెళ్లతో భారతీయులను వెనక్కు పంపారు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాకు వెళ్లి కీలకమైన వ్యాపార, రక్షణ ఒప్పందాలను కుదుర్చుకుని వచ్చారు. గతంలో హౌడీమోడీ, నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాల్లో తాను, ట్రంప్ దిగిన ఫోటోలను ఆల్బమ్‌గా తయారు చేసి కలిసికట్టుగా మన ప్రయాణం పేరుతో మోదీ బహూకరిస్తే, 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యు ఆర్ గ్రేట్' అని ట్రంప్ ఆ ఆల్బమ్‌పై సంతకం చేశారు. భారత, అమెరికా దేశాల స్నేహ సంబంధాలు ఇలా పరిడవిల్లుతున్న సమయంలో వలసవెళ్లిన వారి గురించి అపస్వరాలు ఎందుకు వినిపిస్తాయి?

నిజానికి అమెరికా అంటేనే వలసవచ్చిన వారి దేశం. ప్రపంచంలోని అన్ని దేశాలనుంచి వచ్చిన వారి కష్టంతో బలపడ్డ దేశం. అక్కడి పారిశ్రామికీకరణకు చెమటోడ్చిన వలస కూలీలు, వినూత్న ఆవిష్కరణలకు తోడ్పడిన వివిధ దేశాలకు చెందిన మేధావులకు కృతజ్ఞత ప్రకటించాల్సిన దేశం. గూగుల్, యాహూ, ఇన్‌స్టాగ్రామ్, హఫింగ్టన్ పోస్ట్ అనేక సంస్థల్ని వలసవచ్చిన వారే స్థాపించారు. సిలికాన్ వాలీలో వందల కోట్ల డాలర్ల స్టార్టప్‌లను స్థాపించిన సగం మంది ఇతర దేశాల నుంచి వచ్చిన వారే. ప్రపంచీకరణ మూలంగా ఏర్పడ్డ ఆర్థిక మాంద్యం, లక్షలాది మంది ఉపాధి కోల్పోవడం వల్ల అందుకు వలస వచ్చినవారిని నిందిస్తున్నారు కాని రీగన్ హయాంలో పత్రాలు లేని వారికి కూడా చట్టపరమైన హోదా కల్పించి ఇముడ్చుకున్న దేశం అమెరికా. 'Coalition for Humane Immigrant Rights of Los Angeles' (చిర్లా) అనే సంస్థ అక్రమంగా వలస వచ్చిన వారికి డాక్యుమెంట్లను తయారు చేసి అమెరికాలో గౌరవంగా స్థిరపడేందుకు తోడ్పడింది. స్కూళ్లకు పిల్లల్ని పంపడానికి, డాక్టర్ల వద్దకు వెళ్లడానికీ భయపడ్డ అనేకమంది ప్రవాసులకు డెమొక్రాటిక్ పార్టీ అండగా నిలిచిన రోజులున్నాయి.

ఏ కారణాల వల్ల నైతేనేం, ఇవాళ పత్రాలు సరిగా లేవని అనేకమందిని వారి వారి స్వదేశాలకు పంపిస్తున్న అమెరికాలో నేర న్యాయవ్యవస్థ ఎంత ఘోరంగా ఉన్నదో బైడెన్ హయాంలో ఉపాధ్యక్షురాలుగా ఉన్న కమలా హారిస్ తన ఆత్మకథ 'The Truths We Hold: An American Journey'లో వివరించారు. కొన్ని దశాబ్దాల పాటు అటార్నీగా పనిచేసిన ఆమె అమెరికా క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ అంతటా వివక్ష తాండవిస్తోందని రాశారు. తప్పుచేసిన కారు డ్రైవర్లలో 85 శాతం నల్లవారే పోలీసుల చర్యలకు లోనవుతారని, జైలు పాలయ్యే నేరస్థుల్లో తెల్లవారి కంటే నల్లవారే ఆరు శాతం ఎక్కువ మంది ఉంటారని, తెల్లవారి కంటే 20 శాతం ఎక్కువగా నల్లవారికి సుదీర్ఘకాలం శిక్ష పడుతుందని, బెయిల్ కోసం తెల్లవారి కంటే 35 శాతం ఎక్కువగా వారు చెల్లించాల్సి ఉంటుందని ఆమె వివరించారు. పోలీసుల క్రూరత్వానికి తెల్లవారి కంటే నల్లవారే బలవుతారని ఆమె చెప్పారు. 'వీధుల్లో పెట్రోలింగ్ చేసే పోలీసులు తమను చితకబాదుతారని, కొట్టి చంపుతారని ఒక వర్గం ప్రజలు భయపడితే మనం స్వేచ్ఛా సమాజంలో జీవిస్తున్నట్లా? మన న్యాయవ్యవస్థలో పోలీసుల క్రూరత్వానికి తగినట్లు శిక్షలు లేకపోతే మనం ఏ సందేశం పంపుతున్నట్లు?' అని ఆమె ప్రశ్నించారు. ఒక బ్యాక్‌పాక్ దొంగిలించినందుకు అరెస్టయి, బెయిల్ వచ్చేందుకు 3వేల డాలర్లు చెల్లించలేక, మూడేళ్ల పాటు జైలులో ఒంటరి నిర్బంధానికి గురైన బ్రౌడర్ అనే 16 ఏళ్ల యువకుడి ఉదంతాన్ని ఆమె తన ఆత్మకథలో వివరించారు. అమెరికాలో నగదుకు బెయిల్ ఇచ్చే పద్ధతి సంపన్నులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉన్నదని చెప్పారు. 'పేదరికంలో ఉన్నందుకు ప్రజలను శిక్షించేది ఒక న్యాయమా?' అని ఆమె ప్రశ్నించారు. 2000–14 సంవత్సరాల మధ్య జైళ్లలో ఉన్న 95 శాతం మంది విచారణ కోసం ఎదురు చూస్తూ గడిపారని తెలిపారు. నిర్బంధితుల్లో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, గర్భిణీ స్త్రీలను కూడా గొలుసులతో బంధిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తన ఆత్మకథను విడుదల చేసి పతితులు, అభాగ్యులపై కమలా హారిస్ ఎంత ఆవేదన వ్యక్తపరిచినా ఆమెను ప్రజలు అమెరికా అధ్యక్షురాలిగా ఎంపిక చేసుకోకపోవడం, ట్రంప్‌ను గెలిపించడం వివిధ దేశాల్లో మారుతున్న ప్రజల ఆలోచనా విధానానికి నిదర్శనం.



సంకెళ్లతో భారతీయులను అమెరికా నుంచి పంపించినా; ప్రయాగ్‌రాజ్, న్యూఢిల్లీలో జనం తొక్కిసలాటకు గురై మరణించినా; బిహార్‌లో రైళ్లపై జనం దాడి చేసినా ఇవన్నీ మన దేశంలో వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం. ప్రజలకు ఉపాధి కల్పించలేని వైఫల్యం ఒకవైపు, పాలనా యంత్రాంగాలను సక్రమంగా నిర్వహించలేని అసమర్థత మరోవైపు దేశాన్ని వికసిత భారత్‌గా మార్చగలుగుతాయా?

భారతదేశంలో ఎన్ని ఘోర ప్రమాదాలు జరిగినా బాధ్యతను స్వీకరించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం, మరణాలను యథాలాపంగా తీసుకోవడం సాధారణమైంది. 1956లో మహబూబ్‌నగర్, తమిళనాడులో జరిగిన ఘోర రైలు ప్రమాదాలకు బాధ్యత వహించి అప్పటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారు. తర్వాతి కాలంలో నితీశ్ కుమార్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు కూడా ఇదే విధంగా రైలు ప్రమాదాలకు బాధ్యత వహించి రాజీనామా చేశారు. పీవీ హయాంలో మాధవరావు సింధియా కూడా ఒక విమాన ప్రమాదానికి బాధ్యత వహించి పదవిని వదులుకోవడానికి సిద్ధపడ్డారు. కాని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటకు ఒక్కొక్కరు ఒక్కొక్క కారణాన్ని చెప్పి తప్పించుకుంటున్నారు. ఒకే పేరుతో ఉన్న రెండు రైళ్లు వచ్చాయని, అందువల్ల ప్రమాదం జరిగిందని ఢిల్లీ పోలీసులు అంటే, ఎవరో కుట్రలో భాగంగా పుకార్లు ప్రచారం చేసినందువల్లే ప్రమాదానికి దారి తీసిందని రైల్వే మంత్రి చెప్పారు. ఎవరో మెట్లపై నుంచి కాలు జారిపడ్డారని, ఆ తర్వాత జనం ఒకరిపై మరొకరు పడ్డారని రైల్వే అధికారులు తెలిపారు. ఎర్రటి టోపీలతో కొందరు వచ్చి పడుకున్నవారిని లేపారని వారు భయంతో పారిపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని మరో ప్రచారం వినబడింది.

కుంభమేళాకు వెళ్లే రైళ్లు ఆలస్యం కావడం, రాత్రి 7.30 గంటల నుంచే భారీగా స్టేషన్‌లో జన సమూహం పోగు కావడం, ఎటువంటి ఆలోచన లేకుండా గంటకు 1500 టిక్కెట్ల చొప్పున వేల కొద్ది టిక్కెట్లు కౌంటర్‌లో అమ్మడం, అకస్మాత్తుగా ప్లాట్ ఫారం మార్పు గురించి ప్రకటనలు జారీ చేయడం వల్ల ఈ తొక్కిసలాట జరిగింది. ఇదంతా స్పష్టంగా నిర్వహణ లోపమన్న విషయం స్పష్టం కావడం లేదా? దీనికి ఎవరు బాధ్యత వహించాలి? బాధ్యత వహించి తప్పిదాన్ని అంగీకరించడానికి బదులు కుట్ర జరిగిందని చెప్పడం ఏ మానసిక స్థితికి నిదర్శనం? కేజ్రీవాల్ హయాంలో దేశ రాజధాని ఢిల్లీలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ప్రచారం చేసినవారు తమ అధీనంలో ఉండే న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ప్రజలు కుంభమేళాకు వెళ్లేందుకు సాఫీగా ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారు? కోట్లాది మంది వస్తున్నారని తెలిసినా ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాటను ఎందుకు నివారించలేకపోయారు?

సంకెళ్లతో భారతీయులను అమెరికా నుంచి పంపించినా, ప్రయాగ్‌రాజ్, న్యూఢిల్లీలో జనం తొక్కిసలాటకు గురై మరణించినా, బిహార్‌లో రైళ్లపై జనం దాడి చేసినా ఇవన్నీ మన దేశంలో వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం. ప్రజలకు ఉపాధి కల్పించలేని వైఫల్యం ఒకవైపు యంత్రాంగాలను సక్రమంగా నిర్వహించలేని అసమర్థత మరోవైపు భారత దేశాన్ని వికసిత భారత్‌గా మార్చగలుగుతాయా అన్న సందేహాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పంచాయతీరాజ్ సార్థకమయ్యేది ఎలా?

73, 74వ రాజ్యాంగ సవరణ జరిగి 30 సంవత్సరాలు అయినా, పంచాయతీరాజ్, పట్టణ సంస్థల 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, సిబ్బంది నియామకం జరగలేదు. పంచాయతీరాజ్‌లో అదనంగా జడ్పీటీసీలు, ఎంపీటీసీల వ్యవస్థ ప్రవేశపెట్టడం పలు వివాదాలకు దారితీసింది. గతంలో పంచాయతీలు, మండల పరిషత్‌లకు; మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు అనుసంధానం ఉండేది. నేడు అది కరువైంది. 2002లో నాటి ప్రభుత్వం రెవెన్యూ అధికారులను కూడా పంచాయతీలకు అప్పగించి గ్రామపంచాయతీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంది. దీన్ని పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వాగతించారు. కానీ 2007లో ప్రభుత్వం మారగానే రెవెన్యూ వ్యవస్థను తిరిగి పంచాయతీల నుంచి విడగొట్టారు. దీంతో గౌరవ వేతనం మీద రెవెన్యూ శాఖలో పార్ట్ టైంగా పని చేసినవారు 2002లో పంచాయతీ కార్యదర్శులుగా శాశ్వత ఉద్యోగిగా లబ్ధి పొందారు. కానీ తిరిగి రెవెన్యూ శాఖకు వెళ్లిపోయారు. ఇది పంచాయతీరాజ్ శాఖలోని ఉద్యోగులకు కాకుండా రెవెన్యూ శాఖ సిబ్బందికి ఉపయోగపడింది.

2019లో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పరిపాలన బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పి, గ్రామ సచివాలయం వ్యవస్థను ప్రవేశపెట్టి, అందులో సుమారు లక్షా పాతికవేల మందిని నియమించారు. అంతేగాక సుమారు రెండు లక్షల మంది వాలంటీర్లను కూడా నియమించారు. కానీ, సదరు గ్రామ సచివాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ నుంచి విడగొట్టి వేరొక శాఖ ఏర్పాటు చేశారు. అంటే ప్రజా సంక్షేమం గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా వేరొక శాఖ ద్వారా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది చాలా బాధాకరం.

నేటి కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆలోచించడం సముచితమే. ఈ సందర్భంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో అటు పరిపాలనాపరంగా, వ్యవస్థాపరంగా జరగవలసిన మార్పులేమిటో చూద్దాం.

నేడు జిల్లా పరిషత్, మండల పరిషత్ ద్వారా గ్రామీణ వ్యవస్థకు సంబంధించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే కలెక్టర్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిపాలన వ్యవస్థ కొనసాగుతోంది. ఈ రెండు వ్యవస్థలు కూడా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏర్పాటయినవే. రాజ్యాంగ సవరణ ప్రకారం 29 శాఖలకు సంబంధించిన సిబ్బందిని కూడా పంచాయతీరాజ్ సంస్థల పరిధిలోకి తేవాల్సిన సందర్భంలో పటిష్ఠమైన అధికార వ్యవస్థ ఉండాలి. అందుకు గ్రామ, మండల, డివిజనల్, జిల్లా, రాష్ట్ర శాఖలో ఏ విధంగా మార్పులు చేస్తే బాగుంటుందో పరిశీలిద్దాం.

గ్రామపంచాయతీ కార్యదర్శి పేరును కార్యనిర్వహణ అధికారిగా గతంలో ఉన్నట్టుగానే పునరుద్ధరించాలి. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్‌లోని ఆరు వ్యవస్థలను మూడుగా కుదించాలి. గతంలోని గ్రేడ్–1, గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శిలను ఒక గ్రేడ్‌గాను (జోనల్ స్థాయి రిక్రూట్‌మెంట్); మూడు, నాలుగు గ్రేడ్లను రెండో గ్రేడ్‌గాను; ఐదు ఆరు గ్రేడ్‌లను మూడో గ్రేడు (జిల్లా గ్రేడ్లుగా)గా మార్పు చేయాలి.

మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పేరును మండల ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మార్పు చేయాలి. ప్రతి మండలంలో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక మండల విస్తరణ అధికారి పోస్టు మంజూరు చేసి, దానికి మండల పంచాయతీరాజ్ సంక్షేమ అధికారిగా పేరు పెట్టాలి. అలాగే నేడున్న విస్తరణాధికారి పేరును మండల పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్పు చేయాలి. ఈ మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు డివిజనల్ పంచాయతీ అధికారి ఆధీనంలో పనిచేయాలి.

ఇక డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారికి గ్రామ సచివాలయం, గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యక్రమాల విధులను పరిరక్షించే బాధ్యతను అప్పగించాలి. నేడున్న డివిజనల్ అభివృద్ధి అధికారి పోస్టును మండల పరిషత్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారుల ద్వారా 1:1 శాతంతో భర్తీ చేయాలి.

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేయాలి. సర్పంచులు మండల పరిషత్ అధ్యక్షుడిని, మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకొనేటట్లుగా మార్పులు తీసుకురావాలి. అలాగే శాసనపరమైన అంశాలపైన ప్రజాప్రతినిధులు చేసుకునే అప్పీళ్లను పరిశీలించడానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం సంబంధిత నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపునకు చర్యలు తీసుకోవాలి. కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయంలో ఒక విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయాలి. అందులో ఒక ఎస్పీ స్థాయి అధికారిని నియమించాలి.



అలాగే జిల్లా స్థాయిలోని జిల్లా పంచాయతీ అధికారి హోదాను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి హోదాతో సమానం చేయాలి. జిల్లా పంచాయతీ అధికారి పేరును కూడా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా మార్పు చేయాలి. జిల్లా పరిషత్‌లో గల జిల్లా కార్యనిర్వాహణాధికారి, జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి పోస్టులను డివిజనల్ అభివృద్ధి అధికారులతో భర్తీ చేయాలి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టులను పరస్పరం బదిలీ చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలి. జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టులను కూడా డివిజనల్ అభివృద్ధి అధికారులతో పరస్పర బదిలీ విధానంగా ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లా పరిషత్‌లోను జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో గణాంక అధికారి పోస్టులను మంజూరు చేయాలి. జిల్లా పరిషత్‌లోని గణాంక అధికారి, జిల్లా పంచాయతీ కార్యాలయం అధికారులను పరస్పరం బదిలీ చేసే విధానం ఏర్పాటు చేయాలి.

రాష్ట్రస్థాయిలోకి వచ్చేసరికి కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయంలోని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో నేడున్న ద్వంద్వ పరిపాలన విధానాన్ని తొలగించి, ఒకే గూడు కింద పరిపాలన తీసుకురావాలి. కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు పంచాయతీరాజ్ విభాగం నుంచి సహకారం అందించడానికి ఒక అదనపు కమిషనర్, అలాగే గ్రామీణ అభివృద్ధి విషయాలలో సహకారం అందించటానికి మరొక అదనపు కమిషనర్‌ను ఏర్పాటు చేయాలి. గ్రామీణాభివృద్ధి విభాగంలో రెండు జాయింట్ కమిషనర్ పోస్టులు, 4 ఉప కమిషనర్లు, 8 సహాయక కమిషనర్లతో పాటు 12 సెక్షన్లు ఏర్పాటు చేయాలి. అలాగే పంచాయతీ విభాగంలో ఇద్దరు జాయింట్ కమిషనర్ల పోస్టులు, నాలుగు ఉప కమిషనర్లు, 8 సహాయక కమిషనర్లతో పాటు 12 సెక్షన్లను ఏర్పాటు చేయాలి. ఈ పోస్టులను క్రింది స్థాయి అధికారులతో భర్తీ చేయాలి. ప్రతి సెక్షన్‌కు ఒక పరిపాలన అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉండాలి. అలాగే అదనంగా 12 డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను కూడా ఏర్పాటుచేసి వారి సేవలను ఉపయోగించుకోవాలి.


కమిషనర్ కార్యాలయంలో ఒక ఫైనాన్షియల్ కమిషనర్ పోస్టును ఏర్పాటు చేయాలి. ఈ పోస్టును ఐఎఎస్ హోదా అధికారి ద్వారా భర్తీ చేయాలి. రెండు ముఖ్య గణాంక అధికారుల పోస్టులు ఏర్పాటు చేయాలి. వారిలో ఒకరు పంచాయతీరాజ్ లెక్కలు, మరొకరు గ్రామీణాభివృద్ధిలో గణాంక విషయాలు చూడాలి.

నేడున్న గ్రామపంచాయతీలను కూడా మూడు గ్రేడ్లుగా విభజించాలి. మొదటిది– 5వేలు లోపల జనాభా, రెండోది– ఐదు–పదివేల మధ్యన జనాభా, మూడోది– పదివేల పైబడి జనాభా కలిగిన పంచాయతీలుగా విభజించాలి. పదివేలు పైబడిన జనాభా కలిగిన పంచాయతీల్లో గ్రేడ్ వన్ కార్యదర్శులను (నేడున్న ఒకటి, రెండు గ్రేడ్లు కలిపి), 5–10వేల మధ్య కలిగిన జనాభాలో పంచాయతీలో గ్రేడ్–2 (నేడున్న మూడు, నాలుగు గ్రేడ్లు కలిపి), ఐదు వేల కంటే తక్కువ జనాభా కలిగిన పంచాయతీల్లో గ్రేడ్–3 (నేడున్న 5, 6 గ్రేడ్లు కలిపి) పంచాయతీ కార్యదర్శులను నియమించాలి.

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థను రద్దు చేయాలి. సర్పంచులు మండల పరిషత్ అధ్యక్షుడిని, మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకొనేటట్లుగా మార్పులు తీసుకురావాలి. అలాగే శాసనపరమైన అంశాలపైన ప్రజాప్రతినిధులు చేసుకునే అప్పీళ్లను పరిశీలించడానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం సంబంధిత నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపునకు చర్యలు తీసుకోవాలి. కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయంలో ఒక విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయాలి. అందులో ఒక ఎస్పీ స్థాయి అధికారిని నియమించాలి.

ఇలా తగు చర్యలు తీసుకుంటే పంచాయతీరాజ్ సంస్థల మధ్యన సమన్వయం ఏర్పడి, సమర్థంగా పరిపాలన సాగడమే కాకుండా పంచాయతీరాజ్ సంస్థలు ఆర్థికంగా కూడా నిలదొక్కుకోవడానికి, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. తద్వారా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిజమవుతుంది.

■ టి.యం.బి బుచ్చిరాజు
చైర్మన్, ఏపీ పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్



బదిలీలలు

దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో మాయాజాలం

యథాస్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ

దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో అధికారులు మాయాజాలం ప్రదర్శించారు. పనిచేస్తున్న వారిని మళ్లీ అదే స్థానానికి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చి బదిలీల ఉద్దేశ్యాన్నే నీరుగార్చారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, కొట్టు సత్యనారాయణ సిఫార్సులతో వచ్చి పాతుకుపోయిన వారికి మళ్లీ అదే ప్రాధాన్యత ఇచ్చి విమర్శలు మూటకట్టుకున్నారు దుర్గగుడి అధికారుల నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- వైసీపీ హయాంలో సిఫార్సులతో వచ్చిన వారికి అదే ప్రాధాన్యత
- అవే విభాగాలు ఇచ్చినపుడు.. ఇక బదిలీ ఉత్తర్వులెందుకంటూ విమర్శలు





(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పలు కీలక విభాగాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ బదిలీ ఉత్తర్వులు చూసి అందరూ నివ్వెరపోయారు. ఎక్కడి వారిని అక్కడే బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం.

- ఎం.దుర్గారావు అనే ఉద్యోగి ప్రస్తుతం స్థలాలు, లీజులు, లీగల్, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, పండుగలు, పూజలు నిర్వహిస్తుంటారు. తాజా బదిలీల్లో ఈయనకు మళ్లీ ఇవే బాధ్యతలతో పాటు అదనంగా దత్తత ఆలయాల బాధ్యతలను కూడా అప్పగించారు.
- పి.చంద్రశేఖర్ అనే ఉద్యోగి ప్రస్తుతం అన్నదానం, ప్రసాదం తయారీ, శానిటేషన్, వేదపాఠశాల బాధ్యతలు నిర్వహిస్తుండగా.. తాజా బదిలీల్లోనూ మళ్లీ అవే శాఖలు ఇచ్చారు.
- పి.సుధారాణి అనే ఉద్యోగిని చీరలు, ఆడిట్ అండ్ జనరల్, అకౌంట్స్, ప్రావిజన్ స్టోర్స్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, తాజా బదిలీల్లో అవే బాధ్యతలతో పాటు అదనంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ కల్పించారు.
- జె.శ్రీనివాస్ అనే ఉద్యోగి ఎస్టాబ్లిష్‌మెంట్, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్ ట్రస్ట్ బోర్డు, సూపర్‌వైజేషన్ ఆఫ్ సెక్యూరిటీ, హోంగార్డ్స్ అండ్ సెక్యూరిటీ, అకామిడేషన్, కేశఖండనశాల, ఫస్ట్ ఎయిడ్, ఆర్‌టీఐ యాక్ట్, ధర్మపథం, దత్తత దేవాలయాలు, స్టేషనరీ, ఎంపీ ఫోమ్స్ వంటి బాధ్యతలు చూస్తుండగా కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంట్, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్ ట్రస్ట్ బోర్డు బాధ్యతలను తిరిగి కొనసాగించటంతో పాటు అదనంగా కనకదుర్గ ప్రభ బాధ్యతలు అప్పగించారు.
- ఎన్.రమేష్‌బాబు అనే ఉద్యోగి మిగతా 6లో..

వైసీపీ హయాంలో వచ్చి పాతుకుపోయారు..

పైన చెప్పుకున్న ఉద్యోగుల్లో కొందరు మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, వెలంపల్లి శ్రీనివాసరావు హయాంలో వారి సిఫార్సులతో వచ్చిన వారు ఉన్నారు. దాదాపుగా రెండేళ్ల పాటు వీరంతా ఆయా విభాగాల్లో పాతుకుపోయారు. ఇలాంటి వారిని పూర్తిగా వేరే విభాగాలకు బదిలీ చేయాల్సి ఉండగా, అదే విభాగాలకు బదిలీ చేయటం విమర్శలకు తావిస్తోంది. దేవాలయాల్లో పనిచేసే వారిని వాస్తవంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఎక్కడా ఇది అమలు కావడం లేదు. దుర్గగుడిపై గత రెండేళ్లగా పనిచేస్తున్నా అంతర్గత బదిలీలు జరగ లేదు. వీరిలో కొందరిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

అలైన్‌మెంట్‌లో అవినీతి!

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిర్వాకం

- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో.. గొల్లపూడిలో అలైన్‌మెంట్ మార్పు
- అనుమతి పొందిన అలైన్‌మెంట్ ఒక చోట.. వేసింది మరోచోట
- పొలం పోయి.. పరిహారం అందక అన్యాయమైన రైతులు
- కోర్టుకు వెళ్లినా పరిహారం ఇవ్వని పవర్ గ్రిడ్ కార్పొరేషన్
- ఈ మోసంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వానికి వేడుకోలు



పై శాటిలైట్ చిత్రంలో కనిపిస్తున్నది విజయవాడ వెస్ట్ బైపాస్‌లో భాగంగా ఎన్‌హెచ్-65పై గొల్లపూడి ఆర్‌వోబీ అప్రోచ్‌కు దిగువున వెళ్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్) ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్. పసుపు రంగులో ఉన్నది ప్రస్తుత పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ట్రాన్స్‌మిషన్ లైన్ వెళ్తున్న మార్గం. అయితే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా రూపొందించిన ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్ అలైన్‌మెంట్ ప్రకారం పైచిత్రంలో మీరు చూస్తున్న గ్రీన్ లైన్ మీదుగా లైన్‌ను మార్చాల్సి ఉంది. ఇది అప్రూవ్డ్ లైన్. కానీ రెడ్ లైన్‌లో అమాయక రైతుల పొలాల మీదుగా వేశారు. ఈ చిత్రంలో గులాబి రంగులో మార్కింగ్ చేసినది సర్వే నంబర్ 138/2ఏలోని ల్యాంకో టౌన్‌షిప్. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అలైన్‌మెంట్ ప్రకారం ఈ టౌన్‌షిప్‌ను తాకుతూ సర్వే నంబర్ 138/1, సర్వే నంబర్ 120/1ఏలోని అనాథరైజ్డ్ ప్లాట్ల మీదుగా వెళ్లాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు పెద్దలను వదిలేసి సామాన్య రైతులను బలి చేశారు. -ఆంధ్రజ్యోతి, విజయవాడ

ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడేందుకే..

ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడటం కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తన అలైన్‌మెంట్‌కు భిన్నంగా, అలైన్‌మెంట్ పరిధిలో లేని సర్వే నంబర్ 137/1జేలో ఉన్న ముప్పా సేతు నారాయణ అనే రైతు పొలం మీదగా తీసుకెళ్లింది. ఈ విషయం ఆ రైతుకు తెలియదు. నిజంగా తన పొలం మీద నుంచే వెళుతుందనుకుని మిన్నకుండిపోయారు. పరిహారం అందకపోవటంతో అనుమానం వచ్చి టవర్ల మీద పోరాటం చేస్తున్న మిగతా 6లో..



సబ్‌జైలు వద్ద వైసీపీ శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు

జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం

బెజవాడ సబ్ జైలులో వంశీని కలిసిన మాజీ సీఎం జగన్

గుంపులుగా తరలివచ్చిన వైసీపీ కార్యకర్తలు

- జైలుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు
- తోసుకుంటూ ముందుకొచ్చి పోలీసులపై వీరంగం
- లాఠీచార్జి చేసి పరిస్థితిని చక్కదిద్దిన వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ గాంధీనగర్‌లోని జిల్లా సబ్‌జైలు వద్ద జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం ప్రదర్శించింది. పోలీస్ ఆంక్షలను పట్టించుకోకుండా చెలరేగిపోయింది. జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం వచ్చారు. ఆయన రాక గురించి ముందే సమాచారం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని ముందే ఊహించిన పోలీసులు జైలుకు ఉన్న అన్ని మార్గాలను మూసివేశారు. ఎలాంటి వాహనాలు, అనుమతిలేని వ్యక్తులు ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినా వాటిని తోసుకుని వైసీపీ కార్యకర్తలు గుంపులు గుంపులుగా జైలు వద్దకు చేరుకున్నారు. పోలీసులు జగన్‌కు దుర్గా మహల్ వైపున ఉన్న మార్గాన్ని కేటాయించారు. అయినా కాన్వాయ్ రావడానికి ముందే కార్యకర్తలు బారికేడ్లను తోసుకుంటూ రోప్ పార్టీలను నెట్టేసుకుంటూ జైలు వద్దకు చేరుకున్నారు.



సబ్‌జైలులో వంశీని కలిసి బయటకు వస్తున్న వైఎస్ జగన్

ప్రెస్‌క్లబ్ ఉన్న మార్గంలోనూ ఈ విధంగానే వ్యవహరించారు. ఈక్రమంలో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులు వారిని తప్పించి జగన్ కారును లోపలికి పంపించారు. కారులో జగన్‌తో పాటు మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, దేవినేని అవినాష్ ఉన్నారు. అంతకు ముందే వంశీ సతీమణి పంకజ శ్రీ సబ్ జైలుకు చేరుకున్నారు. తనతో పాటు వంశీకి దుస్తులు తీసుకొచ్చారు. వంశీని పరామర్శించటానికి జగన్, వంశీ మిగతా 6లో..

వామ్మో.. వసతి గృహం!

- పర్యవేక్షణ లేదు.. పౌష్టికాహారం అందదు
- వార్డెన్‌ను చూసి రెండేళ్లు : విద్యార్థినులు
- మైలవరం బీసీ బాలికల వసతిగృహంలో వింతలు
- మండిపడుతున్న ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు

6లో

క్లిష్టమైన భూ సమస్యలకు పరిష్కారం

- కలెక్టర్ లక్ష్మీశ

8లో

నేత్రపర్వం

వైభవంగా వీరమ్మ శిడిబండి ఉత్సవం
భారీగా తరలివచ్చిన భక్తులు



వీరమ్మ తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న శిడిబండి ఉత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు జనసంద్రమైంది. దళిత యువకుడు ఉయ్యూరు మౌర్య కిరణ్ (పెళ్లి కొడుకు) నివాసం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చీర, సారెతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా పెళ్లి కొడుకు బయలుదేరగా, శిడిబండికి దారిపొడవునా బిందెలతో నీళ్లు వారబోసి మహిళలు హారతులిచ్చారు. శివాలయం రోడ్డు నుంచి ప్రధాన సెంటర్ మీదుగా ఊయల స్థంభాల వద్ద ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న శిడిబండి ఉట్టిలో పెళ్లికొడుకును కూర్చుండబెట్టి ఆలయ ప్రదక్షిణ చేశారు. జై వీరమ్మ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. -ఆంధ్రజ్యోతి,ఉయ్యూరు

కొత్త బాస్!

కృష్ణా యూనివర్సిటీ వీసీగా కె.రాంజీ

ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

కృష్ణా యూనివర్సిటీ వీసీ నియామకంపై నెలకొన్న ఉత్కంఠకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో తెరపడింది. నూతన వైస్ చాన్సలర్‌గా కె.రాంజీని నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు రాంజీ ఈ పదవిలో కొనసాగుతారు. ఈయన ప్రస్తుతం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగాను ఈయన 2015-2018 వరకు పనిచేశారు.

- మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న రాంజీ
- ఆరు నెలలుగా ఇన్‌చార్జి వీసీ పాలనలో వర్సిటీ





కృష్ణా యూనివర్సిటీ, (ఇన్‌సెట్‌లో) వీసీగా నియమితులైన రాంజీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలతో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన కృష్ణా యూనివర్సిటీ వీసీ జి.జ్ఞానమణి ఏడాది కూడా పూర్తి కాకుండానే ఆ పదవి నుంచి తప్పుకున్నారు. అనంతరం కాకినాడ జేఎన్‌టీయూలో పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు.

సమస్యల స్వాగతం

నూతన వీసీకి సమస్యలతో కృష్ణా యూనివర్సిటీ స్వాగతం పలుకుతోంది. ఇక్కడ పనిచేసే ప్రొఫెసర్లు, ఉద్యోగుల మధ్య విభేదాలు ఉన్నాయి. ప్రొఫెసర్లు తరగతులకు వెళ్లకుండా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతారనే విమర్శలున్నాయి. యూనివర్సిటీకి నిధులను ఇష్టానుసారంగా వినియోగించడం, పక్కదారి పట్టించడంలో ఇక్కడి అధికారులకు వెన్నతోపెట్టిన విద్య అనే అపవాదును మూటకట్టుకున్నారు. 2021లో నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీ నిధులు రూ.5.25 లక్షలతో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడంపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం ఈ నిధులు కేటాయింపుపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. దీంతో పాటు యూనివర్సిటీలో జరిగిన ఆర్థికపరమైన అవకతవకలపై గత ఏడాది డిసెంబరు 13వ తేదీన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంపైనా పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.

పరీక్షలు, రీసెర్చ్ విభాగాల్లో గందరగోళం

యూనివర్సిటీలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రీసెర్చ్ విభాగాల్లో పరిపాలన గాడితప్పింది. ఎనిమిది నెలలుగా జవాబు పత్రాల మూల్యాంకనం బిల్లులు చెల్లించకుండా యూనివర్సిటీ అధికారులు తొక్కిపెట్టారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు ఈ అంశంపై ఆందోళనకు దిగడంతో నెలరోజుల కిందట ఈ బిల్లులను విడుదల చేశారు. కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లను సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. రీసెర్చ్ విభాగంలో 57 ఫైల్స్ మాయం కావడం వివాదాస్పదంగా మారింది. రీసెర్చ్ విభాగం నుంచి స్కాలర్స్‌కు సరైన సహకారం లేకపోవడం, నెలల తరబడి గైడ్‌లను నియమించడంలో జాప్యం, సకాలంలో పీహెచ్‌డీ, ఎంఫిల్ పట్టాలను అందజేయకపోవడం తదితరాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

నిలిచిన భవనాల నిర్మాణం

వర్సిటీని 2008, ఏప్రిల్‌లో ప్రారంభించారు. 2019 వరకు మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ కొనసాగింది. 2019 జనవరిలో మచిలీపట్నం మండలం రుద్రవరంలో రూ.88 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన నూతన భవనాల్లోకి మారింది. వర్సిటీ ఏర్పడి 17 ఏళ్లు గడచినా విద్యార్థులకు విడివిడిగా వసతిగృహాల నిర్మాణం చేయలేదు. నాలుగేళ్ల కిందట ఈ వసతి గృహాల నిర్మాణం ప్రారంభించినా పునాదుల దశను దాటలేదు. వసతి గృహాలు లేకపోవడంతో పీజీ కోర్సుల్లో విద్యార్థులు ఆశించినంతగా చేరడం లేదు. వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థుల వసతి గృహాలు, ప్రాంగణం చుట్టూ ప్రహరీ, మెయిన్ గేట్, ఫార్మసీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, ఫుడ్‌కోర్టు, నూజివీడు పీజీ సెంటరులో బాలికల వసతిగృహం భవనంపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణాలకు తొలుత రూ.43.31 కోట్లతో అంచనాలు మిగతా 6లో..

అగ్నిప్రమాదంలో కాలిపోయిన విద్యార్థుల మంచాలు



'రీచ్'లో అగ్నిప్రమాదం

విద్యార్థులకు తప్పిన పెనుముప్పు

- కారిడార్‌లో 35 మంది నిద్రిస్తుండగా మంటలు
- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు

6లో

మట్టి కొట్టొద్దు..!

- కొత్తూరు తాడేపల్లి వద్ద మట్టి పాత్రల తయారీకి బ్రేక్
- పంచాయతీ అనాలోచిత నిర్ణయం.. కుమ్మర్లకు శాపం
- తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రల ఎగుమతి అధికంగా ఇక్కడి నుంచే
- అసలే అంతరించిపోనున్న కుమ్మర్ల పని.. ఉన్న వాటిని తొలగిస్తే ఎలా ?
- ప్రత్యామ్నాయం చూపకపోగా ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కుమ్మర్లు

8లో



దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

» శాఖల వారీగా పలువురికి బాధ్యతలు

» ఉత్తర్వులు జారీ చేసిన ఈవో



ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పరిపాలనా సౌలభ్యం కోసం పలువురు సిబ్బందిని వివిధ శాఖలకు అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎం.దుర్గారావుకు భూముల లీజులు, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, ఉత్సవాలు, పూజలు, దత్తత ఆలయాలను కేటాయించారు. పి.చంద్రశేఖర్‌కు అన్నప్రసాదాల తయారీ, శానిటేషన్, వేదపాఠశాలల నిర్వహణ కేటాయించారు. పి.సుధారాణికి చీరలు, ఆడిట్, సెంట్రల్ ప్రొవిజన్ స్టోర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను కేటాయించారు. జె.శ్రీనివాస్‌కు పరిపాలన, ప్రధాన ఆలయం, ఉపాలయాలు, ట్రస్ట్‌బోర్డు, కనకదుర్గ ప్రభ విభాగాలు, ఎస్.రమేష్‌బాబుకు వసతి, ఎస్పీఎఫ్, హోంగార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులపై పర్యవేక్షణ, కేశఖండనశాల, శానిటరీ తదితరాలను కేటాయించారు. ఎం.శ్రీనివాసరావుకు గణాంకాలు, ఐటీ రిటర్న్‌లు, ట్ర్యూకటీసీ, జీఎస్టీ రిటర్న్‌లు, ప్రధాన ఆలయం విధులు కేటాయించారు. బీఎస్.జగదీష్ ప్రసాద్‌కు పరిపాలన, కొండదిగువన కౌంటర్ల పర్యవేక్షణ, వేదపాఠశాల విధులు అప్పగించారు. పి.సునీతకు అన్నప్రసాదాల విభాగం కేటాయించారు. కనకదుర్గ ప్రభ మాసపత్రిక సంపాదకుడు కె.గంగాధర్‌కు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాలను అప్పగించారు. ఆయన ఇకపై అదనంగా పీఆర్వో విధులను నిర్వహించనున్నారు. పత్రికా ప్రకటనల తయారీ, వ్యతిరేక కథనాలకు రిజాయిండర్లను పంపడం, ఈవోకు ఎప్పటికప్పుడు వార్తా కథనాలను తెలియచేసి సూచనలు తీసుకోవాల్సి ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, పారాయణలు, సప్తాహాలు వంటివాటిని నిర్వహించాలి. ఉత్సవాలు, పండుగల సమయంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన గుర్తింపు పొందిన వలంటీర్ల వ్యవస్థలను సమన్వయం చేస్తూ లయజన్ అధికారిగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు అన్యాయం : రవీంద్ర రాజు

గాంధీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామవార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరిట ఎంతోమంది వీఆర్వోలు పని ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో పనిఒత్తిడి తగ్గి, పదోన్నతులు, పెండింగ్ డీఏలు, బకాయిలు, ఐఆర్, ప్రకటిస్తారని ఆశించిన ఉద్యోగులు కూటమి ప్రభుత్వ గెలుపునకు కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందన్న ఉద్యోగులు నిరాశతో ఉన్నారన్నారు. కొందరు అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తూ ఈ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రెవెన్యూశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమించడం ద్వారా వారిపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. సచివాలయాల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని పునరాలోచించి ఒక సచివాలయానికి ఒక వీఆర్వోగా ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని కోరారు. అర్హులైన వీఆర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్స్‌గా, గ్రేడ్-2 వీఆర్వోలను గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు.



వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

» కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

» ఘంటసాలలో ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన

ఘంటసాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగులో నూతన సాంకేతిక విధానాన్ని రైతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఘంటసాలలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద మంగళవారం కిసాన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త వంగడాలను రూపొందించి, ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాంత పరిస్థితులు, భూములకు అనుకూలంగా విత్తనాలను రూపొందించి రైతులకు అందిస్తున్న శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు. తొలుత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. వివిధ రకాల పంటలను, డ్రోన్ ద్వారా మందుల పిచికారిని పరిశీలించారు. అనంతరం ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్.శారదా జయలక్ష్మీదేవి, పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా.వి.సత్యప్రియ లలిత, కెవికె ప్రధాన శాస్త్రవేత్త డా.డి.సుధారాణిలు కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడులు చేసి.. నిప్పు పెట్టిన వారికి పరామర్శలా!

» జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంలో దళితులు, యువకులు, మహిళలపై దాడిచేసి పార్టీ కార్యాలయం, కార్లు తగులబెట్టి, వ్యక్తుల్ని గాయపరిచిన వ్యక్తికి వత్తాసు పలికేందుకు జగన్‌రెడ్డి సిగ్గుపడాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలు దేశ చరిత్రలోనే లేవన్నారు. దాడి గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తిని కిడ్నాప్ చేసిన వంశీని సిగ్గులేకుండా పరామర్శకు జగన్ వెళ్లారన్నారు. ప్రశాంతంగా ఉన్నటువంటి కృష్ణా జిల్లాలో పులివెందుల ఫ్యాక్షనిజాన్ని తీసుకురావడానికి జగన్‌రెడ్డి గూండాలు ప్రయత్నించారన్నారు. ఎంతోమంది మేధావులు పుట్టిన కృష్ణాజిల్లాను రౌడీమూకలతో దాడి చేయించి దిగజార్చే విధంగా చేసిన నీచుడు జగన్‌రెడ్డి అన్నారు. జగన్‌రెడ్డి హయాంలో పోలవరం గట్ల మీద, బ్రహ్మలింగం చెరువు గట్ల మీద మట్టి కాజేశారన్నారు. అక్రమంగా దాడులు చేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసి ఇనుపరాడ్లతో మహిళలపై దాడులు చేశారన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇలాంటి అరాచకాలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తామన్నారు. అధికారం ఉంది కదా అని జిల్లాలో వల్లభనేని వంశీ, కొడాలి నాని, జోగి రమేష్, పేర్ని నాని చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు.

శ్రీశైలం యాత్రకు ప్రత్యేక బస్సు

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ఈ బస్సు రాజమండ్రి నుంచి బయలుదేరుతుంది. మొత్తం మూడు రోజులపాటు యాత్ర ఉంటుందని అధికారులు తెలిపారు. శక్తి పీఠం, శ్రీశైలం భ్రమరాంబ ఆలయం, మల్లిఖార్జున స్వామి ఆలయం త్రిపురాంతకేశ్వరి ఆలయం, బాలా త్రిపురసుందరీదేవి ఆలయం తదితరాలలో దర్శనాలు కల్పించనున్నారు.

వామ్మో.. వసతి గృహం!

బాలికలకు భద్రత ఎంత!

ఇల్లు, తల్లిదండ్రులను విడిచి ఉన్నత చదువులే లక్ష్యంగా వచ్చిన ఆ బాలికలకు అక్కడ సరైన భద్రత లేదు.. ఏం తింటున్నారో.. ఎలా ఉంటున్నారో కనీసం పర్యవేక్షించే నాథుడు లేడు.. వార్డెన్ ముఖం చూసి రెండేళ్లయిందని వసతిగృహంలో ఉంటున్న బాలికలే స్వయంగా చెబుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మైలవరం పట్టణంలో పొందుగల రోడ్డులో ఉన్న బీసీ బాలికల వసతి గృహం స్థితిగతులపై సమగ్ర కథనం..

» పర్యవేక్షణ లేదు.. పౌష్టికాహారం అందదు

» వార్డెన్‌ను చూసి రెండేళ్లు.. : విద్యార్థినులు

» మైలవరం బీసీ బాలికల వసతిగృహంలో వింతలు

» అడిగే నాథుడు లేక అడ్డగోలు వ్యవహారం

» మండిపడుతున్న ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు



ఖాళీ గదులతో దర్శనమిస్తున్న మైలవరంలోని బీసీ బాలికల వసతిగృహం



(ఆంధ్రజ్యోతి-మైలవరం)

మైలవరం పట్టణంలో పొందుగల రోడ్డులో 2009 నుంచి ఒక అద్దె భవనంలో బీసీ బాలికల గృహాన్ని నిర్వహిస్తున్నారు. మైలవరంలో ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాల్లో చదువుకునే పేద వర్గాలకు చెందిన పలువురు బాలికలు ఇక్కడ ఉంటున్నారు. మొత్తం 73 మంది ఉండే విద్యార్థినుల సంఖ్య వార్డెన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం 23కు పడిపోయింది.

కనిపించని మెనూ..

వసతి గృహంలో బాలికలకు మెనూ ప్రకారం భోజనం ఉండదు. వంట మనిషికి తోచింది చేసే పెట్టే దయనీయ పరిస్థితి. పదే పదే ఒకే రకం వండటం, నాణ్యత లేకపోవడంతో విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు అక్కడ వండింది తినలేక ఇళ్లకు వెళ్లిపోయారు.

రెండేళ్లుగా కానరాని వార్డెన్

రెండేళ్లుగా వార్డెన్ పిల్లల ముఖం చూసింది లేదు. మేం వార్డెన్‌ను చూసి రెండేళ్లవుతుందని అక్కడి పిల్లలే చెబుతున్నారు. అయినా అధికారులు ఏం పట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. వసతిగృహంలో ఏం జరుగుతుందో కూడా తెలుసుకునే తీరిక కూడా పైఅధికారులకు లేకుండా పోయిందని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్ తీరుపై గతంలో ప్రజా సంఘాల నాయకులు అప్పటి కలెక్టర్ ఢిల్లీరావుకు ఫిర్యాదులు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సరైన వసతులు, భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.



● వార్డెన్‌ను నియమించాలి : చాట్ల సుధాకర్, సీఐటీయూ

తక్షణం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి. గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ప్రస్తుత కలెక్టర్ స్పందించాలి. తక్షణం కొత్త వార్డెన్‌ను నియమించాలి. వసతి గృహంలో పిల్లలు చేరకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం.



● నిర్లక్ష్య ధోరణి తగదు : సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ

బాలికల పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి మంచిది కాదు. ఉజ్వల భవిష్యత్ ఉన్న బాలికలకు సరైన పోషణ అందకపోతే ఎలా రాణిస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలకు పూనుకోవాలి.

● ఉన్నతాధికారులకు నివేదిస్తాం : రవి కుమార్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి

వార్డెన్‌పై వస్తున్న ఆరోపణలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఇక్కడ హాజరు రిజిస్టర్లు ఉండవు. ఆన్‌లైన్‌లోనే హాజరు వేస్తాం. సస్పెండ్ కాకుండా జీతం ఆపలేం. ఇక్కడ చార్జ్ తీసుకొని మూడు నెలలే అయ్యింది. సమగ్ర నివేదిక తయారు చేసి పై అధికారులకు అందజేస్తా.

రీచ్ వసతి గృహంలో అగ్నిప్రమాదం

తప్పిన పెను ముప్పు

» కారిడార్‌లో 35 మంది నిద్రిస్తుండగా.. జెట్ కాయిల్ దుప్పటికి అంటుకుని మంటలు

» ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు

» అర్ధరాత్రి పొగ గమనించిన క్రైస్తవ భక్తులు

» మంటలు అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

» సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ, అధికారులు



రీచ్ బాలుర వసతి గృహంలో దగ్ధమైన మంచాలు పరిశీలిస్తున్న అధికారులు, విద్యార్థులకు గాయాలు

గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం రీచ్ విద్యాసంస్థల బాలుర వసతి గృహంలో భారీ అగ్నిప్రమాదం సంభవించగా.. తృటిలో పెను ప్రమాదం తప్పింది. లైఫ్ ప్రైమరి, లైఫ్ హైస్కూల్(రీచ్)లో మూడో తరగతి నుంచి 10 వరకు 140 మంది తల్లి, తండ్రి లేని విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు రీచ్ ప్రాంగణంలో ఉన్న వసతి గృహంలో ఒక్కొక్క కారిడార్‌లో 35 మంది ఉంటున్నారు. మంగళవారం విద్యార్థులు యధావిధిగా పడుకున్నారు. అర్ధరాత్రి ఒక్కసారిగా పైన కారిడార్‌లో పొగ వ్యాపించింది. పక్కనే క్రైస్తవుల మీటింగ్ జరుగుతోంది. అక్కడ ఉన్న వారు పొగను చూసి వసతి గృహం వద్దకు వచ్చారు. మంటలు వ్యాపించటంతో విద్యార్థులు కేకలు వేస్తూ భయాందోళన చెందగా.. అందరినీ బయటకు తీసుకువచ్చారు. 8వ తరగతి విద్యార్థులు పులపాక అఖిల్ కైలా ఉదయ్, కిరణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

జెట్ కాయిల్ వల్లే ప్రమాదం..

దోమల కోసం విద్యార్థులు జెట్ కాయిల్ వెలిగించారు. కాయిల్ మంచం పక్కనే పెట్టడంతో దుప్పటికి అంటుకుని కారిడార్ మొత్తం మంటలు వ్యాపించాయి. కారిడార్‌కు ఒకే డోర్ ఉంది. మంటలు డోర్‌కు చివరి నుంచి అంటుకోవటంతో విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. లేకుంటే పెను ప్రమాదం సంభవించేది. క్రైస్తవ సమావేశానికి వచ్చిన వారు మంటలు వ్యాపించిన చోట కిటికీని బద్దలుకొట్టి మంటల్లో చిక్కుకున్న విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. జెట్ కాయిల్ దుప్పటికి అంటుకుని తొమ్మిది ఇనుప మంచాలపై ఉన్న పరుపులకు అడ్డుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. కబోర్డులు కాలిపోయాయి.

విద్యార్థులు క్షేమం

రీచ్ వసతి గృహం పక్కన క్రీస్తు మహాసభలు జరుగుతున్నాయి. వసతి గృహం నుంచి, పొగ బయటకు వ్యాపించటంతో మహాసభల్లో ఉన్న వారు చూసి పరుగులు తీశారు. గోడ దూకి వెళ్లి కారిడార్ కిటికీని పగులకొట్టారు. లోపలికి వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు.

అధికారుల పరిశీలన

సంఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. తహసీల్దారు కేవీ శివయ్య, ఎంఈవో కె.రవికుమార్, బాల నేరస్థుల సంక్షేమ సర్వీసుల శాఖ జాయింట్ డైరెక్టర్ మదుసూధనరావు, స్పెషలాఫీసర్ రామ్‌మనోహర్, డీపీవో సత్యవతి, సీడబ్ల్యుసీ సభ్యులు రాధాకుమారి, రవిభార్గవ్, రాజన్న, ఆర్‌ఏపి వెంకటపతి రాజు తదితరులు వసతి గృహ కారిడార్‌ను పరిశీలించారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఫైర్ ఆఫీసర్ జాన్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ

రీచ్ విద్య సంస్థల ప్రాంగణంలోని లిటిల్ లైట్స్ అనాధ ఆశ్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం రాత్రి సందర్శించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను అధికారులు, ఆశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆశ్రమ సిబ్బంది అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. కూటమి నేతలు చిగురుపాటి కుమారస్వామి, వడ్రాణం హరిబాబు నాయుడు, చలమలశెట్టి రమేష్‌బాబు, నాదిండ్ల మోహన్, చిమట రవివర్మ, యార్లగడ్డ సతీష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బదిలీలలు

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం ద్వారకా తిరుమల నుంచి రిలీవ్ అయి రాగా, అకామిడేషన్, సెక్యూరిటీ సూపర్‌వైజేషన్, కేశఖండనశాల, స్టేషనరీ, ఎంవీ ఫోన్స్, ఆర్టీఐ యాక్ట్ బాధ్యతలు కేటాయించారు.

- ఎం.శ్రీనివాస్ అనే ఉద్యోగి ప్రస్తుతం అకౌంట్స్, ఐటీ రిటర్న్స్, ట్ర్యూకట్రీలు, జీఎస్టీ రిటర్న్స్, డౌన్‌హిల్ కౌంటర్స్ సూపర్‌వైజేషన్ బాధ్యతలు చూస్తుండగా, వీటిలో కీలకమైన అక్కౌంట్స్, ఐటీ రిటర్న్స్, ట్ర్యూకట్రీ బాధ్యతలను కొనసాగిస్తూ అదనంగా మెయిన్ టెంపుల్ బాధ్యతలను చేర్చారు.
- బి.ఎస్.జగదీష్ ప్రసాద్ అనే ఉద్యోగి ఎస్టాబ్లిష్‌మెంట్, వేదపాఠశాల బాధ్యతలు నిర్వహిస్తుండగా.. తాజాగా ఎస్టాబ్లిష్‌మెంట్స్, డౌన్‌హిల్ కౌంటర్స్ సూపర్‌వైజేషన్, వేద పాఠశాల బాధ్యతలు అప్పగించారు.
- పి.సునీత అనే ఉద్యోగి పెనుగంచిప్రోలు దేవస్థానం నుంచి రిలీవ్ అయి రాగా ఆమెకు అన్న ప్రసాదం బాధ్యతలను కేటాయించారు.
- కనకదుర్గ ప్రభ ఎడిటర్‌గా ఉన్న కె.గంగాధర్‌కు మీడియా పీఆర్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అలైన్‌మెంట్‌లో అవినీతి!

(5వ పేజీ తరువాయి)

పి.నైనవరం రైతులను సంప్రదించాడు. దీంతో అక్కడి రైతులు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లైన్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించగా.. నివ్వెరపోయే విషయాలు వెలుగు చూశాయి. అలైన్‌మెంట్ ప్రకారం ముప్పా సేతు నారాయణ పొలం మీదుగా లే అవుట్ వెళ్లే అవకాశమే లేదని తేలింది. దీంతో సదరు రైతు ఈ విషయమై పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను నిలదీస్తే తమకేమీ సంబంధం లేదంటున్నారు. పైగా ఆ రైతుపై చిందులు తొక్కుతూ బుకాయిస్తున్నారు. ముప్పా సేతు నారాయణకు సర్వే నంబర్ 137/1జేలో 0.462 ఎకరాల స్థలం ఉంది. టవర్ లైన్ అలైన్‌మెంట్‌ను అన్యాయంగా ఆయన పొలం మీదుగా మార్చటం వల్ల అన్యాయమైపోయాడు. పోనీ ఆ రైతుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ పరిహారం ఇచ్చిందా అంటే అదీ లేదు. ఒక రైతు పొలంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు సంబంధం లేకుండా ఏ విధంగా వేస్తారన్నది తేలాల్సి ఉంది. ఆ రైతు కోర్టులో కేసు వేసినా కూడా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నష్ట పరిహారం చెల్లించడం లేదు. టవర్ లైన్‌ను అన్యాయంగా మార్చటం వల్ల రైతులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడటం కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు భారీగా లంచాలు దిగమింగి అలైన్‌మెంట్‌ను అడ్డగోలుగా మార్చారన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ద్వారా విచారణ జరిపి బాధ్యులైన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

23న మార్క్సిస్టు ఐక్య సదస్సు

గాంధీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు ఉద్యమ శత వార్షికం సందర్భంగా మార్క్సిస్టు ఆలోచనాపరుల బృందం ఆధ్వర్యంలో 'భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం-ఆవశ్యకత-అవకాశాలు-అవరోధాలు' అంశంపై ఈ నెల 23న సదస్సు నిర్వహిస్తున్నట్టు కమిటీ కన్వీనర్, హక్కుల ఉద్యమ నేత చిగురుపాటి బాస్కర రావు, ఏయూ విశ్రాంత ఆచార్యుడు అబ్దుల్ నూర్ బాషా తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక బుక్ ఫెస్టివల్ హాల్‌లో జరిగే ఈ సదస్సులో 17 రాష్ట్రాల కమ్యూనిస్టు, వామపక్ష నేతలు పాల్గొంటారన్నారు. దేశంలో మతోన్మాదం, నిరుద్యోగం అధికమైందని, దళితులు, మైనార్టీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకిక రాజ్యాంగ హక్కులను హరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ప్రగతిశీల, లౌకిక శక్తుల పునరేకీకరణ అవశ్యకత ఉందన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ పురోగమన అవకాశాలు, అవరోధాలు గురించి వివిధ కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాలను ఒకే వేదికపై నుంచి ప్రజలకు తెలియజేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు పిచ్చుక శ్రీనివాస్, సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్, రిటైర్డ్ ఇంజనీర్ ఎ.చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్టు జీవీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం

(5వ పేజీ తరువాయి)

సతీమణి పంకజ శ్రీ, సింహాద్రి రమేష్ వెళ్లారు. సబ్‌జైలులోకి వెళ్లిన తర్వాత నిబంధనల ప్రకారం పూర్తి చేయాల్సిన కార్యక్రమాలకు పావు గంటపాటు సమయం పట్టింది. జగన్, పంకజ శ్రీ, రమేష్ నుంచి సంతకాల సేకరణ పూర్తి అయిన తర్వాత ములాఖత్‌కు అనుమతించారు. బయటకు వచ్చిన తర్వాత పంకజ శ్రీ, మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి జగన్ మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత జగన్ కాన్వాయ్‌ని కోర్టు మార్గంలో అనుమతించారు. అప్పటి వరకు ఆంక్షలు విధించిన పోలీసులు సడలించటంతో కార్యకర్తలు కాన్వాయ్ దగ్గరకు పరుగులుతీశారు. జగన్ ర్యాలీగా కారు మీద అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు.

కొత్త బాస్!

(5వ పేజీ తరువాయి)

రూపొందించారు. ఆ తర్వాత ఈ అంచనాలను రూ.51.19 కోట్లకు పెంచారు. నూజివీడు పీజీ సెంటరులోని భవనం నిర్మాణం మాత్రమే పూర్తిచేశారు. వర్సిటీలో వసతిగృహాలు, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాల భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. ఫుడ్‌కోర్టు భవనం మాత్రం పూర్తిచేశారు. పనులు జరగకుండానే రూ.18.77 కోట్ల బిల్లులను గుట్టుచప్పుడు కాకుండా చెల్లించేశారు. బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులు ఆపేసి పత్తాలేకుండా పోయారు. ఇటీవలనే మరో రూ.2 కోట్లకు కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా అందాయి. ఈ భవనాల పనులను తిరిగి ఎప్పటికి ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి.



తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, వేదికపై రామబ్రహ్మాం, బాలాజీ తదితరులు

తెలుగుభాషకు ప్రత్యేక స్థానం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాష, సాహిత్యం అజరామరమని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భావతరంగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మహతి కళావేదికపై మంగళవారం తెలుగు సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహించారు. రచయిత డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య మాట్లాడుతూ, మాతృభాషను, మాతృభూమిని మరువరాదన్నారు. సరస్వతి కళా సమితి అధ్యక్షుడు శేషాచార్యులు మాట్లాడుతూ, మాతృభాష కమ్మదనం అమోఘమన్నారు. ఘంటసాల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు జి.రామబ్రహ్మాం మాట్లాడుతూ, అమ్మభాష వస్తే అన్ని భాషలను అలవోకగా నేర్చుకోవచ్చన్నారు. సాహితీ కదంబం ఆకట్టుకుంది. భావతరంగిణి గౌరవాధ్యక్షుడు కృష్ణమోహనరావు, సంస్థ అధ్యక్షుడు భవిష్య, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, ప్రముఖ హరికథకుడు రాంబాబు, రాధికారాణి, మేరీ కృపాబాయి, పోతురాజు, జొన్నలగడ్డ ఝాన్సీ, మేడిశెట్టి యోగేశ్వరరావు, మాదిరాజు శివలక్ష్మి, మొదలి శ్రీవిద్య, జొన్నలగడ్డ కాంత్ పాల్గొన్నారు. నాటాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు శిష్య బృందం జానపద నృత్యం అలరించింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.ల్లో)
బ్రాయిలర్ బర్డ్	95,104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 410

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగస్వాములుకండి: కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కమిషనర్ ధ్యాన చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంకులు వచ్చాయని, దీనికి కారణమైన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంవత్సరం జరిగే స్వచ్ఛ సర్వేక్షన్‌లో కూడా పాల్గొని విజయవాడను ఉత్తమమైన స్థానంలో నిలపాలని ప్రజలను కోరారు. ఈసారి నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఫీడబాక్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఫోన్ నెంబర్ ఓటీపీ నమోదు చేసి, సర్వేలో ఉన్న పది ప్రశ్నలకు తమ అభిప్రాయాన్ని తెలియపరచి సర్వేని పూర్తి చేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

మార్చి ఒకటి నుంచి అమలు : సీఎంహెచ్‌వో సురేష్‌బాబు



మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌బాబు

కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై రైతుబజార్, మార్కెట్, హాస్పటల్స్, హోటల్ మేనేజర్లతో మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ని నిషేధించాలన్నారు. ఈ నెలాఖరులోగా ప్రజలందరికీ వాటిపై అవగాహన కల్పించాలన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, ఎవరైనా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడినా, అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ పరిధిలోని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్లు, మార్కెట్ మేనేజర్లు, హాస్పటల్ మేనేజర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




ఎన్టీఆర్ సర్కిల్ విజయా డెయిరీ పక్కన ఓపెన్ డ్రెయినేజీ (ఫైల్‌ఫొటో), ఓపెన్ డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన ఐరన్ మెస్

ఓపెన్ డ్రెయినేజీపై ఐరన్‌మెస్ ఏర్పాటు

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటమట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్పందించిన అధికారులు స్పందించారు. పటమట ఎన్టీఆర్ సర్కిల్ విజయా డెయిరీ పక్కన ఏళ్ల తరబడి రక్షణ లేకుండా ఉన్న ఓపెన్ డ్రెయినేజీకి ఐరన్‌మెస్ ఏర్పాటు చేశారు. ఓపెన్ డ్రెయినేజీ వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్న స్థానికుల సమస్యను ఇటీవల ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు ఓపెన్ డ్రెయినేజీపై ఐరన్ మెస్ ఏర్పాటు చేశారు.

23 నుంచి దుర్గగుడిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 23, 24, 26 తేదీల్లో మాఘమాసం ప్రత్యేక రోజుల సందర్భంగా సూర్యోపాసన సేవ జరుగుతుందని దేవస్థానం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సేవలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా లేదా 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా టికెట్లను కొనుగోలు చేయవచ్చునన్నారు. కాగా మంగళవారం ఆలయంలో ఖడ్గమాలార్చన, చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, వేదాశీర్వచనం, మల్లేశ్వరస్వామి అభిషేకం, పంచహారతులలో మొత్తంగా 230 మంది ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొన్నట్లు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.



పోస్టర్‌ను విడుదల చేసిన నిర్వాహకులు

పొట్టి శ్రీరాములు కాలేజీలో 21న చెఫ్ ప్రెన్యూర్స్ చాలెంజ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 21న చెఫ్ ప్రెన్యూర్స్ చాలెంజ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కాలేజీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఏపీ ఐసీటీ అకాడమీ రాష్ట్ర అధినేత ఎస్ దినకరరెడ్డి, కార్యదర్శి డాక్టర్ చిత్రా అమర సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎస్. మణికంఠ, నిర్వాహకుడు ఎస్. ప్రవీణ్, పలువురు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

- డీఈవో యూవీ సుబ్బారావు

కృష్ణలంక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ-2025) పరీక్షలు బుధవారం నుంచి (19వ తేదీ) నాలుగు రోజుల పాటు జరగనున్నట్లు డీఈవో యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హైస్కూల్ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ విభాగాల్లో లోయర్, హయ్యర్ కేటగిరిల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు.

ఆలపాటికి తొలి ప్రాధాన్యత ఓటు వేయండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ రాజకీయ అనుభమున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజ) వంటి వారి అవసరం శాసనమండలిలో చాలా ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఓటు ఉన్న ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్‌ను ఒక్క సారైనా కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. ఆలపాటికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. తూర్పు ఎన్నికల పరిశీలకుడు వెలగపూడి శంకర్‌బాబు మాట్లాడుతూ యువత సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి వారి సంక్షేమానికి పథకాలు రూపకల్పన చేసేందుకు ఆలపాటి వంటి వారు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోలపల్లి గణేష్, మాకినేటి నీరజ, గద్దె క్రాంతి కుమార్, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి క్రాంతిశ్రీ, డివిజన్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

ఆలపాటిని గెలిపించుకుందాం

గుణదల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దే పూర్ణచంద్ర రావు వీధిలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో ఓట్ల వెరిఫికేషన్ కూడా నిర్వహించి ఓటర్లను చైతన్యవంతులను చేశారు. అనంతరం 29, 30, 31 సచివాలయాలను సందర్శించి అక్కడ సిబ్బందిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ తోట పాండు, కారంపూడి సత్య, కడియం ప్రకాష్, శివప్రసాద్, డేవిడ్ పాల్గొన్నారు.



రాజాకు ఓటేయమంటూ ప్రచారం చేస్తున్న వల్లభనేని సతీష్ తదితరులు

భారతీనగర్: తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కనకదుర్గానగర్ కాలనీ వీఎంసీ పార్కు, కరెన్సీనగర్ కాలనీలోని వీఎంసీ పార్కుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున మంగళవారం టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడి బాబు రావు, గద్దె రమేష్, కృష్ణ ప్రసాద్, గుత్తికొండ మోహన్, బండిసాయి కోమలి, నాగబాబు, కొత్తపల్లి హరీష్ బాబు, దండమూడి సన్నిధి, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాయల్ సీసీ, న్యూ ఎవరెస్ట్ జట్లు విజేతలు



రాము (5 వికెట్లు) రాయల్ సీసీ జట్టు



దేవి ధనుష్ (102 పరుగులు) పటేల్ జట్టు

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో సోమవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. రాయల్ సీసీ, పటేల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పటేల్ జట్టు 45.2ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 224పరుగులు చేసింది. జట్టులో ఎ.దేవి ధనుష్ 102పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయల్ సీసీ జట్టు 49.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 225పరుగులు చేసి విజయం సాధించింది. రాయల్ జట్టు బౌలర్ సిహెచ్.రాము 5వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మూలపాడులో జరిగిన రెండో మ్యాచ్‌లో వెలకమ్ సీసీ, న్యూ ఎవరెస్ట్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన వెల్‌కమ్ సీసీ జట్టు 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 239పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూ ఎవరెస్ట్ జట్టు 44.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 240పరుగులు చేసి విజయం సాధించింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళానగర్, నలందస్కూల్ ఏరియా, మున్సిపాల్ ఎంప్లాయీ కాలనీ, ఎంజీ రోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. **ఆటోనగర్ :** ఆటోనగర్ సెక్షన్ 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు తంగెళ్ళమూడి వారి వీధి, హైస్కూల్ రోడ్డు, ఆర్ఆర్ గార్డెన్, విజయనగర్ కాలనీ, న్యూ పోస్టల్ కాలనీ7వ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు



- ఆంధ్రజ్యోతికి స్పందన

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుణదల ఈఎస్ఐ రోడ్డులో ఆసుపత్రి వద్ద అధికారులు ఎట్టకేలకు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డు వేసి స్పీడ్ బ్రేకర్ మరిచారు అని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవో 8 రద్దు కోరుతూ నిరసన



రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే జీవో 8 రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే పార్సిల్ కార్యాలయం వద్ద మంగళ వారం నిరసన ప్రదర్శన చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శికె. దుర్గారావు మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల వల్ల మోటార్ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొత్తఆటోలకు అనుమతులు ఇస్తే ఇప్పుడు వస్తున్న కాస్తంత ఆదాయం కూడా రాని పరిస్థితి ఉందన్నారు. జీవో 8ను రద్దు చేయాలని, అనుమతులను పరిమితం చేయాలన్నారు. నాయకులు ఎం. హనుమంతరావు, తిరుపతయ్య, కొండలరావు, తిరుమలరావు, వెంకటేశ్వరరావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చోరీ

బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

విద్యాధరపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురంలో ఉంటున్న రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి మునగాల వెంకట సుధాకర్ ఇంట్లో వెండి, బంగారం, నగదు చోరీకి గురయ్యాయి. మంగళవారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం క్వారీరోడ్డులో సుధాకర్ భార్యతో ఉంటున్నాడు. ఈనెల 14న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. మేనల్లుడు సూరాజ్ మయాన్ 16 న ఉదయం సుధాకర్‌కు ఫోన్ చేసి ఇంటితాళం పగుల కొట్టి ఉందని, గదిలో వస్తువులు చిందర వందరగా ఉన్నాయని తెలియచేశాడు. దీంతో సుధాకర్ దంపతులు ఆదే రోజు సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, సామాన్లు చిందరవందరగా ఉన్నాయి. బీరువాను పరిశీలించగా సుమారు 94 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ వధువుపై వేధింపుల కేసులో

తండ్రీ, కుమారులకు బెయిల్

విద్యాధరపురం: వివాహమైన రెండో రోజు నుంచే వధువును వేధించిన కేసులో అరెస్టయిన వరుడు చెరుకూరి హేమంత్ అజయ్, అతని తండ్రి లక్ష్మణరావులకు కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. వారి పాస్ పోర్టులను సరండర్ చేయాలని ఆదేశించడంతో వాటిని సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతన బకాయిల విడుదలపై హర్షం

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం బకాయిలు రూ.45కోట్లు విడుదల చేసినందుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ ఎప్పుడూ ముస్లిం మైనార్టీ సమాజానికి భరోసాగా నిలుస్తోందని, అధికారంలో ఉన్నపుడల్లా వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని బేగ్ తెలిపారు. జగన్‌పాలనలో ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం నిలిపివేయడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు.




తిరునాళ్లు

ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. దీంతో ఉయ్యూరు సెంటర్ భక్తజనసంద్రంగా మారింది తిరునాళ్లలో అతిముఖ్యమైనది శిడిబండి వేడుక. దీన్ని కనులారా దర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. వేడుక సైతం ఎంతో ఘనంగా జరిగింది.





అన్నా క్యాంటీన్లకు కోస్టల్ బ్యాంకు విరాళం


మంత్రి పయ్యావుల కేశవ్‌కు చెక్ అందజేస్తున్న కోస్టల్ బ్యాంక్ అధికారులు

లబ్బీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నా క్యాంటీన్ల నిర్వహణకు కోస్టల్ బ్యాంకు ప్రతినిధులు ఒ కరోజు వేతనాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు మంగళవారం అందజేశారు. సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కోస్టల్ బ్యాంకు సి. ఎఫ్.వో అండ్ సి.జి.ఎం కే.ఏ.వి రామన్, క్లస్టర్ హెడ్ టి.రామకృష్ణ చెక్ అందజేశారు. బ్యాంక్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు.

క్లిష్టమైన భూ సమస్యలకు పరిష్కారం

● కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం ఆర్డీ వో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమక్షంలో మ్యూటేషన్, ప్ర భుత్వ భూములు (22-ఏ) నమోదైన పట్టాభూములు అర్హులైన వారి భూములు పట్టా భూములుగా నమోదు చేయటం, కొన్ని సబ్ డివిజన్స్ వెబ్ ల్యాండ్‌లో నమోదు కానందున ఆయా రికార్డులు తనిఖీ చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేశారు. మొత్తం 45 మంది రైతులు భూ సమస్యలను పరిష్కరించారు. సర్వే సమస్యలు, పెండింగ్‌లో ఉ న్న పలు రకాల సర్టిఫికెట్లు అందించారు. తిరువూరు ఆర్డీవో కె.మాధు రి, డివిజన్ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్ర సంగమాన్ని శుభ్రం చేయిస్తున్నాం

● కొండపల్లి మున్సిపల్ కమిషనర్



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పవిత్ర సం గమం ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయిస్తున్నామని కొండపల్లి ము న్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో సమస్యల సంగమం శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆ మె స్పందిస్తూ డోజర్లు పెట్టి ఘాట్ లోని బురదను తొలగిస్తున్నామన్నారు. గతంలో లక్ష నుంచి లక్ష 20వేల మంది భక్తులు ఇక్కడ శివరాత్రి పుణ్య స్నానాలు చేశారని అందుకు తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, భద్రతా చర్యలు చేపడుతున్నట్టు ఆమె చెప్పారు.

అరాచకవాదులకు చిరునామా జగన్ రెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్‌రెడ్డి అరాచకవాదులకు చిరునామా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ మం గళ వారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో రా ష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ భ్రష్టు పట్టించిన జగన్ టీడీపీ కార్యాలయాలపై దాడులు చేయించాడన్నారు. టీడీపీ అధినేత నుంచి దిగువ కా ర్యకర్త వరకు అందరిపైనా దాష్టీకాలు చేయించటమే కాక అక్రమ కే సులు బనాయించాడన్నారు. ఆస్తులను విధ్వంసం చేయించి పోలీసు వ్యవ స్థను నిర్వీర్యం చేసిన జగన్ పాలన దారుణం కాక ఇంకేమవుతుంద న్నారు. కేసును విత్‌డ్రా చేసేలా దళితుడు సత్యవర్ధన్‌ను హిం సించి, బెదిరించిన అసాంఘిక శక్తి వంశీని అరెస్టు చేయడం దారుణమెలా అవుతుందన్నారు. సొంత తల్లిని, చెల్లిని తరిమేసిన జగన్, బా బాయిని లేపేసిన తమ్ముడు అవినాష్‌రెడ్డి, శవాన్ని డోర్ డెలివరీ చేసి న ఎమ్మెల్సీ అనంతబాబు, పేదల బియ్యాన్ని దోచేసిన పేర్నినాని, పేకా ట శిబిరాలు నడిపించిన బూతుల కొడాలి నాని, గన్నవరం సైకో వం శీ వీళ్లంతా ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ప్రజలు భావిస్తున్నారన్నారు.

మహాజనసభ వాయిదా

రెండు వర్గాలుగా గుడివాడ కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులు

● సభ జరగాలంటూ ఒక వర్గం.. వాయిదా కోసం మరో వర్గం పట్టు ● స్వల్ప రసాభాస ● కోరం లేక వాయిదా వేస్తున్నట్టు ప్రకటన


సభ్యులతో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్

గుడివాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుడివాడ అర్బన్ బ్యాంకు 110వ మహాజనసభ కోరం లేకపోవడంతో వాయిదా పడింది. సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. కోరం లేకున్నా గతంలో నిర్వహించినట్టు సభ జరగాలంటూ ఒక వర్గం, వాయిదా వేయాలని మరో వర్గం పట్టుపట్టారు. ఎంతకూ వ్యవహారం తేలకపోవడంతో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ సభను వాయిదా వేశారు. బ్యాంకు 110వ మహాజనసభను మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు పర్యాయాలు ఇలా సభను నిర్వహిస్తారు. మొదటి సభ కూడా కోరం లేక వాయిదా పడిన విషయం విదితమే. నిబంధనల మేరకు కోరం పూర్తవ్వాలంటే 550 మంది హాజరుకావలి. కానీ మంగళవారం జరిగిన సభకు 100 మంది మాత్రమే వచ్చారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ మాట్లాడుతూ కోరం లేని కారణంగా మహాజనసభను వాయిదా వేయాలా వద్దా అని సభ్యులను కోరారు. హాజరైన సభ్యులు రెండు వర్గాలు విడిపోయారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ మాట్లాడుతూ బ్యాంకు నుంచి రిజర్వు బ్యాంకుకు పంపాల్సిన నివేదికలను ఆమోదం తెలిపి పంపాలని కోరారు. సభ నిర్వహణ విషయంలో బ్యాంకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. మాజీ డైరెక్టర్ పొట్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలోనూ కోరం లేకున్నా మహాజనసభను నిర్వహించారని, అలాగే సభ నడపాలన్నారు. లేకుంటే బ్యాంకుకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ క్రమంలో ఇద్దరు సభ్యులు వేదిక వద్దకు రావడంతో పర్సన్ ఇన్‌చార్జ్ వారిని తమ స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. దీంతో సభ్యులు పర్సన్ ఇన్‌చార్జ్‌తో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతేకాక సభకు పోలీసులు రావడంపై కొందరు ఆక్షేపణ తెలిపారు. సభ్యుల నుంచి సహకారం లేకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ సభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు నడుచుకుంటామని పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ తెలిపారు.

ఘంటసాలకు స్వరనివాళి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో మహానటి సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం పరుచూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘంటసాల 51 వర్ధంతి సందర్భంగా స్వర నివాళి జరిగింది. ఈ సందర్భంగా దావులూరి వీరభద్రరావు దంపతులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. నిడుమోలు రమా సత్యనారాయణ, ప్రసూనా రామన్, వీరభద్రరావు, చావా నర్సింహారావు, వడ్లాది కామేశ్వరి జయప్రభ, కొప్పుల అశోక్ ఆనంద్, వాఖ్యాత డేవిడ్‌రాజు, గాయని గాయకులు చంద్రశేఖర్, రసూల్‌బాబు, సుధారాణి, విష్ణుప్రియ, కుసుమాంజలి, శ్రీనివాస్, పర్యవేక్షణ చలపతిరావు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించండి

పెడన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి పార్టీల శ్రేణులు సమన్వయంతో పని చేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూ రు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మంగళవారం ఆయన ఎమ్మె ల్సీ ఎన్నిక నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలసి పట్టణంలోని 20వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు.


రెవెన్యూ, పర్యావరణ, పర్యాటక, అటవీ, పంచాయతీరాజ్ విభాగాల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఎకో సెన్సిటివ్‌జోన్ మాస్టర్‌ప్లాన్ తయారీలో

జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్

మచిలీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎకో సెన్సిటివ్ జోన్ మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేసే సమయంలో అధికారులు పూర్తిస్థాయి జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ తయారీపై రెవెన్యూ, పర్యావరణ, పర్యాటక, అటవీ, పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో మంగళవారం తన చాంబర్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా వైల్డ్ లైఫ్ సాంక్చూరీ పరిధిలో ఎకోసెన్సిటివ్ జోన్ మాస్టర్‌ప్లాన్ ఏర్పాటుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందన్నారు. ఈ సమయంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయాశాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు భవిష్యత్తులో పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఎకోసెన్సిటివ్ జోన్‌లో చేపట్టే పనులు, చేపట్టకూడని పనులపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఆర్డీవో కే స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, పర్యాటక శాఖ జిల్లా అధికారి జి రామలక్ష్మణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నదీప్రవాహానికి అడ్డుకట్ట

ఐలూరు పుష్కరఘాట్ వద్ద నిబంధనలకు నీళ్లు

● పత్తాలేని అధికారులు ● ముడుపుల వల్లే వెనుకడుగు వేస్తున్నట్టు ఆరోపణలు


ఐలూరు పుష్కరఘాట్‌ను పూడ్చేసి నదీప్రవాహానికి ఆటంకం కలిగేలా సిమెంటు తూము పెట్టి ఎత్తుగా నిర్మించిన రహదారి


తోట్లవల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నదీపాయలో సహజ నీటి ప్రవాహానికి వ్యక్తులు ఆటంకం కలిగించకూడదని ఆర్సీ నిబంధనలున్నాయి. వరదలతో పొలాలు కోతకు గురై ఏర్పడిన మట్టి, ఇసుక దిబ్బలను అధికారుల ప్రత్యేక అనుమతితో మాత్రమే తొలగించుకోవాలి. రెవెన్యూ, మైనింగ్, భూగర్భజల శాఖల అనుమతితో మాత్రమే అలాంటి దిబ్బలను తొలగించాల్సి ఉందని ఆర్సీ నిబంధనలు చెపుతున్నాయి. కానీ పవిత్ర పుణ్యక్షేత్రమైన ఐలూరులో నిబంధనలన్నీ తుంగలో తొక్కి వ్యాపారకాంక్షతో రహదారి నిర్మించటం సంచలనంగా మారింది. పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్‌ను పూర్తిగా పూడ్చివేసి దానిపై రహదారి నిర్మించిన విధానం చూస్తే అధికారుల అండదండలు పూర్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ పుష్కరఘాట్‌ని పూడ్చివేయటం ఒక నేరమైతే నదీప్రవాహానికి ఆటంకం కలిగేలా సిమెంటు తూములు ఏర్పాటు చేసి ఎత్తుగా నదీపాయలో రహదారి వేయటం మరో తప్పిదం. ఇలాంటి కఠినమైన నిబంధనలను వ్యక్తులు ఉల్లంఘించి వ్యాపార అవసరాలకు రహదారి నిర్మించినా సదరు రివర్ కన్జర్వెన్సీ అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం 'పుణ్యస్నానాల పుష్కరఘాట్‌ను రహదారిగా మార్చేశారు' శీర్షికన వార్తా కథనం వెలువడిన సంగతి తెలిసిందే. మంగళవారం పుష్కరఘాట్‌పై పోసిన ఇసుక, మట్టిని తొలగించి ఘాట్‌ను పునరుద్ధరిస్తామని చెప్పిన అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించలేకపోయారు. రహదారి నిర్మించిన వ్యక్తి నుంచి కొందరు అధికారులు ముడుపులు స్వీకరించినందు వల్లే ఘాట్‌వైపు రాలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టి కొట్టొద్దు!

మట్టిని నమ్ముకుని బతుకుతున్నాం.. మట్టినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నాం. మాకెలాంటి మర్మాలు తెలియవు. దాదాపు నాలుగైదు తరాల నుంచి మేమిక్కడే జీవిస్తున్నాం. ఉన్నపళంగా మమ్మల్ని వెళ్లిపోమంటున్నారు.. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి? మా పక్షాన నిలిచేదెవరు? మా వెనుక నిలబడి పోరాటం చేసేదెవరు? మాకు ఎలాంటి రాజకీయాలు తెలియవు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే మేమేం చేసేది. అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కుమ్మర్లు. కనీసం మాకెక్కడైనా ప్రత్యామ్నాయ స్థలం చూపించండి.. లేదా మా బతుకు మమ్మల్ని బతకనీయండంటూ వేడుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దలు తమగోడు విని ఆదుకోవాలని వారు కోరుతున్నారు..

- ఆంధ్రజ్యోతి. గుణదల /విజయవాడ రూరల్

కొత్తూరు తాడేపల్లి వద్ద మట్టి పాత్రల తయారీకి బ్రేక్


పంచాయతీ నోటీసులు


మట్టి కుండకు రూపం తీసుకొస్తున్న కుమ్మరి


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు

విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లి గ్రామంలో కుమ్మర్లు తయారు చేసిన మట్టికుండలు, ఇతర సామగ్రి తెలుగు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. ఇటు విశాఖపట్నం నుంచి అటు కడప జిల్లా వరకు మట్టి కుండలు ఎగుమతులు జరుగుతుంటాయి. కారణం వాటి తయారీకి అనువైన మట్టి వనరులు ఇక్కడ ఉండటమే. కొత్తూరు తాడేపల్లి చెరువు గట్టుపై నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడి మట్టితో తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రలు ఉత్పత్తి చేస్తున్నారు. అనాదిగా, ఏళ్లుగా మట్టిని నమ్ముకున్న కుమ్మర్లకు పంచాయతీ షాక్ ఇచ్చింది. వెంటనే ఖాళీ చేయాలంటూ నోటీసులివ్వటంతో మట్టి పాత్రల ఎగుమతి నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. పంచాయతీ అనాలోచిత చర్యతో తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రల ఎగుమతులపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. చేతివృత్తే ఆధారంగా మట్టికుండలు తయారు చేసే కుమ్మర్లు పేదోడి దాహార్తిని తీర్చే ప్రధానం ఆయుధమన్న విషయం తెలిసిందే. అలాంటి కుమ్మర్లకు నిలువ నీడ లేకుండా చేసే ఆలోచనతో కొత్తూరు తాడేపల్లి పంచాయతీ వారం రోజుల క్రితం నోటీసులిచ్చింది. 40ఏళ్లపాటు కొత్తూరు తాడేపల్లి గ్రామంలో చెరువు గట్టున నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే కుండలు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి అధికారుల నోటీసులు ఆశనిపాతంగా మారాయి. 1980లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాసు బ్రహ్మానంద రెడ్డి కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని చెరువుమట్టిని తవ్వుకుని మట్టికుండలు తయారు చేసుకోవచ్చని ఒక జీవోను విడుదల చేశారని కుమ్మర్లు చెబుతున్నారు. గ్రామంలోని గోవిందరాజుల చెరువు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో 14 ఎకరాల్లో నేటి వరకు కుమ్మర్లు మట్టి తవ్వుకుని కుండలు తయారు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. 1995లో విజయవాడ గట్టువెనుక విద్యాధరపురం రామమందిరం వీధిలో కుమ్మర్లు కుండలు తయారు చేసి జీవనం సాగించేవారు. అలాగే గుణదల కుమ్మర వీధిలో మరికొంతమంది కుండలు తయారు చేసేవారు. ఆయా ప్రాంతాల్లో జనావాసాలు పెరగటంతో ఇళ్లమధ్యన మట్టికుండల బట్టీల నుంచి వచ్చే పొగ వల్ల ఇబ్బందులు వస్తున్నాయమని అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ అక్కడి తమనంతా కొత్తూరు తాడేపల్లికి తరలిపోవాల్సిందేనని చెప్పడంతో ఇక్కడకు చేరుకున్నామని కుమ్మర్లు చెబుతున్నారు.


నీడలో ఆరబెట్టిన కుండలు


ఇతర జిల్లాలకు రవాణా అవుతున్న కుండలు

ఇప్పుడు ఇక్కడ కూడా ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు కానీ ప్రత్యామ్నాయం చూపించలేదు. జంపన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి ఏపీలో ఉన్న చెరువులు, చెరువు గట్లను పరిరక్షించాలని లోకాయుక్తను ఆశ్రయించడం జరిగింది. దీంతో లోకాయుక్త ఒక సర్క్యులర్ ఇవ్వడంతో ఆయా పంచాయతీల పరిధుల్లో ఉన్న చెరువుగట్లపై నివాసాలు ఏర్పరచుకున్న వారిని ఖాళీ చేయించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎల్‌పీవో ఆయా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అక్కడ జీవనం సాగిస్తున్న 50 మంది కుమ్మర్లకు వారం క్రితం నోటీసులిచ్చారు. పదిరోజుల నుంచి ఎండ తీవ్రత పెరిగిపోతోంది. దీంతో ఈ ఏడాదైనా వ్యాపారం లాభసాటిగా ఉంటుందని కొండంత ఆశతో ఎదురు చూస్తున్న కుమ్మర్లకు పంచాయతీ నోటీసులతో ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఉన్న కుండలను సొమ్ము చేసుకుని కొత్తగా కుండలు తయారు చేయాలా వద్దా అన్నా డైలమాలో పడిపోయామని చెబుతున్నారు. ఈతరం వారెవరూ అంతగా మట్టి కుండల తయారీకి ఆసక్తి కనబర్చడం లేదు. గతంలో కుమ్మర వృత్తిపై ఆధారపడి నగరంలో దాదాపు 200 కుటుంబాలుండేవి. ప్రస్తుతం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో 50 కుటుంబాలే ఉన్నాయి. వీరికి కూడా నిలువ నీడ లేకుండా చేస్తే ఇక ఈ వృత్తిపట్ల ఆసక్తి కనబర్చడానికి ముందుకు వచ్చేవారే ఉండరన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పంచాయతీ అనాలోచిత నిర్ణయం.. కుమ్మర్లకు శాపం

తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రల ఎగుమతి అధికంగా ఇక్కడి నుంచే

అసలే అంతరించిపోతున్న కుమ్మర్ల పని.. ఉన్నవాళ్లను పంపేస్తే ఎలా ?

ప్రత్యామ్నాయం చూపకపోగా ఖాళీ చేయాలంటూ నోటీసుల జారీ

ఆందోళన వ్యక్తం చేస్తున్న కుమ్మర్లు

అభిరుచి




సినిమా అంటే చిన్నప్పటి నుంచీ ఇష్టం. కానీ పరిశ్రమ తలుపు తట్టాలని ఎన్నడూ అనుకోలేదు. కాలేజీ వేడుకల్లో చిన్న చిన్న సెట్లు వేసిన అనుభవం. అదే ఆమెను రంగుల ప్రపంచం వైపు ఆకర్షించింది. ప్రొడక్షన్ డిజైనర్‌ను చేసింది. అదీ ఇక్కడో... అక్కడో కాదు... ఏకంగా హాలీవుడ్‌లో బిజీ అయిపోయింది. ఇటీవల తను పని చేసిన ఓ చిత్రానికి అవార్డు కూడా అందుకున్న అచ్చతెలుగు అమ్మాయి... **లక్ష్మీ నైమిషా గుమ్మడి** హైదరాబాద్ టూ లాస్‌ఏంజెలెస్ జర్నీ ఇది.

అనుభవమే అన్నీ నేర్పింది

"సినీ పరిశ్రమ అనగానే ఎవరైనా తెర మీద కనిపించాలని కోరుకొంటారు. కానీ నాకు అటు వైపు వెళ్లాలన్న ఆలోచనే ఎన్నడూ రాలేదు. చిన్నప్పుడు సినిమాలు చూసేదాన్ని. అయితే కెమెరామన్, దర్శకుడు... ఇలా తెర వెనుక ఎంతోమంది శ్రమ ఉంటుందని తెలిసేది కాదు. వెండితెర మీద కనిపించేవారే అన్నీ అనుకొనేదాన్ని. పెరిగే కొద్దీ ఒక్కొక్క క్రాఫ్ట్ గురించి అర్థమైంది. దాంతో సినిమా కంటే చివర్లో వచ్చే 'బిహైండ్ ది సీన్స్' బాగా నచ్చేవి. ఆ డిజైన్ ఎలా చేశారు? ఈ కలర్ ఎలా తీసుకురాగలిగారు? ముఖ్యంగా మన తెలుగు చిత్రాల్లో పాటలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. వాటిల్లో కనిపించే కళాత్మకత నన్ను బాగా ఆకట్టుకొనేది. దానికితోడు మా అమ్మానాన్నలిద్దరూ ఆర్కిటెక్ట్‌లు. నాన్నకు కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లో ఉన్నారు. అమ్మ కూడా ఆర్కిటెక్ట్‌గా పని చేశారు. ఈ క్రమంలో ఎప్పుడూ రకరకాల డిజైన్లు చూస్తుండేదాన్ని. ఇంట్లో కూడా వాటి గురించి మాట్లాడుతుండేవారు. అలా డిజైనింగ్ అనేది నాకు ఒక అభిరుచిలా మారిపోయింది. సినిమాలు చూసేటప్పుడు కూడా నా దృష్టి ఎక్కువగా బ్యాక్‌గ్రౌండ్ మీదే ఉండేది. వాటి గురించి తెలుసుకోవాలన్న తపనే ఇవాళ నన్ను ప్రొడక్షన్ డిజైనర్‌గా హాలీవుడ్‌లో నిలబెట్టింది.

కాలేజీలో మొదలైంది...

మా స్వస్థలం గుంటూరు. పెరిగిందంతా హైదరాబాద్‌లో. టెన్త్ వరకు 'సంఘమిత్ర స్కూల్‌'లో చదివాను. 'ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌'లో పన్నెండో తరగతి అవ్వగానే ఆర్కిటెక్చర్‌లో బీటెక్ చేద్దామని కర్ణాటక 'మణిపాల్ యూనివర్సిటీ' (ఎంఐటీ)కి వెళ్లాను. 2021లో బీటెక్ పూర్తయింది. డిజైనింగ్ మీద ఉన్న ఆసక్తితో కాలేజీలో వార్షికోత్సవాలు, థియేటర్ స్కిట్స్ వంటి వాటికి సెట్టింగ్‌లు వేసేదాన్ని. అందరూ బాగున్నాయనేవారు. అలా సెట్ డిజైనింగ్ మీద ఆసక్తి పెరిగింది. డిగ్రీ అవ్వగానే కొన్నాళ్లు హైదరాబాద్‌లోని ఓ డిజైనింగ్ స్టూడియోలో ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి పని చేశాను.

కరోనా సమయంలో...

వాస్తవానికి డిగ్రీ పూర్తవక ముందే, కరోనా సమయంలో నేను అమెరికా వచ్చాను. కొన్ని వర్క్‌లు చేశాను. కాలేజీలో ఉండగానే ప్రొడక్షన్ డిజైనింగ్ గురించి పరిశోధించాను.. ఏ కాలేజీలో చదివితే బాగుంటుందనే దాని మీద. అలాంటి కాలేజీలన్నిటికీ దరఖాస్తు చేసుకున్నాను. టాప్ కాలేజీ 'అమెరికన్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్ (ఏఎఫ్ఐ)లో సీటు వచ్చింది. డిగ్రీ తరువాత మళ్లీ ఇక్కడకు వచ్చాను.
మాస్టర్స్ కొనసాగిస్తూనే వారాంతాలు, సెలవుల్లో బయటి సినిమాలతో పాటు కొన్ని ప్రాజెక్టులు కూడా చేశాను. నైపుణ్యం సాధించడానికి అవి నాకు ఎంతో తోడ్పడ్డాయి.

మ్యూజిక్ వీడియోలు...

రెండేళ్ల కిందట మాస్టర్స్ పూర్తయింది. కొన్నాళ్లు ఫ్రీలాన్సర్‌గా సినిమాలు, మ్యూజిక్ వీడియోలు, యాడ్స్, షార్ట్ ఫిల్మ్‌కు పని చేశాను. క్రమంగా హాలీవుడ్‌లో నా పేరు నిర్మాణ సంస్థలకు పరిచయమైంది. ఒక మంచి డిజైనర్‌గా నాకంటూ ఒక గుర్తింపు లభించింది. కెరీర్ చిన్నదే కానీ, పెద్ద ప్రాజెక్టులు చాలా చేశాను. డిస్నీ స్టార్ తదితర బడా ప్రొడక్షన్ హౌస్‌ల నుంచి తరచూ పిలుపు వస్తుంటుంది. ప్రొడక్షన్ డిజైనర్ అంటే.. సెట్ డిజైనింగ్. మన దగ్గర ఆర్ట్ డైరెక్టర్‌లాగా. కథను అనుసరించి, దర్శకుడి ఊహలకు తగ్గట్టు సెట్ వేయడం మా పని. సెట్ డిజైనింగ్ నుంచి దాన్ని తొలగించే వరకూ అంతా నేనే చూసుకొంటాను.

మరిచిపోలేని అనుభూతి

ఆ మధ్య నేను 'తహానన్' అనే ఒక ఫిలిప్పీన్ చిత్రానికి పని చేశాను. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దానికి ఇటీవల అమెరికాలో జరిగిన 'కల్వర్ సిటీ ఫిలిమ్ ఫెస్టివల్‌'లో ఉత్తమ చిత్రం అవార్డు లభించింది. సొంత దేశం వదిలేసి అమెరికాలో స్థిరపడిన ఓ ఫిలిప్పీన్స్ కథ అది. వారి భాషలో 'తహానన్' అంటే అర్థం... 'ఇల్లు'. భావోద్వేగాలతో నిండి చిత్రం. నా కథ కూడా అలాంటిదే కదా. సొంత ఇల్లు, దేశానికి దూరంగా, ఒంటరిగా అమెరికాలో ఉంటున్నా. అందుకే ఆ చిత్ర నిర్మాణంలో పూర్తిగా లీనమయ్యాను. ఫిలిప్పీన్ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అమెరికాలో సెట్ వేశాను. ఆ దేశస్తులు కూడా షూటింగ్ తమ ప్రాంతంలోనే తీశారనుకున్నారు. వారందరి నుంచి ప్రశంసలు నాకు ఎంతో మధురమైన అనుభూతినిచ్చాయి. అంతకుముందు చేసిన షార్ట్ ఫిలిమ్.. 'డాస్ బ్రోస్ ఫోర్స్' పలు చిత్రోత్సవాల్లో పన్నెండు నామినేషన్లు దక్కించుకుంది.

అడుగడుగునా సవాళ్లే...

ఒక మహిళగా అదీ పరాయి దేశం వచ్చి హాలీవుడ్‌లాంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్ర పరిశ్రమలో పని చేయడం అంటేనే అతిపెద్ద విజయంగా నేను భావిస్తాను. అయితే ప్రత్యేకించి ప్రొడక్షన్ డిజైనింగ్‌లో మహిళలు తక్కువ. ఇక్కడ మన దేశం నుంచి వచ్చిన అమ్మాయిలు కూడా ఉన్నారు కానీ, వారిలో ఎక్కువమంది ఉత్తరాదివారే. ఎక్కువగా మగవారే కనిపిస్తుంటారు. వారిని దాటి అవకాశాలు దక్కించుకోవడం నుంచి సెట్ వేసి మెప్పించడం వరకు అడుగడుగునా సవాళ్లే. మొదట దర్శకుడు, కెమెరామ్యాన్ తదితరులతో చర్చించాలి. వారి ఆలోచనలకు తగ్గట్టు సెట్ నిర్మించాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యానికి పరీక్ష ఎదురవుతుంటుంది. అవసరాన్ని బట్టి ఎంతమంది టీమ్ కావాలనేది నిర్ణయించుకోవాలి. ఒక్కోసారి షార్ట్ ఫిలిమ్‌కు పెద్ద సెట్ వేయాల్సి వస్తుంది. ప్రస్తుతం ఒక హర్రర్ చిత్రానికి చేస్తున్నాం. దానికి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లో పన్నెండు మంది పని చేస్తున్నాం. డిస్నీ స్టార్ కోసం చేసిన పాప్ స్టార్ టైలర్ స్విఫ్ట్ మ్యూజిక్ వీడియోకు దాదాపు వంద మంది కష్టపడ్డాం. అలాగే ఓ తక్కువ బడ్జెట్ సినిమాకు నేను, మరొకరు మాత్రమే పని చేశాం. వీటికితోడు తరచూ ప్రయాణాలు చేయాల్సివస్తుంది. మొత్తం షూటింగ్ స్పాట్‌లో నేను తప్ప మరే అమ్మాయీ లేని సందర్భాలు చాలా ఉన్నాయి. వర్జీనియాలో ఒక తెలుగు సినిమాకు చేశాను. అక్కడా అదే పరిస్థితి. మన జాగ్రత్తలో మనం ఉంటూ, పని పూర్తి చేసుకోవాలి. మహిళనని తెలిసి ఆఖరి నిమిషంలో కొన్ని ప్రాజెక్టులు చేజారాయి. తిరిగి ఇంటికి వెళ్లిపోదామనుకున్న రోజులూ ఉన్నాయి. మళ్లీ నాకు నేనే సర్దిచెప్పుకొని ముందడుగు వేశాను. ఎక్కడ ఎలా ఉండాలో... పరిశ్రమలో ఎలా నిలదొక్కుకోవాలో... అనుభవమే అన్నీ నేర్పింది.

ప్రముఖులతో కలిసి...

ప్రొడక్షన్ డిజైనర్‌గా టేలర్ స్విఫ్ట్, కైలీ కంట్రాల్, నికోలాస్ జేమ్స్ బార్బర్, నికోల్ రుయిజ్ తదితర ప్రముఖులతో కలిసి పని చేశాను. ఇక ఇప్పుడు నేను లాస్‌ఏంజెలెస్‌లో ఉంటున్నాను. కాలిఫోర్నియా కార్చిచ్చు సంభవించినప్పుడు మమ్మల్ని ఇళ్లు ఖాళీ చేయించారు. మా చుట్టుపక్కల నాలుగైదు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో షూటింగ్‌లు బంద్ అయిపోయాయి. చాలా అవస్థలు పడ్డాం. నేను మా స్నేహితురాలి ఇంట్లో ఉన్నాను. పరిస్థితులు అదుపులోకి వచ్చాక మళ్లీ వెనక్కి వచ్చాం. నా లక్ష్యం ఒక్కటే.. మరిన్ని పెద్ద ప్రాజెక్టులు చేయాలి. హాలీవుడ్‌లోనే స్థిరపడాలి. దాని కోసమే శ్రమిస్తున్నా."

• హనుమా

గోడల మురికి పోవాలంటే...

గోడలు ప్రకాశవంతంగా ఉన్నప్పుడే ఇల్లు అద్దంలా మెరుస్తుంది. ఇంటి గోడలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- కాలక్రమేణా దుమ్ము, ధూళి పేరుకుని గోడలు కాంతివిహీనంగా కనిపిస్తూ ఉంటాయి. ఇంట్లో బూజు దులిపి ఫ్లోర్ శుభ్రం చేసేటప్పుడు గది గోడలను కూడా పరిశీలించాలి. మైక్రోఫైబర్ వస్త్రం లేదా మెత్తని స్పాంజ్‌తో గోడలను పై నుంచి కింది వరకు సున్నితంగా తుడవాలి. వారానికి ఒకసారి మెత్తని చీపురుతో గోడలను తుడిచినా ప్రయోజనం ఉంటుంది. గోడలను నీళ్లతో తడపకూడదు.
- ఇంట్లో కొన్ని ప్రదేశాల్లో గోడలపై తరచూ వేలిముద్రలు, చేతి గుర్తులు, ఆహార పదార్థాల మరకలు పడుతుంటాయి. ఒక గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి ఒక చెంచా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఇందులో ఒక స్పాంజ్‌ని ముంచి దానితో మరకలపై మెల్లగా రుద్ది తుడవాలి.



- ఇంట్లో తేమ ఎక్కువగా ఉంటే గోడల రంగు మారడమే కాకుండా మూలల్లో బూజు చేరుతుంది. వంటగది, వాష్‌రూమ్ సహా అన్ని గదుల్లో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలి. గాలి లోపలికి వీచేలా ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండ నేరుగా ఇంటిలోపలికి వస్తూ ఉంటే దాని వల్ల గోడల రంగు వెలిసిపోయే అవకాశం ఉంటుంది. అధిక వేడిని నివారించేందుకు కిటికీలకు కర్టెన్లు వేయడం మంచిది.
- హాల్, స్టడీ రూమ్, లివింగ్ రూమ్ గోడలపై తరచూ తాకే ప్రదేశాలు మురికిగా మారుతుంటాయి. గోడలకు వేసిన పెయింటింగ్‌లకు సంబంధించి చిన్న డబ్బాలు తెచ్చి పెట్టుకుని అప్పుడప్పుడు టచప్ ఇస్తూ ఉంటే సమస్య పరిష్కారమవుతుంది.
- చిన్న పిల్లలున్న ఇళ్లల్లో గోడలపై కలర్ పెన్సిల్స్, స్కెచ్‌లు, ఇతర రంగుల మరకలు, గీతలు కనిపిస్తూంటాయి. అలా చేయకుండా ఉండాలంటే వైట్ బోర్డును గోడకి ఏర్పాటు చేసి దాన్ని ఉపయోగించేలా నచ్చజెప్పాలి.

పిల్లల్లో జ్ఞాపకశక్తికి...

పిల్లలు చదువులో రాణించాలంటే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగాలి. కొన్ని ఆహార పదార్థాలతో వాటిని పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

- ప్రతిరోజూ నీళ్లలో అయిదు బాదం పప్పులను నానబెట్టి, పొట్టు తీసి పిల్లలచేత తినిపించాలి. దీనివల్ల శరీరానికి ఇ విటమిన్, మెగ్నీషియం,



ఆరోగ్యకరమైన కొవ్వులు లభ్యమై మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది

- ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఒక అరటిపండు తినిపిస్తే పిల్లలకు తక్షణమే శక్తి లభిస్తుంది. నేచురల్ షుగర్స్, పొటాషియం తగు మోతాదులో అంది ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది.
- పిల్లలు బడి నుంచి రాగానే నాలుగు వాల్‌నట్ గింజలు తినిపిస్తే మంచిది. వీటిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటివి మెదడు పనితీరుని వేగవంతం చేసి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.
- సాల్మన్, మాకెరెల్, సార్డైన్, ట్యూనా లాంటి చేపలతో తయారు చేసిన వంటకాలు తినిపించాలి. వీటిలోని ఫ్యాటీ యాసిడ్ సమ్మేళనాలు మెదడుని ప్రభావితం చేస్తాయి.
- రోజూ పడుకునేముందు ఒక గ్లాసు పాలు తాగిస్తే మెదడుకి విశాంతి లభిస్తుంది. పాలలోని ప్రోటీన్లు, ఇతర పోషకాలు... మెదడు సరైన క్రమంలో ఎదిగేందుకు తోడ్పడతాయి. స్వచ్ఛమైన నెయ్యిని ఆహారంలో చేర్చడం వల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.
- కోడిగుడ్లు, పాలకూర, బచ్చలి కూర, దానిమ్మ గింజలు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, యాపిల్, నారింజ, పల్లీలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల మెదడు చురుకుగా పనిచేయడమే కాకుండా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

సాహసమే శ్వాసగా

కలలు అందరూ కంటారు... సాహసం, సహనం ఉన్న **మీనాక్షి దాస్** లాంటి వారు మాత్రమే వాటిని నెరవేర్చుకోగలుగుతారు. దాదాపు ఏడాది కాలంలో... అరవై నాలుగు దేశాల్ని ఆమె బైక్ మీద చుట్టేశారు అసోం రాష్ట్రానికి చెందిన 41 ఏళ్ల ఈ ఫిట్‌నెస్ ట్రైనర్... ఇప్పుడు మరో యాత్రకు సిద్ధమవుతున్నారు. భీకరమైన వాతావరణాలు, వీసా కష్టాలే కాదు... ఎందరో అపరిచితుల ప్రేమను, ఆతిథ్యాన్ని చవి చూశానంటున్న మీనాక్షి తన ప్రయాణం గురించి చెబుతున్న సంగతులివి.



"బైక్ నడపడం నేర్చుకుంటాననంటే ఎప్పుడూ వద్దనే నాన్న... నా ఆసక్తిని గుర్తించి తన కైనెటిక్ హోండా నడపడం నేర్పారు. అప్పుడు నాకు పదహారేళ్లు. మొదటిసారి గువాహటి వీధుల్లో బైక్ నడుపుతున్నప్పుడు... గొప్ప స్వేచ్ఛ లభించిన అనుభూతి. అప్పటి నుంచి బైక్ నా జీవితంతో విడదీయలేని భాగం అయిపోయింది. అస్సామీ మహిళగా... ఈశాన్య భారత దేశమంతా చుట్టేయాలని ఉండేది. చదువు, ఫిట్‌నెస్ ట్రైనర్‌గా వృత్తి బాధ్యతలతో ఆ ఆలోచన క్రమంగా మరుగున పడిపోయింది. పెళ్లయిన తరువాత, నా భర్త వేదాంతకు కూడా బైక్ ట్రిప్స్ సరదా కావడంతో... ఆయనతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో తిరిగి వచ్చాను. ఆ రోడ్లలో, మలుపుల్లో ప్రయాణం ఆహ్లాదాన్నే కాదు, భయాన్ని కూడా కలిగించింది. ఏదో ఒక రోజు నేనొక్కదాన్నే పర్యటనలు చెయ్యాలనుకొనేదాన్ని. కొన్నేళ్లపాటు నా జీతంలో దాచుకున్న డబ్బుతో... 2019లో సొంతంగా నా మొదటి బైక్ కొనుక్కున్నాను. కొన్ని నెలల తరువాత... ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న మోటారబుల్ రహదారి 'ఉమ్లింగ్ లా పాస్‌'లో బైక్ మీద ప్రయాణం చేశాను. ఈ మార్గంలో యాత్ర చేసిన రెండవ మహిళను నేనే.

ఆ మూడూ కుదరలేదు...

ఉమ్లింగ్ లా పాస్ అనుభవం నాకు ఉత్సాహాన్నిచ్చింది. కరోనా ఆంక్షలు ముగిసిన తరువాత... 2022లో నేపాల్‌కు సోలో రైడ్ చేశాను. "మగతోడు లేకుండా ఈ తిరుగుళ్లేమిటి?" అని నోళ్లు నొక్కుకున్నవారు చాలామంది ఉన్నారు. నేను అవేవీ పట్టించుకోలేదు. కొత్త సాహసాలు చేయాలని మనసు ఉవ్విళ్ళూరుతూ ఉండేది. వివిధ దేశాల్ని బైక్‌లో చుట్టియ్యాలనే ఆలోచన వచ్చింది. ఒక మహిళ పేరిట 50 దేశాల్లో... బైక్ మీద పర్యటించిన ప్రపంచ రికార్డు ఉందని విన్నాను. నేను 67 దేశాల్లో ప్రయాణించి, ఆ రికార్డును బద్దలుగొట్టడంతోపాటు, మహిళా సాధికారతను చాటి చెప్పాలని నిశ్చయించుకున్నాను. నా భర్త, కుటుంబం కూడా అంగీకరించారు. 2023 డిసెంబర్ 17న నేపాల్‌కు బైక్‌లో వెళ్ళి, అక్కడి నుంచి ముంబై చేరుకున్నాను. నా బైక్‌ను దుబాయ్ పంపించి, నేను కూడా అక్కడికి విమానంలో వెళ్లాను. అక్కడి నుంచి నా యాత్ర ప్రారంభమయింది. 2024 డిసెంబర్ 24న.. స్వదేశం చేరుకోవడంతో పూర్తయింది. ఈ ప్రయాణంలో... 372 రోజుల్లో... 64 దేశాలు పర్యటించాను. మయన్మార్, ఒమన్, ఇరాక్ దేశాల్లో కూడా ప్రయాణిస్తే... నా 67 దేశాల లక్ష్యం నెరవేరేది. కానీ భద్రతాపరమైన ఆక్షల కారణంగా.. ఆ దేశాల్లో ప్రవేశానికి అనుమతి దొరకలేదు.



ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాను...

ఇది అంత సులువుగా, సజావుగా సాగిన ప్రయాణం కాదు. మొదటి సమస్య నిధులు. ఈ మొత్తం యాత్రకు రూ.54 లక్షలు అవసరమవుతుందని అంచనా వేశాను. ఇది ఈశాన్య భారతం నుంచే కాదు, మొత్తం మన దేశం నుంచి స్థాపించే ప్రపంచ రికార్డు కాబట్టి, ప్రజలు సాయం చేస్తారని విశ్వసించాను. స్పాన్సర్ల కోసం వెతికాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, క్రీడా, పర్యాటక మంత్రిత్వ శాఖలకు విజ్ఞాపనలు చేసుకున్నాను. అందరూ హామీలు ఇచ్చారు, కానీ ఎవరి నుంచీ ఒక రూపాయైనా అందలేదు. దీనితో మా పొలాన్ని తాకట్టు పెట్టాను. మిగిలిన మొత్తం కోసం క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రయత్నించాను. ఒక వ్యక్తి రూ. 10 లక్షలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా నా ఖాతాలో రూ.20 లక్షలు చేరాయి. కీలకమైన వీసాలు తీసుకోవడానికి అది సరిపోతుందని భావించి, నా యాత్రను చేపట్టాను. ఇక ప్రయాణాల్లో ఎదురైన ఇబ్బందుల గురించి చెప్పాలంటే... యమన్, ఒమన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా దారి మార్చుకోవాల్సి వచ్చింది. నన్ను, నా బైక్‌ను ఫెర్రీలో తీసుకువెళ్ళడానికి సిద్ధపడిన ఒక ఎన్జీవో... ఆఖరి నిమిషంలో వెనక్కి తగ్గడంతో... కతార్‌కు బైక్‌తో సహా విమానంలో వెళ్ళాల్సి వచ్చింది. దానికి అదనంగా దాదాపు మూడు లక్షలు ఖర్చయ్యాయి. ఇక తీవ్రమైన ఇసుక తుపాను కారణంగా... 13 రోజులు జోర్డాన్‌లో చిక్కుకుపోయాను. అక్కడ ప్రియాంక అనే మహిళ నాకు ఆశ్రయం ఇచ్చారు. అక్కడి నుంచి బయలుదేరినప్పుడు... అయిదు వందల డాలర్లు ఒక కవర్లో పెట్టి ఆమె ఇచ్చినప్పుడు.. ఉద్వేగంఆపుకోలేక ఏడ్చేశాను.

కష్టమైనా... ఆపాలనుకోలేదు...

ఇక కొన్ని దేశాల్లో తీవ్ర స్థాయిలో వీసా కష్టాలు కూడా ఎదురయ్యాయి. ఈ యాత్ర కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. డబ్బు ఆదా చేయడం కోసం నాలుగు నెలలపాటు మధ్యాహ్నం భోజనం చేయలేదు. వర్షాలు, మంచు కారణంగా చిన్న అనారోగ్యాలకు కూడా గురయ్యాను. మా నాన్న అయిదేళ్ళ క్రితం చనిపోయారు. వృద్ధాప్యంలో ఉన్న మా అమ్మకు, బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తున్న మా అమ్మాయికి, నా భర్తకు దూరంగా ఉండడం బాధగా అనిపించేది. ప్రయాణాల్లో వారు గుర్తుకు వచ్చినప్పుడు ఏడ్చేదాన్ని. నా వేదనలన్నీ నా ముఖానికి ధరించిన హెల్మెట్‌కు తెలుసు. కానీ ఎంత కష్టమైనా... ఈ ప్రయాణాన్ని ఆపాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇది కేవలం నా కోసం కాదు, ఎగతాళికి గురైన ప్రతి ఒంటరి మహిళ కోసం చేసే ప్రయాణం అనుకున్నాను. నేను వెళ్లాల్సిన దూరాలు ఇంకా చాలా ఉన్నాయి. మిగిలిన మూడు దేశాలతో పాటు.... త్వరలోనే రష్యా, అమెరికాల్లో సాహస యాత్రలకు సిద్ధమవుతున్నాను. ఈసారి నా భర్త కూడా నాతో ప్రయాణంలో భాగస్వామి అవుతారు.



కురచ కుర్తాల్లో కులాసాగా

ఫ్యాషన్

సౌకర్యానికి పర్యాయపదంలా ఉండే కురచ కుర్తాల పోకడ పెరిగింది. ఎండ పెరుగుతోంది కాబట్టి హాయిగొలిపే కురచ కుర్తాలు, వాటిని జత చేయవలసిన ప్యాంట్ల గురించి తెలుసుకుందాం!

- కురచగా ఉండే కుర్తాలను జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్‌తో కలిసి ధరించవచ్చు.
- కాటన్, సింథటిక్ వస్త్రాలతో తయారయ్యే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు, ఆధునికంగానూ కనిపిస్తాయి
- సౌకర్యానికి పెద్ద పీట వేసే కురచ కుర్తాలను పొడవాటి లెహంగాతో కలిపి ధరించవచ్చు
- సాయంకాలపు వేడుకలు, స్నేహితులతో కాలక్షేపాలకు ఈ కుర్తాలు భలే అనువుగా ఉంటాయి
- హుందాగా కనిపించాలనుకునేవాళ్లు కూడా ఈ కుర్తాలను ఎంచుకోవచ్చు
- లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న కుర్తాలు, జీన్స్‌తో కలిపి ధరించి, ఎత్తు మడమల చెప్పులు వేస్తే చూడముచ్చటగా ఉంటుంది
- చికన్ వర్క్ కుర్తాల్లో పొట్టివి కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైనవి

అదనపు హంగులు ఇలా...

- మట్టితో తయారయ్యే టెర్రకోటా ఆభరణాలు ఈ తరహా దుస్తులకు నప్పుతాయి.
- భుజానికి వేలాడే బ్యాగ్ చక్కగా నప్పుతుంది.
- చదునైన చెప్పులు, ఎత్తు మడమల చెప్పులూ రెండూ బాగుంటాయి
- భారీ నెక్లెస్‌లూ, కడాలూ లాంటివి ధరించకపోవడమే మేలు.



రూ.324 లక్షల కోట్లు

దేశంలోని టాప్- 500 కంపెనీల మార్కెట్ విలువ ఇది.. ● భారత జీడీపీ కంటే అధికం..

- జాబితాలో మళ్లీ రిలయన్సే టాప్
- టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీకి 2, 3 స్థానాలు
- టాప్ 10 కంపెనీల మొత్తం విలువ సౌదీ అరేబియా జీడీపీ కంటే ఎక్కువ..
- అన్ లిస్టెడ్ కంపెనీల్లో ఎన్ఎస్ఈ నం.1
- హైదరాబాద్ నుంచి 35 సంస్థలకు చోటు
- బర్గండీ ప్రైవేట్ హురున్ జాబితా విడుదల



యూఏఈ, ఇండోనేషియా, స్పెయిన్ దేశాల మొత్తం జీడీపీ కన్నా ఎక్కువే..

ముంబై: గత ఏడాది (2024)కి గాను భారత్‌లోని అత్యంత విలువైన 500 ప్రభుత్వయేతర కంపెనీల జాబితా మంగళవారం విడుదలైంది. యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన ప్రైవేట్ బ్యాంకింగ్ వ్యాపార విభాగమైన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా దీన్ని విడుదల చేశాయి. భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17.52 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా నాలుగోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. గత ఏడాదిలో రిలయన్స్ మార్కెట్ సంపద 12 శాతం పెరిగిందని రిపోర్టు వెల్లడించింది. దేశీయ ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన టీసీఎస్ (రూ.16.10 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.14.22 లక్షల కోట్లు) వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఎయిర్‌టెల్ (రూ.9.74 లక్షల కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.9.30 లక్షల కోట్లు), ఇన్ఫోసిస్(రూ.7.99 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.5.80 లక్షల కోట్లు), ఎల్ అండ్ టీ(రూ.5.42 లక్షల కోట్లు), హెచ్‌సీఎల్ టెక్ (రూ.5.18 లక్షల కోట్లు), ఎన్ఎస్ఈ (రూ.4.70 లక్షల కోట్లు) వరుసగా టాప్-10లోని తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. జాబితాలోని 500 కంపెనీ ల మొత్తం మార్కెట్ సంపద గత ఏడాది 40 శాతం పెరిగి 3.8 లక్షల కోట్ల డాలర్లకు (రూ.324 లక్షల కోట్లు) చేరుకుంది. భారత జీడీపీ (3.5 లక్షల కోట్ల డాలర్లు) కంటే అధికమిది. అంతేకాదు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇండోనేషియా, స్పెయిన్ దేశాల మొత్తం జీడీపీ కంటే కూడా ఎక్కువే. కాగా, దేశంలోని టాప్-500 కంపెనీలు మొత్తం 84 లక్షల మందికి ఉద్యోగం కల్పిస్తున్నాయి. 2023 లిస్ట్‌తో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 14 లక్షల మేర పెరిగింది. అంటే, ఒక్కో సంస్థలో నగటున 21,000 మంది పనిచేస్తున్నారు. నివేదికలోని మరిన్ని విషయాలు..

ప్రభుత్వ సంస్థల్లో ఎస్‌బీఐ టాప్

దేశంలోని అత్యంత విలువైన ప్రభుత్వ రంగ కంపెనీల విషయానికొస్తే, ఎస్‌బీఐ రూ.7.69 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో అగ్రస్థానంలో ఉంది. ఎల్ఐసీ (రూ.5.89 లక్షల కోట్లు), ఎన్‌టీపీసీ (రూ.3.46 లక్షల కోట్లు), ఓఎన్‌జీసీ (రూ.3.20 లక్షల కోట్లు), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (రూ.3.12 లక్షల కోట్లు) వరుసగా టాప్ 5లో ఉన్నాయి. పవర్‌గ్రిడ్, కోల్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్, ఐఆర్ఎఫ్‌సీ, ఐఓసీ వరుసగా టాప్ 10లోని మిగతా స్థానాలను దక్కించుకున్నాయి.

- ఈ జాబితాలోని టాప్-10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ గత ఏడాదిలో రూ.22.7 లక్షల కోట్లు వృద్ధి చెంది రూ.96 లక్షల కోట్లు దాటింది. సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికమిది. అంతేకాదు, భారత జీడీపీలో దాదాపు మూడో వంతుకు సమానం. లిస్ట్‌లోని మొత్తం కంపెనీల మార్కెట్‌లో 30 శాతం వాటా వీటిదే.
- టాప్ టెన్ కంపెనీల్లోకెల్లా ఎయిర్‌టెల్ విలువ అత్యధికంగా రూ.4 లక్షల కోట్లు పెరిగింది. పైగా ఎయిర్‌టెల్ టాప్-5లోకి చేరడం ఇదే తొలిసారి.
- అత్యంత విలువైన 10 కంపెనీల్లో తొలిసారిగా చోటు దక్కించుకున్న ఏకైక అన్ లిస్టెడ్ కంపెనీ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ). అంతేకాదు, దేశంలో ఇదే అత్యంత విలువైన అన్ లిస్టెడ్ కంపెనీ కూడా. గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ 201 శాతం వృద్ధి చెంది రూ.4.70 లక్షల కోట్లు దాటింది. ఇప్పటి వరకు అన్‌లిస్టెడ్ కంపెనీల విభాగంలో అగ్రస్థానంలో ఉన్న సీరమ్ ఇన్‌స్టిట్యూట్ (రూ.2.11 లక్షల కోట్లు) ఈసారి రెండో స్థానానికి జారుకుంది. జోహో కార్ప్, జీరోధా, హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్) వరుసగా 3, 4, 5 స్థానాల్లో ఉన్నాయి. ఈసారి జాబితాలోని సంస్థల మొత్తం మార్కెట్ విలువలో అన్‌లిస్టెడ్ కంపెనీల వాటా 22 శాతంగా ఉంది.
- ఈసారి జాబితాలో అత్యధిక సంపద వృద్ధిని కనబరిచిన కంపెనీల్లో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 297 శాతం పెరుగుదలతో నం.1గా నిలిచింది. ఐనాక్స్ విండ్ (273 శాతం), జెప్టో (269 శాతం), డిక్సన్ టెక్నాలజీస్ (241 శాతం), ట్రెంట్ (228 శాతం) ఆ తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. కాగా, అన్ లిస్టెడ్ కంపెనీల్లో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టోదే అగ్రస్థానం. ఎన్ఎస్ఈ, ఫిజిక్స్‌వాలా (172%) టాప్-3లో నిలిచాయి.
- ఈసారి లిస్ట్‌లో 82 కంపెనీలకు కొత్తగా స్థానం లభించింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్, ప్రీమియర్ ఎనర్జీస్‌తో పాటు అదానీ రియల్టీ కూడా ఇందులో ఉన్నాయి.
- కనీసం రూ.9,580 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలను ఈసారి పరిగణనలోకి తీసుకున్నట్లు రిపోర్టు వెల్లడించింది. గతసారి పరిగణనలోకి తీసుకున్న విలువ రూ.6,700 కోట్లతో పోలిస్తే 43 శాతం ఎక్కువిది.
- ఈ జాబితాలో కనీసం 3 సంవత్సరాల నుంచి ఏకంగా 192 ఏళ్ల ప్రస్థానం కలిగిన (పీఎన్‌జీ జువెలర్స్) కంపెనీలున్నాయి. 23 కంపెనీల వ్యాపార ప్రస్థానం 100 ఏళ్ల పైమాటే.
- జాబితాలో అత్యధికంగా ముంబై నుంచి 154 కంపెనీలకు చోటు దక్కగా.. బెంగళూరు (44 కంపెనీలు), ఢిల్లీ (37), గురుగ్రామ్(36) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 35 కంపెనీలతో హైదరాబాద్ టాప్-5 నగరంగా నిలిచింది.
- జాబితాలోని 500 కంపెనీల మొత్తం ఆదాయం లక్ష కోట్ల డాలర్లకు చేరగా.. రూ.8 లక్షల లాభాన్ని ఆర్జించాయి. రూ.2.2 లక్షల కోట్ల పన్నులు చెల్లించాయని, కార్పొరేట్ల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కోసం రూ.11,000 కోట్లు వెచ్చించాయని నివేదిక వెల్లడించింది.



ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మంగళవారం సింగిల్ ప్రీమియం స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ్ మొహంతితో కలిసి ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు ఈ ప్లాన్‌ను విడుదల చేశారు. పాక్షిక లేదా పూర్తి సొమ్ము ఉపసంహరణకు పలు లిక్విడిటీ ఆప్షన్లు కలిగిన ఈ నాన్-పార్, నాన్-లింక్డ్ పాలసీ కనీస కొనుగోలు ధర రూ.లక్ష. ఈ ప్లాన్‌లో వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ యాన్యుటీ చెల్లింపుల్లో కస్టమరు తమకు నచ్చిన దానిని ఎంచుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

బీమా రంగంలో మరిన్ని సంస్కరణలు

ఏడాదిలోగా పాలసీని వెనక్కి తీసుకునే స్వేచ్ఛ !

న్యూఢిల్లీ: బీమా రంగంలో మరిన్ని సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీల ఏజెంట్లు అవసరం ఉన్నా, లేకపోయినా మాయమాటలతో పాలసీదారులకు పాలసీలు అంటగట్టే పద్ధతికి చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పాలసీదారులు ఎలాంటి జరిమానా లేకుండా పాలసీ నుంచి తప్పుకునే స్వేచ్ఛను (ఫ్రీ లుక్ పీరియడ్) ఏడాదికి పెంచాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఇది నెల రోజులు మాత్రమే. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజు ఈ విషయం తెలిపారు. గృహ రుణాల కోసం వచ్చే వ్యక్తులు లేదా రుణాల కోసం వచ్చే చిన్నచిన్న వ్యాపార సంస్థలకు ప్రస్తుతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏదోలా ఏదో ఒక బీమా పాలసీని అంటగడుతున్నాయి. ఈ జాఢ్యంపై ఎప్పటి నుంచే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

ముంబై: ఎనిమిది రోజుల వరుస నష్టాలకు తెర దించి సోమవారం స్వల్పంగా లాభపడిన సెన్సెక్స్ అంతలోనే మళ్లీ నష్టాల బాట పట్టింది. విదేశీ నిధుల తరలింపు, ఆశించిన స్థాయిలో లేని కార్పొరేట్ ఆదాయాల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్ ప్రభావితమైంది. దీంతో మంగళవారం సెన్సెక్స్ 29.47 పాయింట్ల నష్టంతో 75,967.39 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒక దశలో 465.85 పాయింట్లు నష్టపోయి 75,531.01 వరకు దిగజారింది. నిఫ్టీ 14.20 పాయింట్ల నష్టంతో 22,945.30 వద్ద ముగిసింది.

- నాసిక్ కేంద్రంగా ఉన్న కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ 1:1 నిష్పత్తిలో బోనస్ ఇష్యూ జారీ చేయనుంది. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు ఒక షేరును కంపెనీ జారీ చేయనుంది. వాటాదారుల ఆమోదానికి లోబడి ఈషేర్ల జారీ ఉంటుంది.
- ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ప్రచయ్ క్యాపిటల్ లిమిటెడ్.. సెక్యూర్డ్, రేటెడ్, రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.100 కోట్ల వరకు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ ఇష్యూ ఈ నెల 28న ప్రారంభమై మార్చి 13న ముగియనుంది. రూ.1,000 ముఖ విలువతో వీటిని జారీ చేయనుంది.

ఎంఎఫ్ పెట్టుబడి నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు కొత్త పథకాల ద్వారా సమీకరించే నిధుల పెట్టుబడి నిబంధనలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మార్చింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇక ఈ పెట్టుబడులను ఫండ్ ఆఫర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న నిబంధనలకు లోబడి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలి. లేకపోతే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ మదుపరులకు ఉంటుందని సెబీ గత ఏడాది డిసెంబరులోనే స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానుంది.

మరింత సురక్షితంగా స్టాక్ ట్రేడింగ్ : సెబీ

మరింత పక్కాగా స్టాక్ ట్రేడింగ్: టెక్ ఆధారిత స్టాక్ మార్కెటింగ్ ట్రేడింగ్‌నూ మరింత సురక్షితం చేయాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మొబైల్ ఆధారిత సిమ్ గుర్తింపు వ్యవస్థతో పాటు యూనిక్ కస్టమర్ కోడ్ (యూసీసీ) మరింత పటిష్ఠం చేయాలని భావిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్పులతో మంగళవారం ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. మార్చి 11లోగా దీనిపై సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.

భారత్‌లోకి టెస్లా ఎంట్రీ !

- ఢిల్లీ, ముంబైలో షోరూమ్‌ల ఏర్పాటు
- నియామకాలూ షురూ

న్యూఢిల్లీ: అమెరికా విద్యుత్ కార్ల (ఈవీ) దిగ్గజం టెస్లా కార్లు త్వరలోనే భారత రహదారులపై పరుగులు తీయనున్నాయి. కంపెనీ త్వరలోనే దేశంలో రెండు షోరూమ్‌లను తెరిచేందుకు సిద్ధమవుతోంది. ఢిల్లీ, ముంబైల్లో ఈ షోరూమ్‌లను ప్రారంభించనుంది. ముంబై విమానాశ్రయ సమీపంలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ఢిల్లీ విమానాశ్రయం సమీపంలోని ఏరోసిటీ ప్రాంతాల్లో టెస్లా ఇందు కోసం ఒక్కోటి 5,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే స్థలాన్ని లీజుకు తీసుకుంది. అయితే షోరూమ్‌ల ఏర్పాటు వార్తలపై టెస్లా అధికారికంగా నోరు మెదపడం లేదు. మరోవైపు ఈ రెండు షోరూమ్‌ల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకాల కోసం కంపెనీ తన వెబ్‌సైట్‌లో నియామకాల ప్రకటన కూడా ఇచ్చింది.

రిలయన్స్ జియో నుంచి స్మార్ట్ టీవీ ఆపరేటింగ్ సిస్టమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్ టీవీల కోసం జియో టెలీ ఓఎస్ పేరిట ఆపరేటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించినట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. దేశంలో స్మార్ట్ టీవీలకు తొలి ఆపరేటింగ్ సిస్టమ్ ఇదే. స్మార్ట్ టీవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది తీర్చుతుందని, టీవీ ఓఈఎంలు సరసమైన ధరల్లో ఈ అనుభవాన్ని అందించేందుకు సహాయపడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. జియో టెలీ ఓఎస్ అమర్చిన స్మార్ట్ టీవీలు వచ్చే శుక్రవారం నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తాయి. తొలుత థామ్సన్, కోడక్, బీపీఎల్, జేవీసీ బ్రాండ్ల టీవీలకు ఈ ఓఎస్‌ను ఉపయోగిస్తారు. జియో టెలీ ఎస్ ఇతర ఆపరేటింగ్ సిస్టమ్‌లు గూగుల్ ఆండ్రాయిడ్ టీవీ, వెబ్ ఓఎస్, శామ్‌సంగ్ టైజెన్‌కు పోటీ ఇస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	410
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	493	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	90
కరీంనగర్	80	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	75
కర్నూలు	80	నెల్లూరు	80
విశాఖపట్నం	83	అనంతపురం	80
గోదావరి	91		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,950 ▲	79,700 ▲	1,08,000 ▲
విజయవాడ	88,500 ▲	83,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	85,670 ▲	78,530 ▲	96,450 ▲
రాజమండ్రి	86,950 ▲	79,700 ▲	99,200 ▲
ప్రొద్దుటూరు	88,200 ▲	81,670 ▲	97,500 ▲
ముంబై	85,690 ▲	78,492 ▲	96,063 ▲

చిత్రజ్యోతి


SINCE 1965

'హిట్-3' లోనూ...





ఈ ఏడాది తనవి మూడు చిత్రాలు రానున్నట్లు అడవి శేష్ అభిమానులకు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం 'జి-2', 'డెకాయిట్' చిత్రాలు మాత్రమే చిత్రీకరణలో ఉన్నాయి. అయితే ఆ మూడో సినిమా ఏమై ఉంటుందా? అని అభిమానుల్లో ఆసక్తి మొదలైంది. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'హిట్-3' చిత్రంలో నాని పోలీస్ అఫీసర్‌గా నటిస్తున్నారు. 'హిట్-2' చిత్రంలోని అడవి శేష్ క్యారెక్టర్‌ని ఇందులోనూ కొనసాగించాలని మేకర్స్ నిర్ణయించినట్లు తెలిసింది. 'హిట్-3' చిత్రం షూటింగ్ సింహ భాగం కశ్మీర్‌లో చిత్రీకరించారు. మిగిలిన భాగాన్ని హైదరాబ్‌లోని ఓ స్టూడియోలో చిత్రీకరిస్తున్నారు. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. ఈ ఏడాది మేలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.



సల్మాన్ 'లిటిల్ గిఫ్ట్'

సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సికందర్'. 'టైగర్ 3' తర్వాత సల్మాన్ నుంచి వస్తున్న చిత్రమిది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురుగదాస్ దర్శకుడు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. మంగళవారం సాజిద్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'లిటిల్ గిఫ్ట్' పేరుతో చిత్ర బృందం సల్మాన్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో సల్మాన్‌ఖాన్ సరికొత్త లుక్‌లో కనిపించారు. తీక్షణమైన చూపులతో గంభీరంగా కనిపించిన సల్మాన్ సరికొత్త మేకోవర్‌తో ఆకట్టుకున్నారు. మంగళవారంతో సల్మాన్‌ఖాన్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. ఇక చిత్రబృందం ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ నెల 27న టీజర్‌ను, మార్చి తొలి వారంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. రంజాన్ పర్వదినాన 'సికందర్' చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబసమేతంగా వెళ్లారు. సతీమణి అనా కొణిదెల, తనయుడు అకిరానందన్‌తో పుణ్య స్నానం ఆచరించారు. పవిత్ర సంగమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట సినీ దర్శకుడు త్రివిక్రమ్ ఉన్నారు.



నిండుగా చల్లావు రంగులే



'క'తో విజయం అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. హోలీ సందర్భంగా మార్చి 14న సినిమాను విడుదల చేస్తున్నారు. తాజాగా, ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. 'హే జింగిలి.. హే జింగిలి నా జిందగీ నిండుగా చల్లావు రంగులే' అంటూ సాగే ఈ పాటను భాస్కరభట్ల రచించగా, సామ్ సీఎస్ ఆలపించడంతో పాటు సంగీతం అందించారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఇటువంటి మంచి సినిమా చేసినందుకు ఆనందంతో పాటు గర్వంగా ఉంది. అద్భుతమైన ప్రేమకథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది" అని అన్నారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని దర్శకుడు విశ్వ కరుణ్ చెప్పారు. "ఈ సినిమాలోని ప్రేమకథ చాలా కాలం గుర్తుండిపోతుంది" అని చిత్రనిర్మాత రవి తెలిపారు.

డెవిల్ కథేంటి?



దురాశ మనిషిని ఎలా పతనం చేస్తుందనేది ప్రధానాంశంగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ది డెవిల్స్ చైర్'. అదిరే అభి, స్వాతి మందల్ హీరో హీరోయిన్లు. గంగ సప్త శిఖర దర్శకత్వంలో కేకే చైతన్య, వెంకట్ దుగ్గి రెడ్డి, చంద్ర నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. అదిరే అభి మాట్లాడుతూ 'దురాశ వల్ల మనుషులు ఏమేం కోల్పోతున్నారనే అంశం చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తీశాం. కాన్సెప్ట్‌తో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిది. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి' అన్నారు. మంచి వినోదం పంచే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిదని నిర్మాతలు పేర్కొన్నారు.



దీక్ష, పట్టుదల ఉంటే..

కిరణ్, అలేఖ్యారెడ్డి జంటగా రూపుదిద్దుకున్న లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దీక్ష' విడుదలకు సిద్ధమైంది. స్వీయ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే అంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. లవ్, యాక్షన్ అంశాలతో పాటు మైథలాజికల్ పాయింట్ జోడించాం. ఇందులో హీరో కిరణ్ భీముడి పాత్రలో అద్భుతంగా నటించారు. ఇప్పటి వరకూ మా బేనర్‌లో 40 చిత్రాలు నిర్మించాను. వాటికి మించి 'దీక్ష' సినిమా ఉంటుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

చాంపియన్స్ మహా సమరం

చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థులు	వేదిక
ఫిబ్రవరి 19	పాకిస్థాన్ x న్యూజిలాండ్	కరాచీ
ఫిబ్రవరి 20	భారత్ x బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 21	అఫ్ఘానిస్థాన్ x దక్షిణాఫ్రికా	కరాచీ
ఫిబ్రవరి 22	ఆస్ట్రేలియా x ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 23	భారత్ x పాకిస్థాన్	దుబాయ్
ఫిబ్రవరి 24	బంగ్లాదేశ్ x న్యూజిలాండ్	రావల్పిండి
ఫిబ్రవరి 25	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	రావల్పిండి
ఫిబ్రవరి 26	అఫ్ఘానిస్థాన్ x ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 27	పాకిస్థాన్ x బంగ్లాదేశ్	రావల్పిండి
ఫిబ్రవరి 28	అఫ్ఘానిస్థాన్ x ఆస్ట్రేలియా	లాహోర్
మార్చి 1	దక్షిణాఫ్రికా x ఇంగ్లండ్	కరాచీ
మార్చి 2	భారత్ x న్యూజిలాండ్	దుబాయ్
మార్చి 4	సెమీఫైనల్-1	దుబాయ్
మార్చి 5	సెమీఫైనల్-2	లాహోర్
మార్చి 9	ఫైనల్	లాహోర్/దుబాయ్

(మ్యాచ్‌లన్నీ మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

వరల్డ్‌కప్‌నకు ఏమాత్రం తీసిపోనిది.. ఇంకా చెప్పాలంటే అంతకు మించినదే.. ఎందుకంటే ఈ టోర్నీలో పాల్గొనేది చిన్నా, చితకా జట్లేమీ కాదు. చివరి ప్రపంచకప్‌లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన టీమ్స్. ఇప్పుడు తాజాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం సమర భేరి మోగించబోతున్నాయి. టీ20 క్రికెట్ హోరులో టెస్టులతో పాటు వన్డేలకు కూడా ఆదరణ తగ్గుతున్న వేళ.. తిరిగి 50 ఓవర్ల మజాను అందించేందుకు ఎనిమిదేళ్ల బ్రేక్ తర్వాత ఈ మెగా టోర్నీ సిద్ధమైంది. వాస్తవానికి వరల్డ్‌కప్ విజేత కావడం కన్నా సీటీని గెల్చుకోవడమే కష్టమని భావిస్తుంటారు. మరి.. కఠిన సవాల్‌ను అధిగమించి భారత్ మూడో టైటిల్ సాధించగలదా? లేదా? అనేది వేచిచూడాల్సిందే..

నేటి నుంచే ఐసీసీ మెగా వన్డే టోర్నీ



నేడు పాక్ X కివీస్ మధ్య ఆరంభ పోరు
రేపు భారత్ X బంగ్లా మ్యాచ్

మ.2.30 నుంచి

కరాచీ: దాదాపు ఇరవై రోజులపాటు ఇక క్రికెట్ అభిమానులకు పండగే.. నేటి (బుధవారం) నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి తెర లేవనుండగా, ఈ భారీ ఈవెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వబోతోంది. 1996 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఆ దేశంలో జరుగబోతున్న అతిపెద్ద క్రీడా టోర్నీ ఇదే కావడం విశేషం. మార్చి 9న ఫైనల్ జరుగుతుంది. నువ్వా.. నేనా అనే రీతిలో మ్యాచ్‌లు సాగే ఈ చాంపియన్స్ ట్రోఫీ కోసం.. భారత్, పాక్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ జట్లు పోటీ పడబోతున్నాయి. దీంట్లో భాగంగా టీమిండియా తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడబోతోంది. భద్రతా కారణాల రీత్యా పాక్‌లో పర్యటించేందుకు భారత ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో టోర్నీని హైబ్రీడ్ పద్ధతిన పాక్, దుబాయ్‌లో నిర్వహించాల్సి వస్తోంది. ఇక కరాచీలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య పాక్ జట్టు న్యూజిలాండ్‌తో ఆడనుంది. 2017లో చివరిసారి జరిగిన సీటీలో పాక్ జట్టే భారత్‌ను ఓడించి టైటిల్ గెలిచింది. ఆ తర్వాత ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి టోర్నీని నిర్వహిస్తుండడం గమనార్హం. శ్రీలంక మొదటిసారిగా చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించలేకపోయింది. అలాగే పాక్‌లోని అస్థిర పరిస్థితులు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీని సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందాలనే భావనతో ఆ దేశ బోర్డు ఉంది. ప్రస్తుతం భారత్ మినహా అన్ని జట్లు కూడా పాక్‌లో పర్యటించి సిరీస్‌లు ఆడుతున్నాయి.

ఈ జట్ల నుంచి సవాలే..

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ క్లీన్‌స్వీప్‌తో భారత్ ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. దూకుడైన ఆటతీరుతో పాటు పటిష్ట లైనప్ కూడా జట్టును ఫేవరెట్ స్థానంలో ఉంచుతోంది. అయితే 2023 వరల్డ్‌కప్ తర్వాత టీమిండియా కేవలం 9 వన్డేలు మాత్రమే ఆడడం గమనార్హం. మిగతా అన్ని జట్లూ కనీసం 11 మ్యాచ్‌లాడడం గమనార్హం. అటు టోర్నీలో భారత్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. తమ గ్రూప్‌లో ఉన్న పాక్, బంగ్లా, కివీస్ అంత తేలికైన జట్లేమీ కాదు. ఆసీస్ జట్టులో కీలక బౌలర్లు లేకపోయినా పటిష్ట బ్యాటింగ్ లైనప్‌తో అత్యంత ప్రమాదకర జట్టుగా చెప్పవచ్చు. పేసర్లు బౌల్ట్, సౌథీ రిటైర్మెంట్‌తో కివీస్ ఎక్కువగా కేన్ విలియమ్సన్‌పై ఆధారపడి ఉంది. ఇటీవలే పాక్‌లో ఈ జట్టు ట్రైసిరీస్‌ను గెలిచిన జోష్‌లో ఉంది. బవుమా నేతృత్వంలోని సౌతాఫ్రికా ఇటీవలి కాలంలో చెలరేగుతోంది. అయితే ఒత్తిడిని అధిగమిస్తేనే వీరికి టైటిల్ అవకాశముంది. ఆతిథ్య పాక్ పేస్ బలం గురించి అందరికీ తెలిసిందే. భారత్ గండాన్ని దాటగలిగితే ఈ జట్టు దూసుకెళ్లడం ఖాయం. అలాగే రషీద్, గుర్బాజ్‌లతో కూడిన అఫ్ఘాన్ ఇప్పుడు పసికూన జట్టేమీ కాదు. బంగ్లాదేశ్ కాస్త బలహీనంగా కనిపిస్తున్నా భారత్‌పై ఆ జట్టు రెట్టించిన ఉత్సాహంతో ఆడుతుంటుంది.

రో-కోలకు చివరి చాన్స్



హోరాహోరీ మ్యాచ్‌ల సంగతి పక్కనబెడితే ఈ టోర్నీ పలువురు ఆటగాళ్లకు చివరి అవకాశంగా భావిస్తున్నారు. ఈ జాబితాలో భారత కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ముందుంటారు. వన్డే కెరీర్‌లో ఈ జోడీ చివరి దశలో ఉన్నారనేది వాస్తవం. ఈ టోర్నీ తర్వాత కూడా ఇద్దరూ వన్డే జట్టులో కొనసాగుతారా? అంటే చెప్పడం కష్టమే. అలాగే సీటీలో ప్రదర్శన ఆధారంగానే అటు టెస్టు జట్టులోనూ వీరి స్థానంపై ఓ అంచనాకు రావచ్చనేది విశ్లేషకుల భావన. ఇటీవలి కాలంలో రోహిత్, విరాట్ ఫామ్ కోల్పోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. కానీ ఇంగ్లండ్‌తో సిరీస్ హిట్‌మ్యాన్ శతకం, విరాట్ అర్ధసెంచరీ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ కీలక సమరంలో వారి బ్యాట్ల నుంచి అద్భుత ఇన్నింగ్స్ నమోదు కావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ఇదీ టోర్నీ చరిత్ర

చాంపియన్స్ ట్రోఫీని మొదటిసారి 1998లో నిర్వహించగా, అప్పట్లో దీన్ని ఐసీసీ నాకౌట్ ట్రోఫీగా పిలిచేవారు. కానీ 2002 నుంచి ప్రస్తుత పేరుతో వ్యవహరిస్తున్నారు. అలాగే 2009 నుంచి నాలుగేళ్లకోసారి జరపాలని నిర్ణయించారు. మరోవైపు ఫార్మాట్‌లో ఒకే వరల్డ్‌కప్ ఉండాలనే ఉద్దేశంతో 2017 తర్వాత చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించకూడదని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. అయితే 2024-2031 ఐసీసీ భవిష్యత్ టూర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీటీని పునరుద్ధరించారు. ఫలితంగా 2025 నుంచి తిరిగి చాంపియన్స్ ట్రోఫీ అభిమానులను అలరించబోతోంది.

డబ్బే డబ్బు..

ఈసారి విజేతగా నిలిచే జట్టుకు రూ. 19.4 కోట్లు, రన్నరప్‌కు రూ. 9.7 కోట్ల ప్రైజ్‌మనీ లభిస్తుంది. అలాగే నలుగురు సెమీఫైనలిస్టులకు రూ. 4.9 కోట్లు అందుతుంది. మొత్తం ప్రైజ్‌మనీని చూస్తే..2017తో పోలిస్తే ఇది దాదాపు 53 శాతం అధికం.

ఫార్మాట్ ఇదీ..

సీటీలో పాల్గొంటున్న ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాక్, బంగ్లాదేశ్, కివీస్ ఉండగా.. గ్రూప్ 'బి'లో ఆసీస్, ఇంగ్లండ్, అఫ్ఘాన్, దక్షిణాఫ్రికా జట్లున్నాయి. ప్రతీ గ్రూపులో ఉండే నాలుగు జట్లు తమ ప్రత్యర్థితో ఒక్కోసారి తలపడతాయి. రెండు గ్రూపుల్లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఆ తర్వాత టైటిల్ పోరు ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం ఫైనల్ మ్యాచ్ లాహోర్‌లో జరుగుతుంది. ఒకవేళ భారత్ తుది పోరుకు అర్హత సాధిస్తే వేదిక దుబాయ్‌కు మారుతుంది.

టై అయితే ఎలా..?

మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు రెండు పాయింట్లు, ఫలితం తేలకుంటే రెండు జట్లకు చెరో పాయింటు లభిస్తాయి. ప్రతి గ్రూపులో టాప్‌లో నిలిచిన జట్టు సెమీస్‌లో అవతలి గ్రూపులో రెండోస్థానం జట్టుతో ఆడుతుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లు టై అయితే ఫలితాన్ని సూపర్ ఓవర్ ద్వారా నిర్ణయిస్తారు. ఒక వేళ రిజర్వ్‌డే రోజు కూడా మ్యాచ్ ఫలితం రాకపోతే తమ గ్రూపులో టాపర్‌గా నిలిచిన జట్టు ఫైనల్‌కు చేరుతుంది. ఇక ఫైనల్ మ్యాచ్ టై అయితే...అప్పుడూ సూపర్ ఓవర్ ద్వారానే విజేతను నిర్ణయిస్తారు. ఒకవేళ రిజర్వ్ డే నాడు కూడా మ్యాచ్ సాధ్యపడకపోతే ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

కుటుంబ సభ్యులకు ఓకే కానీ..

క్రికెటర్ల కుటుంబ సభ్యుల విషయంలో బీసీసీఐ వారికి కాస్త ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వారికి అనుమతి ఇవ్వకపోగా.. తాజాగా టోర్నీలో ఏదైనా ఒక మ్యాచ్‌కు మాత్రం ఫ్యామిలీని ఆహ్వానించాలని నిర్ణయం తీసుకుందట. ఈమేరకు ఇంగ్లిష్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయంలో ప్లేయర్లు చర్చించుకుని బోర్డుకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత అందుకు తగిన ఏర్పాట్లు బోర్డు చేస్తుందని తెలిసింది. బహుశా పాక్‌తో జరిగే మ్యాచ్‌కు క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను రప్పిస్తారేమో..

భారత ఆటగాళ్లకు అద్భుత ఆదరణ

చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచీ భారత ఆటగాళ్లకు విశేష ఆదరణ లభిస్తోంది. నెట్ ప్రాక్టీస్ సమయంలోనూ వారిని వదలడం లేదు. ప్లేయర్లను దగ్గరగా తిలకించేందుకు పక్క దేశాల నుంచి మరీ వస్తున్నారు. ఐసీసీ క్రికెట్ అకాడమీకి సోమవారం 200మందికి పైగా ఫ్యాన్స్ రావడం విశేషం. వీరంతా తమ మొబైల్స్‌లో క్రికెటర్ల ఫొటోలను, వీడియోలను చిత్రీకరిస్తూ బిజీగా కనిపించారు. క్రికెటర్లను ఇంత దగ్గర నుంచి చూడడం సంతోషాన్నిచ్చిందని ఒమన్‌కు చెందిన మహిళాభిమాని తెలిపింది. అలాగే తాను శ్రేయాస్, విరాట్‌ల ఆటోగ్రాఫ్‌లను కూడా తీసుకున్నానని చెబుతూ సంబరపడింది.

36 కెమెరాలతో..



చాంపియన్స్ ట్రోఫీని వీక్షించే అభిమానులకు సరికొత్త అనుభూతినిచ్చేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా స్టేడియాల్లో 36 కెమెరాలతో మ్యాచ్‌లను అద్భుతంగా చిత్రీకరించబోతున్నారు. ఇందులో 360 డిగ్రీ కోణంలో మైదానంలో జరిగే ఆసక్తికర విశేషాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే డ్రోన్ కెమెరాల ద్వారా స్టేడియాలు, చుట్టు పక్కల పరిసరాల విహంగ వీక్షణాన్ని కూడా అభిమానులు ఆస్వాదించవచ్చు. రోవింగ్ బగ్గీకామ్, స్పైడర్‌కామ్‌ల ద్వారా ఏరియల్ కవరేజీలో మరింత నాణ్యత కనిపించనుంది.



కామెంటరీ ప్యానెల్‌లో మనోళ్లు నలుగురు

చాంపియన్స్ ట్రోఫీ కోసం 22 మందితో కూడిన ఇంగ్లిష్ కామెంట్రీ ప్యానెల్‌ను ఐసీసీ వెల్లడించింది. ఇందులో భారత్‌కు చెందిన సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, దినేశ్ కార్తీక్, హర్షా భోగ్లేలకు చోటు దక్కింది.

వీళ్లే విజేతలు

- **1998:** దక్షిణాఫ్రికా
- **2000:** న్యూజిలాండ్
- **2002:** భారత్/శ్రీలంక
- **2004:** వెస్టిండీస్
- **2006:** ఆస్ట్రేలియా
- **2009:** ఆస్ట్రేలియా
- **2013:** భారత్
- **2017:** పాకిస్థాన్

స్వదేశానికి మోర్కెల్



చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అర్ధంతరంగా స్వదేశం దక్షిణాఫ్రికాకు బయలుదేరాడు. అతడి తండ్రి కన్నుమూయడంతో అంత్యక్రియల కోసం పయనమైనట్టు సమాచారం. సోమవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు తను హాజరుకాలేదు. అలాగే తిరిగి ఎప్పుడు జట్టుతో కలుస్తాడనే విషయంలో స్పష్టత లేదు.

కష్టాల్లో ముంబై

● రెఖాడే..ఒకే ఓవర్లో 3 వికెట్లు
● తొలి ఇన్నింగ్స్ 188/7

రంజీ సెమీస్



పార్థ్ రెఖాడే (3/16)

నాగ్‌పూర్: స్పిన్నర్ పార్థ్ రెఖాడే (3/16) ఒకే ఓవర్‌లో మూడు ప్రధాన వికెట్లు పడగొట్టడంతో.. డిఫెండింగ్ చాంప్ ముంబైతో రంజీ సెమీస్ మ్యాచ్‌లో విదర్భ పైచేయి సాధించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 308/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ 383 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (54) హాఫ్ సెంచరీ చేశాడు. శివం దూబే ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 188/7 స్కోరు చేసింది. మంగళవారం ఆటముగిసే సమయానికి ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (67), తనుష్ కోటియన్ (5) క్రీజులో ఉన్నారు. శార్దూల్ ఠాకూర్ (37), సిద్దేశ్ లాడ్ (35) ఫర్వాలేదనిపించారు. 41వ ఓవర్ తొలి బంతికి అజింక్యా రహానె (18)ను బౌల్డ్ చేసిన రెఖాడే.. మూడో బంతికి సూర్యకుమార్ యాదవ్ (0), ఐదో బంతికి శివం దూబే (0)లను పెవిలియన్ చేర్చడంతో.. ముంబై ఒక్కసారిగా కష్టాల్లో పడింది. ఠాకూర్ 2 వికెట్లు దక్కించుకొన్నాడు.

కేరళ 418/7



అజరుద్దీన్ (149 బ్యాటింగ్)

అజరుద్దీన్ (149 బ్యాటింగ్) అజేయ శతకంతో.. గుజరాత్‌తో మ్యాచ్‌లో కేరళ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ 206/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కేరళ 7 వికెట్లకు 418 పరుగులు చేసింది. నిన్నటి స్కోరు వద్ద సచిన్ బేబీ (69) అవుట్ కాగా.. సల్మాన్ నిజార్ (52) అర్ధ శతకం సాధించాడు. నాగ్‌వసవల్లా 3 వికెట్లు పడగొట్టాడు.

వన్డేల్లో యూఎస్‌ఏ ప్రపంచ రికార్డు

అల్ అమరత్ (మస్కట్): వన్డే క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా యూఎస్‌ఏ రికార్డు నెలకొల్పింది. మంగళవారం ఒమన్‌తో జరిగిన వరల్డ్‌కప్ లీగ్2 మ్యాచ్‌లో యూఎస్ 35.3 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. మిలింద్ (47 నాటౌట్) మాత్రమే రాణించాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 25.3 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలడంతో 57 పరుగుల తేడాతో యూఎస్ నెగ్గింది. స్పిన్నర్లు కెనిగె (5/11), యాసిర్ (2/10), మిలింద్ (2/17) దెబ్బతీశారు. తద్వారా వన్డే క్రికెట్ చరిత్రలో పూర్తి ఓవర్లపాటు జరిగిన మ్యాచ్‌ల్లో అత్యల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా యూఎస్ సంబరాల్లో మునిగింది. ఇప్పటివరకు ఈ రికార్డు భారత్ పేరిట ఉండేది. 1985లో పాక్‌పై భారత్ 125 పరుగులు చేయగా, ప్రత్యర్థిని 87 పరుగులకే పరిమితం చేసింది.

అదరగొట్టిన బ్రంట్

● ముంబై బోణీ ● 5 వికెట్లతో గుజరాత్ చిత్తు



డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x యూపీ
రాత్రి 7.30 నుంచి

వడోదర: నటాలి సివర్ బ్రంట్ (57, 2/26) ఆల్‌రౌండ్ షోతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ బోణీ చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకు కుప్పకూలింది. హర్లీన్ డియోల్ (32), కశ్వీ గౌతమ్ (20) టాప్ స్కోరర్లు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హేలీ మాథ్యూస్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ముంబై 16.1 ఓవర్లలో 122/5 స్కోరు చేసి గెలిచింది. ప్రియా మిశ్రా, కశ్వీ చెరో 2 వికెట్లు తీశారు.

సునాయాసంగా...: బ్రంట్ అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. ముంబై అలవోకగా నెగ్గింది. స్వల్ప లక్ష్య ఛేదనను ముంబై ఓపెనర్లు హేలీ (17), యాస్తిక భాటియా (8) ధాటిగా ఆరంభించారు. మూడు ఫోర్లతో దూకుడుగా ఆడే ప్రయత్నం చేస్తున్న హేలీని తనూజ క్యాచవుట్ చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన బ్రంట్ కూడా బౌండ్రీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ముంబై 37/1తో నిలిచింది. అయితే, భాటియాను ప్రియ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 24 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (4)ను కశ్వీ పెవిలియన్ చేర్చింది. ఈ దశలో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. ముంబై స్కోరు కొంత నెమ్మదించింది. అయితే, 13వ ఓవర్‌లో ప్రియ బౌలింగ్‌లో అమేలియా కెర్ (19) 6,4తో వేగం పెంచింది. మరోవైపు బ్రంట్ రెండు బౌండ్రీలతో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు సెంచరీ దాటింది. కానీ, కెర్‌ను కశ్వీ ఎల్బీ చేయడంతో.. నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 7 పరుగులు కావాల్సిన సమయంలో బ్రంట్‌ను ప్రియ బౌల్డ్ చేసింది. సజన (10 నాటౌట్), కమలిని (4 నాటౌట్) మరో 23 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

పెవిలియన్‌కు క్యూ..: ముంబై బౌలర్ల దెబ్బకు.. గుజరాత్ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. పవర్ ప్లేలో ఓపెనర్లు బెత్ మూనీ (1), లారా వోల్వార్డ్ (4), హేమలత (9)తోపాటు కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (10)ను కోల్పోయిన గుజరాత్ 28/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, కశ్వీతో కలసి ఆరో వికెట్‌కు, తనూజ (13)తో కలసి ఎనిమిదో వికెట్‌కు 24 పరుగుల చొప్పున భాగస్వామ్యాలు నెలకొల్పిన డియోల్.. జట్టు స్కోరును సెంచరీ మార్క్ దాటించింది.

స్కోరుబోర్డు

గుజరాత్: బెత్ మూనీ (సి) సంస్కృతి (బి) బ్రంట్ 1, లారా (సి) సజన (బి) ఇస్మాయిల్ 4, హేమలత (సి) కెర్ (బి) మాథ్యూస్ 9, గార్డ్‌నర్ (సి) సజన (బి) బ్రంట్ 10, హర్లీన్ (సి) మాథ్యూస్ (బి) అమన్‌జోత్ 32, డోటిన్ (స్టంప్డ్) భాటియా (బి) కెర్ 7, కశ్వీ (స్టంప్డ్) భాటియా (బి) మాథ్యూస్ 20, సిమ్రన్ (సి) కెర్ (బి) మాథ్యూస్ 3, తనూజ (సి) సంస్కృతి (బి) కెర్ 13, సయాలి (నాటౌట్) 13, ప్రియ (రనౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 120 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-16, 4-28, 5-43, 6-67, 7-79, 8-103, 9-103; **బౌలింగ్:** షబ్నిం ఇస్మాయిల్ 4-1-17-1, నటాలి సివర్ బ్రంట్ 4-0-26-2, హేలీ మాథ్యూస్ 4-0-16-3, అమేలియా కెర్ 4-0-22-2, పరుణిక 2-0-20-0, అమన్‌జోత్ కౌర్ 2-0-17-1.

ముంబై: హేలీ మాథ్యూస్ (సి) హర్లీన్ (బి) తనూజ 17, యాస్తిక (సి) లారా (బి) ప్రియ 8, బ్రంట్ (బి) ప్రియ 57, హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) కాశ్వీ 5, కెర్ (ఎల్బీ) కశ్వీ 19, సంజన (నాటౌట్) 10, కమలిని (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 16.1 ఓవర్లలో 122/5; వికెట్ల పతనం:** 1-22, 2-46, 3-55, 4-100, 5-144; **బౌలింగ్:** గార్డ్‌నర్ 3-0-21-0, తనూజ కన్వర్ 3-0-25-1, డోటిన్ 3.1-0-19-0, ప్రియ 4-0-40-2, కశ్వీ 3-0-15-2.

చివరి మ్యాచ్‌లకు ఆటపట్టు దూరం..

జాతీయ జట్టుకు ఆడాల్సి రావడంతో.. లీగ్ చివరి మ్యాచ్‌లకు యూపీ వారియర్స్ బ్యాటర్ చమరి ఆటపట్టు దూరం కానుంది. వచ్చే నెల 4 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు శ్రీలంక కెప్టెన్‌గా ఆటపట్టును నియమించారు. దీంతో ఈ నెల 26 వరకు మాత్రమే ఆమె అందుబాటులో ఉండనుంది.



రవణి రవి

పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్ర 'సిక్సర్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఆరు పతకాలతో అదరగొట్టారు. చెన్నైలో మంగళవారం ప్రారంభమైన ఈ పోటీల్లో ఆంధ్ర అథ్లెట్లు రెండు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు సహా 6 పతకాలు సాధించారు. అనకాపల్లికి చెందిన పారా ఒలింపియన్ రొంగలి రవి స్వర్ణం కొల్లగొట్టాడు. జావెలిన్ త్రో ఎఫ్-40 విభాగంలో రవి పసిడి సాధించగా, ప్రకాశం జిల్లాకు చెందిన కాలేషా బాషా కాంస్యం దక్కించుకున్నాడు. టి-46 కేటగిరీ 100 మీటర్ల స్ప్రింట్‌లో రవణి (నెల్లూరు) స్వర్ణం, 1500 మీటర్ల పరుగులో నవీన్ (కాకినాడ) కాంస్యం గెలిచారు. టి-44 హైజంప్‌లో శ్యామ్ (గుంటూరు), టి-11 100 మీటర్ల రేసులో భవాని (విశాఖపట్నం) కాంస్యాలు అందుకున్నారు.

జ్యోతికి న్యాయం చేస్తాం!

శాప్ చైర్మన్ రవినాయుడు

అమరావతి (ఆంధ్రజ్యోతి): పారిస్ ఒలింపియన్, దేశం గర్వించే ఆంధ్ర అథ్లెట్ యర్రాజి జ్యోతికి పూర్తి న్యాయం చేస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు చెప్పారు. ఆంధ్రజ్యోతి సోమవారం సంచికలో 'ప్రతిభకేది గుర్తింపు' శీర్షికన వచ్చిన కథనంపై రవి నాయుడు స్పందించారు. గుజరాత్, గోవా జాతీయ క్రీడల్లో జ్యోతి గెలిచిన పతకాలకు ఇవ్వాల్సిన నగదు ప్రోత్సాహకాలు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండగా.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆ బకాయిలను విడుదల చేశామని తెలిపారు. ఇటీవల ముగిసిన జాతీయ క్రీడల్లో జ్యోతి సాధించిన పతకాలకు కొత్త స్పోర్ట్స్ పాలసీ ప్రకారం రూ.20 లక్షల నగదు అందజేస్తామన్నారు. జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన ఏపీ క్రీడాకారులందరినీ త్వరలో సన్మానిస్తామన్నారు. జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయింపు విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామని రవినాయుడు వివరించారు.

గ్రూప్-2 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటిషన్లు

» అనుబంధ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, స్పోర్ట్స్ పర్సన్లకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 23న నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలంటూ వేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫిక్స్ చేసి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం.పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్య మరో ఇద్దరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీలో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, స్పోర్ట్స్ పర్సన్లకు ప్రత్యేకంగా రోస్టర్ స్లాట్స్ (రిజర్వేషన్ పాయింట్లు) కేటాయిస్తూ 2023 డిసెంబరు 7న ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు బొద్దులూరి శ్రీనివాసరావు, జీవీ శివాజీ వాదనలు వినిపించారు. ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్.. రిజర్వేషన్ల అమలులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోను కోర్టు ముందుంచారు. ఈ నెల 23న జరిగే గ్రూప్-2 ప్రధాన పరీక్షను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే ముగిసిందని, ప్రధాన పరీక్షను నిలువరించవద్దని కోరారు. ప్రధాన వ్యాజ్యంపై కౌంటర్ వేసేందుకు సమయం కోరారు.

రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు చేరువ చేయాలి

» గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన వైడీ రామారావు, కోశాధికారి పి.రామచంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఏకే పరిడా మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని గవర్నర్ అభినందించి, పలు సూచనలు చేశారు. రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలకు తన సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు.

అక్టోబరు నాటికి చెత్త రహిత రాష్ట్రంగా ఏపీ

» రాష్ట్రమంతటా వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ యూనిట్లు

» ఎక్కడా డంపింగ్ యార్డులు కనిపించకూడదు: పట్టాభిరామ్

విజయవాడ (భారతీనగర్), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చే అక్టోబరు నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా డంపింగ్ యార్డు కనిపించకూడదనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అనారోగ్యం బారినపడకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. డంపింగ్ యార్డు రహిత కార్యక్రమంలో భాగంగా.. సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్‌ని నిల్వ చేయకుండా వేస్ట్ ప్రాసెస్ పద్ధతితో సంపద సృష్టిస్తున్నామన్నారు. ఏరోజు చెత్తను ఆరోజే వేస్ట్ ప్రాసెస్ పద్ధతి ద్వారా సంపదను సృష్టించవచ్చన్నారు. దీంతో ఎక్కడా డంపింగ్ యార్డులు ఉండవని చెప్పారు. ఇప్పుడున్న డంపింగ్ యార్డులను శుభ్రం చేసి.. పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబరు నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలి: నీలాయపాలెం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మానవాళి భవిష్యత్ కోసం జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు కార్యాలయంలో ఏపీ, తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డుల ఆధ్వర్యంలో పంచాయతీల్లో ఏర్పాటైన జీవ వైవిధ్య గ్రూపులకు, బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలకు మూడు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను పైలట్‌గా ప్రారంభించింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ జీవవైవిధ్య చట్టం-2002 పటిష్ఠంగా అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజుకు భూములు

క్లీన్ ఎనర్జీ ప్లాంట్లకు ఏడాదికి.. ఎకరానికి రూ.31,000 చొప్పున లీజు ధరతో, ప్రతి రెండేళ్లకు ఐదు శాతం లీజు పెంచే ప్రాతిపదికన ప్రభుత్వ భూములను అప్పగించనున్నారు. వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎస్‌ఐపీసీ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఏపీ ఎన్‌జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ సంస్థ 4000 మెగావాట్ల విండ్ పవర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 31 వేల లీజు ప్రాతిపదికన భూములను అప్పగించాలని ఎస్‌ఐపీసీ నిర్ణయించింది. ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ 1800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడల్ పవర్ ప్రాజెక్టును అన్నమయ్య, కడప జిల్లాల్లో స్థాపించేందుకు ప్రతిపాదనలు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు 864.87 ఎకరాలను ఏకమొత్తంలో ఎకరా రూ.5 లక్షల చొప్పున విక్రయించేందుకు ఎస్‌ఐపీసీ ఆమోదించింది. వీటిని సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఎస్‌ఐపీబీ సమావేశం ఆమోదించాలి.

కల్తీ నెయ్యి నిందితులకు ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో నిందితులకు సిట్ కస్టడీ మంగళవారం ముగిసింది. దీంతో వారిని సిట్ అధికారులు తిరుపతి సబ్‌జైలులో తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. కల్తీ నెయ్యి కేసులో నిందితులుగా ఉన్న ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్, భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, వైష్ణవీ డెయిరీ సీఈవో వినయ్‌కాంత్ చావడాకు రుయా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తర్వాత సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. సాయంత్రం సబ్‌జైలుకు తరలించారు. కాగా, ఈ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌పై 2వ ఏడీఎం కోర్టులో బుధవారం విచారణ జరగనుంది.

రాయితీ రేట్లకే కొప్పర్తి పారిశ్రామిక ప్లాట్లు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటుకు రాయితీ ధరలపై భూములు కేటాయించడానికి జారీ చేసిన జీవో 25లోని నిబంధనలను కొనసాగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాలుగు కేటగిరీలుగా భూములకు రాయితీ ధరలను నిర్ణయించారు. వాటిలో కొన్ని భూములు ఇప్పటికే కేటాయించగా.. మిగిలిన భూముల కేటాయింపునకు జీవో 25లో పేర్కొన్న ధరలే వర్తిస్తాయని, అయితే ఈ రాయితీ రేట్ల పారిశ్రామిక ప్లాట్లకు మాత్రమే వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాత్‌రూమ్ నుంచి సొంతింటికి..!

'ఆంధ్రజ్యోతి' కథనంతో నెరవేరిన పేదింటి కల

నేడు మడకశిర ఎమ్మెల్యే రాజు చేతులమీదుగా గృహప్రవేశం

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యంలో సిద్ధమైన నరసింహమూర్తి కొత్త ఇల్లు





అప్పట్లో నరసింహమూర్తి కుటుంబం నివసించిన బాత్‌రూమ్(ఫైల్)

మడకశిర రూరల్, ఫిబ్రవరి 18: స్నానాల గదినే ఆవాసంగా చేసుకుని దుర్భర జీవితం గడుపుతున్న ఓ పేద కుటుంబానికి 'ఆంధ్రజ్యోతి' కథనం ఆవాసాన్ని కల్పించింది. ఆ కుటుంబానికి ప్రభుత్వం చొరవతో సొంతింటి కల నెరవేర్చింది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యానికి చెందిన నరసింహమూర్తి, లక్ష్మీదేవి దంపతులు బుధవారం గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సొంత ఇల్లు లేని వీరు బాత్‌రూమ్‌లో నివసిస్తున్న దుస్థితిపై గతేడాది సెప్టెంబరు 24న 'వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. బాత్‌రూమ్‌లో నివాసం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది.



వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, అధికారులకు విన్నవించినా పక్కా ఇంటిని మంజూరు చేయని వైనాన్ని వివరించింది. దీంతో స్పందించిన మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. అదే రోజు గ్రామానికి వెళ్లి, ఆ కుటుంబ పరిస్థితి చూసి చలించిపోయారు. పక్కా ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకూ అద్దె ఇంట్లో ఉండేందుకు రూ.20 వేలు ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి 24 గంటల వ్యవధిలో లక్ష్మీదేవి పేరిట ఇంటి స్థలం పట్టా, పక్కా ఇంటిని మంజూరు చేయించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి భూమిపూజ చేశారు. 5 నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఇంటిని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభిస్తున్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రుణపడి ఉంటాం..

ఏళ్ల తరబడి బాత్ రూమ్‌లో గడిపాం. మా కష్టంపై 'ఆంధ్రజ్యోతి' స్పందించింది. అది చూసి ఎమ్మెల్యే స్పందించారు. ఇంటి పట్టా ఇప్పించారు. దగ్గరుండి ఇంటి నిర్మాణం జరిగేలా చూశారు. ఈ సంతోషానికి కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి, ఎమ్మెల్యేకు ఎంతగానో రుణపడి ఉంటాం.

- నరసింహమూర్తి, లక్ష్మీదేవి దంపతులు

స్వాతంత్ర్యం దేశానికే.. ఆలయాలకు రాలేదు

» దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

» ఐటీసీఎక్స్ సమావేశంలో మిలింద్ పరాండే డిమాండ్

» ఆలయాల విముక్తికి ప్రణాళిక ప్రకటించిన వీహెచ్‌పీ నేత

» తమిళనాడులో అధికారంలోకి వస్తే దేవదాయ చట్టం రద్దు

» తమిళనాడు రాష్ట్ర బీజేపీ చీఫ్ అన్నామలై ప్రకటన



వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందే గానీ హిందూ దేవాలయాలకు ఇప్పటికీ నిజంగా స్వాతంత్ర్యం రాలేదని విశ్వ హిందూ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే వ్యాఖ్యానించారు. తిరుపతిలో జరుగుతున్న అంతర్జాతీయ ఆలయాల సదస్సు- ప్రదర్శన (ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో- ఐటీసీఎక్స్-2025) రెండోరోజు సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పరాండే ప్రసంగిస్తూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేయడానికి కొత్త చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. దక్షిణాదితో పాటు యావత్ దేశంలో లక్షలాది హిందూ దేవాలయాలు ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నాయని, మరే మతమూ ఇలాంటి వివక్షను ఎదుర్కోవడం లేదని మండిపడ్డారు. ఇది హిందూ సమాజానికి అగౌరవమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దేవాలయాల సంపదను, నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను చూసిన బ్రిటిషర్లు వాటిని అధికార కేంద్రాలుగా గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఇప్పటికీ అదే కొనసాగుతోందని, దీనికి ముగింపు పలకాలని పరాండే పిలుపునిచ్చారు. 'మన దేవాలయాలకు కేంద్రీకృత నియంత్రణ అవసరం లేదు. దేశ చట్టాలకు లోబడి ఆలయాలు స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటున్నాం. అన్ని ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి. దీనికోసం భక్తులు, కార్యకర్తలు, సాధువులు, ఆచార్యులు, సుప్రీంకోర్టు లాయర్లు, విశ్రాంత ప్రధాన న్యాయమూర్తులతో ఒక మేధోమండలిని, దానిపై నియంత్రణకు రాజ్య ధార్మిక పరిషత్‌లో ఉన్నత వ్యవస్థను ఏర్పాటుచేయాలి' అని ఆయన సూచించారు. మత పెద్దలు, విశ్రాంత న్యాయమూర్తులు, సివిల్ సర్వెంట్లు, వ్యాపార, పరిశ్రమలకు చెందిన వ్యక్తులు, ఎస్సీ, ఎస్టీ తెగలు, మహిళలు, తత్త్వశాస్త్ర, సంప్రదాయ, ధార్మిక పద్ధతులు, ఆగమాలు తదితర రంగాల్లోని పండితులతో పాటు ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుడు, రాష్ట్ర ప్రధానన్యాయమూర్తి ధార్మిక పరిషత్‌లో సభ్యులుగా ఉంటారని వివరించారు. పారదర్శకత కోసం ప్రతి రెండేళ్లకు కమిటీలో మూడింట ఒక వంతు పదవీ విరమణ చేస్తారని వెల్లడించారు. ఇలాంటి విధానం ద్వారా హిందువుల డబ్బు హిందూ మతం కోసం, హిందూ సమాజంలోని పేదల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంటుందని, ఆలయ ఆస్తుల సంరక్షణకు ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. అర్చకులు, సేవకుల హక్కులను పరిరక్షణకూ వీలవుతుందని చెప్పారు. హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి నినాదంతో జనవరి 5న విజయవాడలో భారీ సభ జరిపామని, ఏపీలోని హిందూ ఆలయాలను హిందూ సమాజానికి అప్పగించాలని కోరుతూ, అందుకు తగిన ప్రణాళికతో కూడిన ప్రతిపాదనను సీఎం చంద్రబాబుకు అందజేశామని వివరించారు. రానున్న కాలంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఈ సమావేశాలు నిర్వహించి, ఆయా ముఖ్యమంత్రులకు ఈ ప్రతిపాదన సమర్పిస్తామని మిలింద్ పరాండే ప్రకటించారు.

అవన్నీ అక్రమ చట్టాలు: అన్నామలై



బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

తమిళనాడులో అధికారంలోకి వస్తే హిందూ దేవాలయాలను చెరబట్టిన హిందూ రెలిజియస్ చారిటబుల్ ఎండోమెంట్ (హెచ్‌ఆర్ అండ్ సీఈ) చట్టాన్ని రద్దు చేస్తామని తమిళనాడు బీజేపీ చీఫ్ కె.అన్నామలై ప్రకటించారు. ఐటీసీఎక్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఆలయ ఆర్థిక వ్యవస్థ, స్వయంప్రతిపత్తి అంశంపై ప్రసంగించారు. దేవదాయ చట్టాలు అక్రమ చట్టాలని అభివర్ణించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి దేవదాయ చట్టాలను రద్దు చేసి, ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్థిక శక్తికి, పుష్టికి దేవాలయాలు అత్యంత కీలకమన్నారు. ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానం మార్కెట్ క్యాప్ విలువ దాదాపు 2.5 లక్షల కోట్లని, అనేక అంతర్జాతీయ, జాతీయ సంస్థల కంటే ఇది పెద్దదని చెప్పారు. హిందూ రెలిజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్‌లు(హెచ్‌ఆర్‌సీఈ) దేవాలయాల ఆర్థిక పురోభివృద్ధికే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయని వివరించారు. తమిళనాడులో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు వేంకటేశ్వర స్వామి అవకాశం కల్పిస్తే... చట్టవిరుద్ధమైన విధానాలన్నింటినీ తొలగించి, మొత్తం 44,121 దేవాలయాలను హెచ్‌ఆర్‌సీఈ బారినుంచి విడిపిస్తామని అన్నామలై ప్రకటించారు. దేవాలయాలు ఎలా ఉండకూడదో తమిళనాడు ఆలయాలను చూసి తెలుసుకోవచ్చని అన్నారు. చారిత్రక ఆలయాలను మరమ్మతుల పేరుతో దుర్మార్గంగా ధ్వంసం చేస్తున్నారని, వీటిలో 600కు పైగా ఆలయాలు వెయ్యేళ్ల క్రితం నిర్మించినవని తెలిపారు. దేవుడికి భక్తులు దూరమయ్యేలా ద్రవిడ పార్టీలు చేస్తున్నాయని అన్నామలై ఆరోపించారు.

ఆలయ విద్యపై చర్చ

టెంపుల్ ఎక్స్‌పో రెండోరోజు కార్యక్రమాల్లో ఆలయ విద్యపై ప్యానెల్ చర్చ జరిగింది. షిర్డీ సాయిబాబా ట్రస్టు మాజీ చైర్మన్ గిరీష్ కులకర్ణి, వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ సలుంఖే, ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో ప్రతినిధి డాక్టర్ సురేష్ చర్చలో పాల్గొన్నారు. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ వాసుదేవ్ కులకర్ణి అధ్యక్షత వహించారు. అలాగే శ్రీవారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పలు ఆలయాలు, వివిధ అంశాలకు చెందిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో టీటీడీ అదనపు జేఈవో వెంకయ్య చౌదరి, కోవిలూరు మఠాధిపతి నారాయణ దేశిక స్వామిగళ్ పాల్గొన్నారు.



టీటీడీ ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బోర్డు సభ్యుడు నరేశ్ కుమార్

థర్డ్‌క్లాస్ నా.. కొ..! పోరా బయటికి..!!

» టీటీడీ ఉద్యోగిపై బోర్డు సభ్యుడి వీరంగం

» మహాద్వారం వద్ద ఆపడంతో ఆగ్రహం

» ఆలయ ప్రాంగణంలోనే తిట్ల దండకం

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగిపై ధర్మకర్త మండలి సభ్యుడు ఒకరు తిట్లతో విరుచుకుపడ్డారు. దర్శనం అనంతరం తనను మహాద్వారం గుండా బయటికి పంపకపోవడంతో ఆగ్రహించారు. భక్తులందరూ చూస్తుండగానే ఉద్యోగిపై నోరుపారేసుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న వీఐపీలు ఆలయం వెలుపలకు వచ్చే సమయంలో మహాద్వారం, గొల్లమండపం మధ్యలో తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. దీంతో బయటకు వచ్చేవారంతా బయోమెట్రిక్ వైపుగానే రావాలనే నిబంధనను కొన్నాళ్లుగా అమలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని బయటకు వస్తున్న బోర్డు సభ్యుడు బెంగళూరుకు చెందిన నరేశ్ కుమార్ గేటు తీయాలని మహాద్వారం వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగి బాలాజీని ఆదేశించారు. బయోమెట్రిక్ నుంచి వెళ్లాలని బాలాజీ చెప్పడంతో నరేశ్ ఆగ్రహంతో ఊగిపోయారు. 'ఎవడ్రా నువ్వు.. పోరా బయటకి! థర్డ్‌క్లాస్ నా.. కొ..! ఫస్ట్ బయటకి పంపండి ఇతన్ని. లేకుంటే ఇక్కడే కుర్చునేస్తాను' అంటూ విరుచుకుపడ్డారు. ఆ ఉద్యోగి భుజంపై చేయి వేసి నెట్టారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నరేశ్ కుమార్‌కు నచ్చజెప్పి ఆ ఉద్యోగిని అక్కడినుంచి పంపేశారు. నిజానికి... టీటీడీ బోర్డు సభ్యులను మహాద్వారం గుండా అనుమతించాలనే నిబంధన లేదు. అయినప్పటికీ... వారు మహాద్వారం గుండానే రాకపోకలు సాగించడం రివాజుగా వస్తోంది. ఉద్యోగి తనను అడ్డుకోవడం నరేశ్ దృష్టిలో తప్పే అయినప్పటికీ... ఆలయ ప్రాంగణంలోనే అసభ్యంగా మాట్లాడటం సరికాదనే అభిప్రాయం వినిపిస్తోంది. అక్కడి నుంచి హుందాగా వెళ్లిపోయి... తన పట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ ఉద్యోగిపై ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేస్తే సరిపోయేది!

నాటి ప్రభుత్వ పెద్దలతో కలిసి విక్రాంత్‌రెడ్డి కుట్ర!



» అరబిందోకు వాటాలు బదలాయించాలని కేవీరావుకు బెదిరింపులు

» సీఐడీ తరఫున ఏజీ దమ్మాలపాటి వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్ లో కేవీఆర్ గ్రూపు వాటాలు అరబిందోకు బదలాయించేందుకు అప్పటి ప్రభుత్వ పెద్దలతో కలిసి వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి కుట్రపన్నారని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. కేవీ రావు ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది డిసెంబరు 2న మంగళగిరి సీఐడీ పోలీసులు నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఏ-1 వై.విక్రాంత్‌రెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై ఏజీ మంగళవారం సీఐడీ తరఫున వాదనలు వినిపించారు. 'వాటాల బదలాయించేనాటికి పోర్టు లాభాల్లో నడుస్తోంది. రూ.2,600 కోట్లు విలువ చేసే 41శాతం వాటాను కేవలం రూ.480 కోట్లకే చేజిక్కించుకున్నారు. ఆడిట్ సంస్థ 2020 మార్చిలో నివేదిక ఇవ్వగా 2021 జనవరి వరకు మారిటైమ్ బోర్డు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కాకినాడ పోర్టు, సెజ్‌లలో కేవీఆర్ గ్రూపు వాటాలన్నీ అరబిందోకు బదిలీ అయ్యి.. వాటికి ప్రభుత్వం ఆమోదం తెలిపేవరకు మౌనంగా ఉన్న బోర్డు ఆ తర్వాత చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వానికి రూ.9 కోట్లు మాత్రమే నష్టం జరిగిందని పీకేఎఫ్ సంస్థ సవరించిన ఆడిట్ రిపోర్టుకు ఆమోదం తెలిపింది. అప్పులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే రూ.400 కోట్లకు కాకినాడ సెజ్‌లోని కేవీరావు వాటాను కొనుగోలు చేసేందుకు జీఎంఆర్ సంస్థ ఒప్పందానికి వచ్చింది. అందుకు విరుద్ధంగా రూ.12 కోట్లు చెల్లించి సెజ్‌లోని వాటాలను అరబిందోకు బదలాయించారు.

కాకినాడ పోర్ట్, సెజ్‌లకు సంబంధించి 2020 మార్చిలో పీకేఎఫ్ ఆడిట్ సంస్థ నివేదిక సమర్పించాక అదే ఏడాది మే, జూన్ నెలల్లో అప్పటి ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో అదనపు డీజీ పి.సీతారామాంజనేయులు, ఏసీబీ అధికారులు పాల్గొన్నారు. అందుకు సంబంధించి మీటింగ్‌లో పాల్గొన్న వ్యక్తి సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. పిటిషనర్ అప్పటి ముఖ్యమంత్రికి దగ్గర బంధువు.. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి కుమారుడు. వాటాల బదలాయింపు కోసం కేవీరావును బెదిరించారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. కేవీరావు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, విక్రాంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

క్యాబినెట్ ఆమోదానికి ముందే జగన్ మీడియాకు టారిఫ్ ఖరారు!

» అనుచిత లబ్ధి చేకూరేలా నిర్ణయించారు

» తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ వాదనలు

» తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు చెందిన సాక్షి పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారని పేర్కొంటూ సమాచార శాఖ అప్పటి కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏసీబీ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విజయ్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ప్రకటనలు ప్రచురించేందుకు 'జగతి పబ్లికేషన్స్'ను టారిఫ్‌ను పెంచేందుకు పిటిషనర్ ఆమోదం తెలిపారన్నారు. టారిఫ్ పెంపు అమల్లోకి వచ్చిన 2 నెలల తర్వాత 2019, అక్టోబరు 10న ఈ నిర్ణయాన్ని క్యాబినెట్ ర్యాటిఫై చేసిందని తెలిపారు. క్యాబినెట్ ఆమోదంతోనే టారిఫ్ పెంచామని పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక, సాక్షి చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, సాక్షి మీడియా గ్రూపులో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని ఐఅండ్‌పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో చట్టవిరుద్ధం నియమించారంటూ విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. దిల్లీబాబురెడ్డి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తుమ్మా పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు.

చైతన్య రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసులో దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో దేవిరెడ్డి చైతన్యరెడ్డిపై ఈ నెల 25 వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చైతన్య రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

రజని, పీఏలపై తొందరపాటు చర్యలు వద్దు

» పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గం టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదుతో వైసీపీ మాజీ మంత్రి విడదల రజనీ, ఆమె పీఏలపై పోలీసులు కేసు పెట్టిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసుకు సంబంధించి రజనీ, ఆమె పీఏలపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

కేసుల దర్యాప్తులో పురోగతి ఏదీ?

అనుచిత పోస్టులు పెట్టినవారిని అరెస్ట్ చేసి లోపలేస్తున్నారంతే!

న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు తేలిగ్గా భావిస్తున్నారు

'సోషల్ కేసుల'పై హైకోర్టు వ్యాఖ్యలు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టినవారిని కొట్టి లోపలేయడం తప్ప వారిపై నమోదు చేసిన కేసుల దర్యాప్తులో ఎలాంటి పురోగతి ఉండడం లేదని పోలీసులను ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారని ఆక్షేపించింది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన భర్త బోస రమణను ప్రకాశం జిల్లా, పొదిలి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆయన సతీమణి లక్ష్మి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యాజ్యం తాజాగా విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ స్పందిస్తూ.. నిందితుడు బోస రమణను పొదిలి పోలీసులు అరెస్ట్ చేసి, మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చకుండా వదిలివేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రకాశంజిల్లా ఎస్పీ, విశాఖ నగర పోలీస్ కమిషనర్ నివేదిక సమర్పించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. పొదిలి సీఐ తరఫు న్యాయవాది రిత్విక్ వాదనలు వినిపిస్తూ.. నిందితుడికి పూర్వ నేరచరిత్ర ఉందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపించిన తర్వాత కేసు దర్యాప్తు పురోగతి ఏదశలో ఉందని ప్రశ్నించింది. కేసులు కట్టి వ్యక్తులను అరెస్ట్ చేయడం, కొట్టి వారిని లోపల వేయడం తప్ప కేసుల దర్యాప్తులో ఎలాంటి పురోగతి ఉండడం లేదని పేర్కొంది. కేసు దర్యాప్తు చేసి ఉంటే వివరాలను కోర్టు ముందు ఉంచేవారని వ్యాఖ్యానించింది. పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఇచ్ఛాపురం సీఐ చిన్నం నాయుడులకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. బోస రమణ అరెస్ట్ విషయంలో నివేదిక సమర్పించేందుకు ప్రకాశం ఎస్పీ, విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కు మరికొంత సమయం ఇస్తూ విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావులతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన భర్త బోస రమణను దర్శి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆయన భార్య బోస లక్ష్మి గత ఏడాది నవంబరులో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం పొదిలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోను ప్రతివాదిగా చేర్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. పొదిలి ఇన్‌స్పెక్టర్ కౌంటర్ దాఖలు చేశారు.

నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందా జగన్!

» అబద్ధాలు కాన్ఫిడెంట్‌గా చెప్పడంలో పీహెచ్‌డీ చేశారు: లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందనే శాపం మీకేమైనా ఉందా జగన్ రెడ్డిగారు?' అని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. మంగళవారం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. వంశీతో ములాఖత్ తర్వాత జగన్.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసును ఫేక్ కేసు అంటూ చేసిన వ్యాఖ్యల వీడియోను, అలాగే, గన్నవరం టీడీపీ కార్యాలయంలో వంశీ అనుచరుల విధ్వంసం వీడియోను పోస్టు చేశారు. పచ్చి అబద్ధాలను కాన్ఫిడెంట్‌గా చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ చేసినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. 'మీరు ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారనే భ్రమలోంచి ఇకనైనా బయటకు రండి' అని హితవు పలికారు.

ఇప్పుడు లెవన్ రెడ్డి.. తర్వాత జీరో రెడ్డి: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన, అడ్డూ అదుపూ లేకుండా నోరు పారేసుకోవడంతో వైసీపీకి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పినప్పటికీ జగన్‌లో ఇంకా మార్పు రాలేదని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. జగన్ నోటిని అదుపులో పెట్టుకోకపోతే ఆ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా ఉండరని విమర్శించారు. ఇప్పుడు జనం జగన్‌ను 'లెవన్ రెడ్డి' అని పిలుస్తున్నారని, వచ్చే ఎన్నికల తర్వాత 'జీరో రెడ్డి' అని పిలుస్తారని పేర్కొన్నారు.

నేరస్తుల ఆపద్బాంధవుడు జగన్!: సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలీసుల టోపీలపై సింహం గుర్తులు ఉంటాయని మాజీ సీఎం జగన్ ఇప్పుడు తెలుసుకున్నందుకు అభినందనలు అంటూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఎద్దేవా చేశారు. ఐదేళ్ల సీఎంగా ఉండి రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని సొంత సైన్యంలా, రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి నిస్సిగ్గుగా ఉపయోగించుకున్నారంటూ 'ఎక్స్'లో విమర్శించారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకోకపోతే నేరస్తులకు ఆపద్బాంధవుడిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారన్నారు.

వంశీ.. పాపం అనుభవించక తప్పదు: మంత్రి బీసీ

పత్తికొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎవరు చేసిన పాపం వారు అనుభవించక తప్పదని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలో మాట్లాడుతూ వల్లభనేని వంశీ చేసిన దుర్మార్గాలు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ అండకో చేసిన భూదందాలు, మైనింగ్ అక్రమాలు, లిక్కర్‌వ్యాపారం గుర్తు చేసుకోవాలన్నారు. జగన్ హయాంలో చేసిన పాపాలే పండుతున్నాయన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌కు 76 ప్రాజెక్టులు ఎంపిక

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని పలు ప్రభుత్వ విభాగాలు సంయుక్తంగా నిర్వహించే 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్'కు రాష్ట్రం నుంచి 76 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 5,443 పాఠశాలలకు చెందిన 61,207 మంది విద్యార్థులు దీనిలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. 8,748 వినూత్న ఆలోచనల ప్రాజెక్టులను రూపొందించారన్నారు. వాటిలో 76 ప్రాజెక్టులను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ, యూనిసెఫ్, ఏఐఎం ఎంపిక చేశాయని తెలిపారు. ఎంపిక ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను ఎస్పీడీ అభినందించారు.

రేపటి కేబినెట్ భేటీ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లనున్నందున.. ఈ నెల 20న జరగాల్సిన రాష్ట్ర కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ప్రతినెలా మొదటి, నాలుగో గురువారాలు కేబినెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 20న సమావేశం జరగాల్సి ఉంది. అయితే, అదే రోజు ఢిల్లీలో నూతన సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి చంద్రబాబు హాజరవుతుండటంతో కేబినెట్ సమావేశం వాయిదా పడింది.

రేపు కేంద్ర వ్యవసాయ మంత్రితో చంద్రబాబు భేటీ

రాష్ట్రంలోని మిర్చి రైతులకు సాయం చేయాలని కోరేందుకు సీఎం చంద్రబాబు గురువారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలవనున్నారు. ఇప్పటికే రెండు సార్లు కేంద్ర మంత్రితో మాట్లాడిన సీఎం.. మిర్చి రైతుల సమస్యలు వివరించి, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని మరోసారి కోరనున్నారు. ఇదే అంశంపై గతేడాది డిసెంబరు 26, ఈనెల 5, 11 తేదీల్లో కేంద్రానికి సీఎం లేఖలు రాశారు.

ఏపీపీఎస్సీ సభ్యుడు సలాంబాబు రాజీనామా

» ఆమోదించిన గవర్నర్.. వైసీపీ నేతగా గుర్తింపు

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ సభ్యుడిగా నియమితులైన ఎస్. సలాంబాబు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వైసీపీ విద్యార్థి విభాగం నేతగా పనిచేసిన సలాంబాబును గత ప్రభుత్వం ఏపీపీఎస్సీ సభ్యుడిగా నియమించింది. ఆయనతో పాటు కమిషన్‌లో అనేక మంది వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారు.

గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు అధోగతి: లంకా

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులను అధోగతి పాలుచేశారని 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. మంగళవారం కడప పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆకాంక్షల జిల్లాగా కడపకు ప్రథమస్థానం వస్తుండటం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జల్‌జీవన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు, పట్టణాల్లో అమృత్ పథకం ద్వారా తాగునీరు ఇస్తున్నామన్నారు. అయితే జల్ జీవన్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అచేతనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్ల పీఎం ఫసల్ బీమా పథకం ఇవ్వడంలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. కేంద్రం ఎరువుల సబ్సిడీకి రూ.1565 కోట్లు ఇస్తే వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని దినకర్ విమర్శించారు.

ఏపీకి మరిన్ని పర్యాటక ప్రాజెక్టులు: కందుల దుర్గేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఏపీకి మరిన్ని పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులు కేటాయించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించినట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా.. ఏపీకి శాస్కి స్కీమ్ ద్వారా అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పలు పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు దుర్గేశ్ తెలిపారు. బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా ఏపీకి ఒక సర్క్యూట్ కేటాయిస్తామని వెల్లడించినట్లు చెప్పారు.

కోడ్ ఉల్లంఘించి డీపీసీ ఏర్పాటు!

» వ్యవసాయ శాఖ అధికారులపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ఈ నెల 7న జీవో 57 నంబరుతో డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలుగు రాష్ట్రాల కామన్ మ్యాన్ ఫోరం కన్వీనర్ గౌరి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని తెలిపారు.

ఏపీకి ఆశాజ్యోతిగా పవన్ కల్యాణ్: ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'విభజిత ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 11 ఏళ్లు పూర్తయింది. జరిగిన నష్టాన్ని రాబట్టడంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒక్కరే ఏపీకి ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారు' అని రాజమండ్రి మాజీ ఎంపీ అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పవన్ చొరవ చూపించి కేంద్రం నుంచి సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయించాలని కోరారు.

బట్టలూడదీయిస్తాం!

» పోలీసులపై జగన్ దురుసు వ్యాఖ్యలు



జైలులో ఉన్న వల్లభనేని వంశీని పరామర్శించిన తర్వాత మాట్లాడుతున్న జగన్

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీసులపై మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి దురుసు వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీసులను, నాయకులను బట్టలూడదీసి నిలబెడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కలకాలం తెలుగుదేశం ప్రభుత్వం ఉండబోదనీ, మళ్లీ అధికారంలోకి వస్తాననీ, ఎవరినీ వదలననీ తీవ్ర స్వరం వినిపించారు. అన్యాయంగా కేసులు పెట్టి, దిగజారిపోయి వ్యవహరిస్తున్న ప్రతి పోలీసు అధికారీ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మంగళవారం కలిసి బయటకు వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నేతలకు సెల్యూట్ చేయడం మానుకోవాలని వ్యాఖ్యానించారు. "వంశీని అరెస్టు చేసేటప్పుడు ఒక సీఐ తాను ఏడాదిలో రిటైర్ అయిపోతానని చెప్పారని తెలిసింది. రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా మొత్తం అందర్నీ పిలిపించి చట్టం ముందు నిలబెడతాం. ఇప్పుడు బాధితులుగా ఉన్న వారికి అప్పుడు న్యాయం చేస్తాం. అన్యాయం చేస్తే ప్రజలు, దేవుడు కచ్చితంగా శిక్షిస్తారు. అలాంటి అన్యాయంలో పోలీసులు భాగస్వాములు కావద్దు" అని జగన్ అన్నారు. ప్రజాస్వామ్యం దిగజారి పోయిందనడానికి వంశీ కేసు ఒక నిదర్శనమన్నారు. వంశీతో జైలు ములాఖత్‌లో సుమారు 40 నిమిషాలపాటు జగన్ మాట్లాడారు.

వంశీ కస్టడీ, బెయిల్ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

వంశీని పది రోజులకు కస్టడీ ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్, తనకు బెయిల్ ఇవ్వాలని వంశీ వేసిన పిటిషన్లపై విచారణను విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

20 వేల కోసం పది రోజులు కస్టడీ కోరతారా?: వంశీ సతీమణి

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికేసులో ఫిర్యాదుదారు అయిన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి వంశీ రూ.20 వేలు లాక్కుంటే, దాన్ని రికవరీ చేయడానికి ఆయనను పదిరోజులకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు ఎలా పిటిషన్ వేస్తారని వంశీ సతీమణి పంకజశ్రీ ప్రశ్నించారు. జైలు ముందు ఆమె మీడియాతో మంగళవారం మాట్లాడారు.

నెల్లూరు జైలుకు ముగ్గురు నిందితులు: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో లొంగిపోయిన ముగ్గురు నిందితులను మంగళవారం విజయవాడ మూడో ఏసీఎంఎం కోర్టులో హాజరు పరిచారు. ఆ కేసులో ఉన్న ఏ47 షేక్ ఎంఎం కలాం, ఏ55 షేక్ సర్దార్ జానీ, ఏ68 రాచేటి రూతమ్మలకు న్యాయమూర్తి మార్చి 4వ తేదీ వరకు రిమాండ్ విధించారు. విజయవాడ జైలులో ఖాళీ లేకపోవడంతో వారిని నెల్లూరు జైలుకు తరలించారు.

గ్లామర్‌గా ఉన్నారని టార్గెట్ చేశారు

చంద్రబాబు, లోకేశ్ కంటే వల్లభనేని వంశీ, కొడాలి నాని గ్లామర్‌గా ఉండడం వల్లే వారిని టార్గెట్ చేశారని జగన్ అన్నారు. చంద్రబాబు సామాజికవర్గం నుంచి నేతలుగా వారిద్దరూ ఎదుగుతుండడంతో కడుపు మండుతోందన్నారు. త్వరలో ఏదో ఒక రోజున దేవినేని అవినాశ్ కూడా వారికి టార్గెట్ అవుతాడన్నారు. కాగా, జైలులోని వంశీని కలవడానికి జగన్ వెంట వంశీ సతీమణి పంకజశ్రీ, వైసీపీ నేతలు సింహాద్రి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, నందిగం సురేశ్ ఉన్నారు. ములాఖత్‌కు వీరందరి పేర్లు జైలు అధికారులకు వైసీపీ నేతలు ఇచ్చారు. జాబితాను పరిశీలించిన జైలు అధికారులు.. జగన్, పంకజశ్రీ, సింహాద్రి రమేశ్‌కు మాత్రమే అనుమతించారు. కాగా, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలక పదవులు అనుభవించిన మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేశ్.. జగన్ వెంట కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ 'ట్రూత్ బ్లాస్ట్' తుస్..!

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు వెనుక దాగి ఉన్న అసలు నిజాన్ని మంగళవారం రాత్రి 7గంటలకు 'బిగ్‌బ్లాస్ట్' చేస్తామంటూ వైసీపీ వర్గాలు అట్టహాసంగా చేసిన ప్రకటన తుస్.. మంది. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారంపై ఏవో నిజాలు చెబుతామన్న వైసీపీ నేతలు చివరకు చతకిలపడితే... అంతకంటే ముందే టీడీపీ నేతలు... బాధితుడు సత్యవర్ధన్ కిడ్నాప్ దృశ్యాలను విడుదల చేయడం విశేషం. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదంటూ న్యాయమూర్తి ఎదుట సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చారని వంశీని జైలులో కలిసి బయటకు రాగానే మాజీ సీఎం జగన్ మీడియాకు తెలిపారు. సత్యవర్ధన్ తనంత తానుగా ఆటోలో వచ్చి తనకు గన్నవరం టీడీపీ కార్యాలయం ఘటనతో సంబంధం లేదని.. ఆ సమయంలో తాను అక్కడ లేనంటూ సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చారని జగన్ అన్నారు. ఈ గొడవ సమయంలో వంశీ అక్కడ లేరని వత్తాసు పలికారు. అసలు కిడ్నాపే జరగలేదని .. తననెవరూ హింసించలేదని సత్యవర్ధన్ చెబుతుంటే.. వంశీపై దొంగ కేసు పెట్టారని జగన్ చెప్పుకొచ్చారు. అయితే, జగన్ మీడియాతో మాట్లాడకముందే ఆయన రోత మీడియాలో 'గన్నవరం బ్లాస్ట్ టుడే ఎట్ 7 పీఎం' అంటూ ప్రకటన వచ్చింది. దీంతో.. వైసీపీ వర్గాలు ఏం చెబుతాయోనని అందరూ ఎదురుచూశారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. అయితే, దీనికంటే ముందే.. 'వైసీపీ ట్రూత్ బాంబ్'కు కౌంటర్‌గా సోషల్ మీడియాలో ఓ వీడియోను టీడీపీ పోస్టు చేసింది. దళిత యువకుడు సత్యవర్ధన్‌ను విజయవాడలోనే కిడ్నాప్ చేశారని పేర్కొంది. కిడ్నాప్ చేసిన కారులోనే కోర్టుకు తీసుకువెళ్లి బలవంతంగా వ్యతిరేక వాంగ్మూలం ఇప్పించారని ఆరోపించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని వల్లభనేని వంశీ ఇంటికి తీసుకువెళ్లారని వెల్లడించింది. ఇందుకు సాక్ష్యాధారంగా ఆ రోజు సీసీ కెమెరా ఫుటేజీని పోస్టు చేసింది. ఈ నిజాలు చూశాకైనా జగన్ వాస్తవాలు అంగీకరించాలని డిమాండ్ చేసింది.

కొసమెరుపు: దొంగ కేసులు పెట్టే పోలీసులను బట్టలూడదీస్తానంటూ విజయవాడలో మీడియా ముందు జగన్ హెచ్చరించారు. దీనిపైనా టీడీపీ నేతలు స్పందించారు. 'ఇప్పుడు జరుగుతున్నది అదే కదా జగన్' అంటూ చురక అంటించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఎమ్మెల్యే వెంకట్రావు, పట్టాభి తదితరులు

దళితులపై దాడి చేసిన వంశీకి జగన్ వత్తాసా!

» వృత్తిధర్మం నిర్వహిస్తున్న పోలీసుల్ని బెదిరిస్తారా?

» జగన్‌పై మంత్రులు, టీడీపీ నేతల ధ్వజం

» సత్యవర్ధన్ కిడ్నాప్ దృశ్యాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దళితుడిని కిడ్నాప్ చేసి హింసించిన వల్లభనేని వంశీకి జగన్ వత్తాసు పలకడం దారుణమని పలువురు మంత్రులు, టీడీపీ నేతలు విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారంతా జగన్ తీరుపై ధ్వజమెత్తారు. గన్నవరం టీడీపీ కార్యాలయ ఉద్యోగి సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేసి తీసుకెళుతున్న సీసీ కెమెరా ఫుటేజీని విడుదల చేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఓ రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలు లేవని, అలాంటి నీచ సంస్కృతికి జగన్ తెరలేపారని విమర్శించారు. అందమంటే మీ దృష్టిలో గూండాయిజం, రౌడీయిజం, దోపిడీలు చేసేవారా అని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకుని కృష్ణా జిల్లాలో వల్లభనేని వంశీ, కొడాలి నాని, జోగి రమేశ్, పేర్ని నాని చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, చట్టం నుంచి వీరెవ్వరూ తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. తప్పు చేసిన వారిని వదిలేది లేదన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రౌడీలకు, దొంగలకు జగన్ వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. వృత్తిధర్మం నిర్వహిస్తున్న పోలీసులను బెదిరించడం సమంజసమా? అని ప్రశ్నించారు. జగన్ తన తీరు మార్చుకోకపోతే ప్రజలు వైసీపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం మాట్లాడుతూ దళిత బిడ్డను కిడ్నాప్ చేసిన వంశీ తన ఇంటికే తీసుకెళుతున్న సీసీ ఫుటేజీని విడుదల చేశామని, ఇప్పుడు వంశీ ఉత్తముడని జగన్ చెప్పగలరా అని నిలదీశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మనిషనే వాడు చేయని దుర్మార్గాలు చేసిన వంశీని జైలుకు వెళ్లి పరామర్శించడం కన్నా దారుణం ఏముంటుందన్నారు.

ఏ మొహం పెట్టుకొని పరామర్శించావ్: పల్లా

దళిత ఉద్యోగి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హింసించి హత్య చేస్తానని బెదిరించిన వంశీని ఏ మొహం పెట్టుకుని పరామర్శించారని జగన్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ నిలదీశారు. ఈ మేరకు జగన్‌కు ఆయన ఓ బహిరంగ లేఖ రాశారు. జైలులో ఉన్న దళిత వ్యతిరేకి, మహిళాద్రోహి వంశీని పరామర్శించేందుకు మనసెలా అంగీకరించిందని ప్రశ్నించారు. దళితులకన్నా నేరస్థుడు ఎక్కువయ్యాడా అని నిలదీశారు.

జగన్.. బెదిరింపులు మానుకోవాలి

» ఏపీ పోలీస్ అధికారుల సంఘం డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 18: పోలీసు అధికారులను అవమానిస్తూ, బెదిరించేలా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం మండిపడింది. బెదిరింపు వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని, పోలీస్ అధికారులను రిటైర్ అయిన తర్వాత కూడా ఎక్కడున్నా తీసుకొచ్చి బట్టలూడదీసి నిలబెడతానని జగన్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. పోలీసులు రాజకీయాలకతీతంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ జగన్ తన రాజకీయ లబ్ధి కోసం ఇలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్టాలు, ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వారికి పోలీసులు సెల్యూట్ చేయరని మాజీ సీఎం తెలుసుకోవాలని హితవు పలికారు.

మీ నీటి ప్రణాళికలేంటి?

» ఎల్లుండిలోగా సమర్పించండి

» రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ

» ఇప్పటికి 66:34 నిష్పత్తిలోనే నీటి పంపిణీ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో మిగిలిన జలాలను ఈ ఏడాది జూన్, జూలై వరకు ఎలా వినియోగించుకుంటారో ప్రణాళికలు అందించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఏపీ, తెలంగాణను కోరింది. శుక్రవారం (21వ తేదీ) లోగా ఈ ప్రణాళికలను తనకివ్వాలని తెలిపింది. కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్ ఆమోదంతో ఎస్ఈ జి.వరలక్ష్మి రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు ఈ మేరకు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, సాగర్‌లలో ప్రస్తుతం విగిలి ఉన్న జలాల్లో ఏపీకి 27.03 టీఎంసీలు, తెలంగాణకు 131.75 టీఎంసీల వాటా మిగిలి ఉందని బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటికే సాగర్ నుంచి 15.86 టీఎంసీల విడుదలకు ఇండెంట్ పెట్టిన ఏపీ.. తాజాగా మరో 18 టీఎంసీలు విడుదల చేయాలని కోరినట్లు పేర్కొంది. దీనిని ఆమోదించవద్దని తెలంగాణ స్పష్టం చేసిందని.. ఇదే సమయంలో ఈ నెల నుంచి జూలై వరకు 116 టీఎంసీలు కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా తీసుకుంటామని ఇండెంట్ పెట్టిందని కేఆర్ఎంబీ పేర్కొంది. విభజన చట్టం ప్రకారం 2015 జూన్‌లో జరిగిన ఒప్పందం మేరకు కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలూ 66:34 నిష్పత్తిలోనే పంచుకోవాలని స్పష్టం చేసింది. గతనెల 21న జరిగిన 19వ బోర్డు సమావేశం మినిట్స్‌ను రెండు రాష్ట్రాలతో సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం మంగళవారం విడుదలచేసింది. 11 ప్రాంతాల్లో టెలిమెట్రీ (నీటి తరలింపును లెక్కించే) యంత్రాలు పెట్టాలని జనవరి 10న తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారని, వీటిని బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ (తెలుగు గంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడి కాలువ, గాలేరు-నగరి సుజల స్రవంతి, ఎస్కేప్ రెగ్యులేటర్)తోపాటు ముచ్చుమర్రి, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం కింద పెట్టాలని కోరారని, ఇందుకయ్యే వ్యయం తామే భరిస్తామని ప్రతిపాదించారని తెలిపింది. అయితే ఇందుకు అంగీకరించే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ తేల్చిచెప్పినట్లు వెల్లడించింది. శ్రీశైలం డ్యాం ప్లంజ్‌పూల్ మరమ్మతులను అత్యంత ప్రాధాన్య అంశంగా పేర్కొంది. శ్రీశైలం, సాగర్ నిర్వహణపై యథాతథస్థితి కొనసాగించాలని నిర్ణయించింది.

నేటి నుంచి ట్రైబ్యునల్ విచారణ

కృష్ణా జలాల వివాదంపై బుధవారం నుంచి మూడ్రోజుల పాటు బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుపనుంది. తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపించనుంది. వీటి ఆధారంగా ఏపీ తన వాదనలు వినిపించేందుకు సన్నద్ధమవుతోంది. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాలూ చెరిసగం పంచుకోవాలని తెలంగాణ డిమాండ్ చేస్తుండగా.. 66:34 శాతం నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేస్తోంది. 75 శాతం నీటి లభ్యతను ప్రామాణికంగా తీసుకుని ప్రాజెక్టుల వారీగా ఈ నీటిని కేటాయించాలని కోరుతోంది. బచావత్ ట్రైబ్యునల్ గతంలో ఇచ్చిన తీర్పు కృష్ణా పరివాహక రాష్ట్రాలన్నిటికీ శిరోధార్యమని.. ఈ ట్రైబ్యునల్ చేసిన నికర జలాల కేటాయింపులను బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ యథాతథంగా ఆమోదించిందని గుర్తుచేస్తోంది. ఇంకోవైపు.. కృష్ణా జలాల వివాదంపై ఈ నెల 27వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరుగనుంది. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ కొనసాగింపు న్యాయసమ్మతం కాదని ఆంధ్రప్రదేశ్ అంటోంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల పునఃపంపకం కోసం బ్రిజేశ్ ట్రైబ్యునల్ గడువు పొడిగించడంపై స్టే ఇవ్వాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరనుంది.

నదుల అనుసంధానంతో సిరిసంపదలు

» పోలవరంతో రాష్ట్రం దశ, దిశ మారతాయ్: మంత్రి నిమ్మల

» రాజస్థాన్‌లో జల మంత్రుల సదస్సు



న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానం, నీటి వనరుల సమర్థ సద్వినియోగంతో రాష్ట్రంలో సిరిసంపదలు సృష్టించవచ్చనే ప్రగాఢ విశ్వాసంతో తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రఖ్యాత ఇంజనీర్ కేఎల్ రావు ఏనాడో చెప్పిన నదుల అనుసంధాన ప్రక్రియకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల సమర్థ నాయకత్వంలో శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో అఖిల భారత జలవనరుల మంత్రుల రెండోసదస్సులో ఆయన పాల్గొన్నారు. కేంద్రం సహకారంతో ఆంధ్రను కరువు రహిత రాష్ట్రంగా మారుస్తాం. వినూత్న, శాస్త్రీయ విధానాలతో 2047 నాటికి జల భద్రత కల్పిస్తాం. రాష్ట్రంలోని 5 ప్రధాన నదులు, 35 చిన్న నదుల నీటిని గరిష్ఠంగా వినియోగించి రాయలసీమ వంటి కరువు ప్రాంతాలకు నీటిని తరలించేలా కార్యాచరణ చేపడుతున్నాం. గోదావరి-కృష్ణా, పోలవరం-ఏలేరు, కృష్ణా-పెన్నా, గోదావరి-బనకచర్ల, గోదావరి-చంపావతి, వంశధార-నాగావళి అనుసంధానం కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం. నీటి నిల్వ సామర్థ్యాన్ని 480 టీఎంసీలు పెంచి.. 37 లక్షల ఎకరాలను స్థిరీకరించి, కొత్తగా 37.5 లక్షల ఎకరాలకు నీరు అందించాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. హంద్రీ-నీవా సుజల స్రవంతిని విస్తరించడం ద్వారా సీమలో దుర్భిక్షాన్ని నివారించే చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో కోటి ఎకరాలకు నీటి వసతి కల్పించాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా, గోదావరి డెల్టాల స్థిరీకరణ జరుగుతుంది. సుస్థిర వ్యవసాయం సాధ్యపడుతుంది.. తద్వారా రాష్ట్రం దశ, దిశ మారతాయి. మరో 85 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. భూగర్భ జలాలను కొలిచేందుకు 1,810 జియో మీటర్లు ఏర్పాటు చేశాం. దేశంలోనే తొలిసారిగా బోర్‌వెల్స్‌కు జియో ట్యాగ్ చేసి వినియోగిస్తున్నాం' అని తెలిపారు. పోలవరం-బనకచర్ల అనుసంధానం, మరికొన్ని ప్రతిపాదిత ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో ఆర్థిక సాయం చేయడంతోపాటు అన్ని రకాల అనుమతులూ ఇవ్వాలని వేదికపైనే ఉన్న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.

రైల్వే జోన్ భవన పనులకు శ్రీకారం!

» కేటాయించిన భూమిలో మట్టి పరీక్షలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేంద్ర కార్యాలయ నిర్మాణ పనులు ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ అధికారులు ముడసర్లోవలో 52 ఎకరాలు గత ఆగస్టులో రైల్వేశాఖకు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ భూమిలో మంగళవారం మట్టి పరీక్షలు చేపట్టారు. లేబొరేటరీ నుంచి నివేదిక వచ్చాక నిర్మాణం మొదలుపెట్టనున్నారు. గత నవంబరులోనే జోనల్ కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. అందులో జీఎం కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలు ఉంటాయి. భవనంలో రెండు బేస్‌మెంట్లు (బీ1, బీ2 సెల్లార్లు), గ్రౌండ్ ఫ్లోర్, దానిపై మరో 9 అంతస్థులు ఉంటాయి. ఈ ప్రక్రియ ఇంకా ఖరారు దశలోనే ఉండడంతో కేంద్రంపై ఒత్తిడి పెరిగింది. దీంతో గతనెల 8న ప్రధాని మోదీ విశాఖ వచ్చి రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జోనల్ కార్యాలయ భవనం నిర్మాణానికి రైల్వేశాఖ 24 నెలలు గడువు విధించింది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే 2027 జూన్‌కు పూర్తవుతుంది. అప్పటివరకూ జోన్ కార్యకలాపాలు ప్రారంభించకుండా ఉండడం అన్యాయమని, ప్రస్తుతం విశాఖలో ఉన్న రైల్వే భవనాల్లోనే కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి. కాగా... మట్టి పరీక్ష పనులను పరిశీలించడానికి బీజేపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పరశురామరాజు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం అక్కడకు వెళ్లారు. ఆయన వెంట కె.సతీశ్‌బాబు, మురళీమోహన్‌రాజు, కోటేశ్వరరావు, లక్ష్మణరావు, మీనాక్షి, ఇతర నేతలు ఉన్నారు.



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ ప్రభుత్వ, సింఘానియా స్కూల్ ట్రస్ట్ ప్రతినిధులు

సృజనాత్మక విద్యాబోధనే లక్ష్యం

» పాత పద్ధతులకు స్వస్తి: మంత్రి లోకేశ్

» విద్యా నైపుణ్యాల అభివృద్ధికి సింఘానియా ట్రస్ట్‌తో ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న పాత పద్ధతులకు స్వస్తి చెప్పి.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా 'కేజీ టు పీజీ' వరకు కరికులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కళాశాల చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే విద్యార్థులకు వెంటనే ఉద్యోగాలు లభించేలా వారిలో నైపుణ్యాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో సృజనాత్మకతతో కూడిన విద్యాబోధన, నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు 'సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్టు'తో ప్రభుత్వం మంగళవారం ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్ సమక్షంలో సింఘానియా గ్రూప్, రాష్ట్రప్రభుత్వ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సింఘానియా స్కూల్ ట్రస్టు ఆధ్వర్యంలో తొలుత తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ, జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం తదితర అంశాల్లో మార్పులు తీసుకురానున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఐదేళ్లలో లక్షమంది విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడ నగరాలకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరిస్తారు. సింఘానియా గ్రూప్ చైర్మన్ గౌతమ్ హరి సింఘానియా, సింఘానియా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్, రేమాండ్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కె. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఎయిడెడ్' ఆస్తుల దోపిడీకి జగన్ కుట్ర

జగన్ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 42 కారణంగా 80 ఎయిడెడ్ కాలేజీలు మూతబడ్డాయని మంత్రి లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ కాలేజీల ఆస్తుల దోపిడీకి జగన్ కుట్ర పన్నారని, ఫలితంగా విద్యార్థులకు తీవ్రనష్టం జరిగిందని ఆరోపించారు. జీవో 42 వల్ల కలిగిన నష్టాన్ని తగ్గించేలా కొత్త పాలసీ రూపొందించాలని, ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యాశాఖలపై మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో లోకేశ్ సమీక్షించారు. జీవో 117కు ప్రత్యామ్నాయంపై ప్రజాప్రతినిధులతో వర్క్‌షాప్ నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల పెంపుపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు.

హెల్మెట్... భారం కాదు భద్రత!




'నాన్నా పది నిమిషాలు ఆలస్యమైనా పర్వాలేదు. క్షేమంగా ఇంటికి రండి' అంటూ ఓ చిన్నారి కూతురు తండ్రి క్షేమం కోరుతోంది. 'ఏవండోయ్ హెల్మెట్ మీ తలకు బరువు కాదు.. మన కుటుంబానికి భద్రత. సీటు బెల్ట్ ధరించండి.. క్షేమంగా మీ గమ్య స్థానాలకు చేరుకోండి' అంటూ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసులు రకరకాల ఫ్లెక్సీలను ఏలూరు నగర వీధుల్లో ఏర్పాటు చేశారు. వీటిని చూసి వెళ్లడమే తప్ప.. వీటిని పాటించాలనే స్పృహ చాలా మందిలో కనిపించలేదనడానికి హెల్మెట్ లేకుండా సాగిస్తున్న ఈ ప్రయాణ దృశ్యాలే నిదర్శనం.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి

ఇది నాన్‌వెజ్ మొక్క!

విభిన్న జాతుల మొక్కలకు విశాఖపట్నంలోని జీవ వైవిధ్య ఉద్యానవనం నిలయంగా మారింది. ఇక్కడ ఒక అరుదైన మొక్క అందరినీ ఆకట్టుకుంటోంది. దాని పేరు పిక్చర్ ప్లాంట్. శాస్త్రీయ నామం నెపెంతెస్. దీనికి కీటకాహార మొక్క, నాన్‌వెజ్ మొక్క, ఆకలి మొక్క అన్న పేర్లు కూడా ఉన్నాయి. ఈ మొక్క ఆకు చివరి భాగంలో బ్లాడర్ (సంచి) మాదిరిగా ఉంటుంది. దాని అంచు చివరన మకరందాన్ని స్రవిస్తుంది. ఆ మకరందం కోసం పురుగులు, చీమలు, కీటకాలు బ్లాడర్ వద్దకు చేరి అందులో దిగుతుంటాయి. బ్లాడర్ జిగురుగా ఉండడం వల్ల పైకి రాలేక అందులోనే చనిపోతాయి. పిక్చర్ ప్లాంటు.. ఆ పురుగులను జీర్ణం చేసుకుని అవసరమైన ప్రోటీన్లను ఉత్పత్తి చేసుకుని ఎదుగుతుంది. సాధారణంగా మేఘాలయ, అసోం వంటి ప్రాంతాల్లో పెరిగే ఈ మొక్కను.. సూర్యరశ్మికి దూరంగా పెంచుతున్నారు ఉద్యానవన నిర్వాహకులు ఎం.రామమూర్తి, మంగతాయి దంపతులు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



కొత్తగా 120 ప్రాంతాలకు

విమాన సౌకర్యం

నాలుగున్నరేళ్లలో కల్పిస్తాం

- ఎయిర్ కార్గోతో దేశవిదేశాలకు పంట ఉత్పత్తుల ఎగుమతి
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి ప్రకటన
- కేంద్ర బడ్జెట్‌పై గుంటూరులో చర్చాగోష్ఠి


కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో టీడీపీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వచ్చే నాలుగున్నరేళ్లలో దేశంలో కొత్తగా 120 ప్రాంతాలకు విమాన సౌకర్యం కల్పించబోతున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమానాశ్రయాల నిర్మాణం, సీప్లేన్, హెలికాప్టర్లు.. ఇలా ఏదో ఒక రూపంలో కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. మంగళవారం గుంటూరులో బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ (2025-26)పై ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. అశోక్ గజపతి రాజు కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా ఉన్న సమయంలోనే మోదీ ప్రభుత్వం ఉడాన్ స్కీమ్‌ను తీసుకొచ్చి మారుమూల ప్రాంతాల్లోనూ విమానాశ్రయాలను నిర్మించి ఎయిర్ కనెక్టివిటీని పెంచిందన్నారు. ఈ స్కీమ్ గడువు ముగియనుండడంతో మరో పదేళ్లు పొడిగించాలని తాను ప్రతిపాదించగా.. కేంద్రం ఆమోదించి బడ్జెట్‌లో కూడా పొందుపరిచిందని తెలిపారు. పంట ఉత్పత్తులను దేశవిదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎయిర్ కార్గోను మరింతగా అభివృద్ధి చేయబోతున్నామన్నారు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన నష్టం గురించి ఖండాంతరాల్లోనూ చర్చించుకుంటున్నారని తెలిపారు. ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ పెట్టుబడిదారులు ఈ అంశాన్నే ప్రస్తావించారని.. అయితే వారిలో ఉన్న భయాన్ని సీఎం చంద్రబాబు పోగొట్టి పెట్టుబడులపై నమ్మకం కలిగించారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు, ప్రభుత్వ విధానాలను విమర్శించే వాళ్లు బయటకు అడుగు పెట్టడానికి లేదని.. ఎవరైనా మాట్లాడితే జైళ్లలో పెట్టారన్నారు. ఆ రోజున శాంతిభద్రతలు, స్వేచ్ఛ లేవని, ఈ రోజున స్వేచ్ఛ ఉందని.. ఇందుకు ఆ పార్టీ నాయకులు బయటకు వచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండడమే నిదర్శనమని చెప్పారు. 'టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ ఏడు నెలల్లో ఎన్నో చేసింది. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విధంగా పెన్షన్ రూ.వెయ్యి పెంచి బకాయి సహా తొలి నెల రూ.7 వేలు చెల్లించాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.10,400 కోట్లు విడుదల చేయించాం. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ.17 వేల కోట్లు సాధించాం. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,130 కోట్లు తెచ్చాం. విశాఖలో రైల్వేజోన్ కార్యాలయం నిర్మాణానికి స్థలమిచ్చి గత నెలలోనే ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాం. జలజీవన్ మిషన్ స్కీమ్‌ను మరో పదేళ్లు పొడిగించేలా చేసి రాష్ట్రానికి రూ.70 వేల కోట్లు మంజూరు కోసం చర్యలు చేపట్టాం. నభూతో నభవిష్యత్ అన్న రీతిలో ఈ ఏడు నెలల పాలనలో నిధులు సాధించాం' అని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు, ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, చెరుకూరి తిరుపతిరావు, వల్లూరి జయప్రకాష్‌నారాయణ, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కన్సల్టెంట్ల పెత్తనం!

అన్ని శాఖల్లో కలిపి వందమందికిపైగా కన్సల్టెంట్లు.. ఉద్యోగులకు సమాంతరంగా ప్రైవేట్ వ్యవస్థ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర సచివాలయం అంటే.. ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు! ఇప్పుడు వీరిని కాదని.. మరో కొత్త వర్గం మొదలైంది! వారే.. కన్సల్టెంట్లు! 'భగవంతునికీ - భక్తునికీ మధ్య' అన్నట్లుగా... కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్ల మధ్య వీరు తయారయ్యారు! అయితే.. వీరిది అనుసంధానం కాదు! అచ్చంగా అడ్డుగోడలా! ఈ కన్సల్టెంట్ల వ్యవహారం ఇప్పుడు సచివాలయంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం కన్సల్టెంట్ల సేవలు తీసుకోవడం కొత్తేమీ కాదు! ఎప్పటి నుంచో జరుగుతున్నదే! కానీ.. కొన్ని ప్రత్యేకమైన ప్రాజెక్టులు, అంతర్జాతీయ స్థాయి ప్రణాళికలు, వినూత్నమైన ఆలోచనల అమలు తదితర సేవలకు మాత్రమే కన్సల్టెంట్లను వినియోగించుకోవడం రివాజు! ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని కన్సల్టెంట్లుగా నియమించుకుంటే ప్రాజెక్టు నివేదికల తయారీ, సంప్రదింపులు సులువుగా, సాఫీగా సాగుతాయి. ఇప్పుడు పరిస్థితి 'అంతకు మించి' అన్నట్లుగా తయారైంది. ప్రభుత్వ యంత్రాంగం చేయగలిగే రొటీన్ కార్యకలాపాల్లోనూ కన్సల్టెంట్లు వేలు పెడుతున్నారు. సచివాలయంలోని అన్ని శాఖల్లో కలిపి వంద మందికిపైగా కన్సల్టెంట్లు ఉన్నారు. ఆర్థిక శాఖ, దాని పరిధిలోని ప్రణాళిక శాఖలోనే 31 మంది కన్సల్టెంట్లు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వ అధికారులతో సమానంగా, కొందరికి ఇంకా ఎక్కువగానే వేతనాలు అందిస్తున్నారు. వెరసి.. సెక్రటేరియట్‌లో ప్రభుత్వ యంత్రాంగానికి సమాంతరంగా ఒక ప్రైవేటు వ్యవస్థ నడుస్తోంది.

ఉద్యోగులను దూరం చేస్తూ...

ప్రభుత్వంలో సెక్రటరీల పేరుతో పాలనా వ్యవహారాలు నడుస్తాయి. సెక్రటరీలకు సాయం చేయడానికి ప్రభుత్వ ఉద్యోగులు వివిధ కేడర్లలో ఉంటారు. కానీ, ఇప్పుడు చాలా మంది కార్యదర్శులు కన్సల్టెంట్లు లేకుండా ఒక్క అడుగు కూడా వేయలేకపోతున్నారు. పోనీ, ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యం ఉన్న వారినే కన్సల్టెంట్లుగా నియమించుకుంటున్నారా అంటే అదీ లేదు. కేవలం ప్రపంచస్థాయి ఇంగ్లీషు వస్తే చాలన్నట్లుగా కన్సల్టెంట్ల నియామకాలు జరుగుతున్నాయి. ఈ కన్సల్టెంట్లకు ప్రత్యేకమైన టాస్కులు కూడా అప్పగించడంలేదు. ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వాలన్నా, నోట్ రాయాలన్నా, కేంద్ర ప్రభుత్వ శాఖలకు ప్రతిపాదనలు పంపాలన్నా కన్సల్టెంట్లనే పిలుస్తున్నారు. ఆ కన్సల్టెంట్లు... సంబంధిత సబ్జెక్టు చూసే సెక్షన్ ఆఫీసర్ల దగ్గరకు వెళ్లి వివరాలు తీసుకొని, వాటి ఆధారంగా ప్రజంటేషన్లు, లేఖలు సిద్ధం చేస్తున్నారు. ఈ మాత్రం పని ఎస్‌వోలు, ఏఎస్‌వోలు చేయలేరా? అంటే... కచ్చితంగా చేయగలరు. అయినప్పటికీ కన్సల్టెంట్లదే పెత్తనం! దీంతో సెక్రటరీలకు, సచివాలయ అధికారులకు మధ్య అంతరం పెరుగుతోంది.

అనుభవాన్ని పక్కనపెట్టి...

సచివాలయంలో కార్యదర్శులు నిర్ణయం తీసుకునేందుకు ఒక విధానం అమలులో ఉంది. కొందరు కార్యదర్శులు తన కింది స్థాయిలో ఉండే అధికారులను పిలిచి మాట్లాడుతారు. మరికొందరు అధికారులు ఆ సెక్షన్‌కు సంబంధించిన ఏఎస్‌వో, ఎస్‌వో, ఏఎస్, డీఎస్ ఇలా అందరినీ పిలిచి అభిప్రాయాలు తీసుకుని... ఒక నిర్ణయం తీసుకుంటారు. ఉదాహరణకు... రాష్ట్రంలో పన్ను ఆదాయం ఎలా పెంచాలి, ఎందుకు తగ్గుతోంది, ఎక్కడ లోపం జరుగుతోంది అని ప్రశ్నిస్తే కన్సల్టెంట్లకంటే ఆర్థిక శాఖ అధికారులే సాధికారికంగా జవాబు చెప్పగలరు. ఎందుకంటే.. ఆర్థిక శాఖ ఉద్యోగులకు బదిలీలు ఉండవు. రిటైర్ అయ్యే వరకు అదే శాఖలో పని చేస్తారు. అన్ని పరిణామాలను గమనిస్తుంటారు. ఇదే ప్రశ్న కన్సల్టెంట్లను అడిగితే గూగుల్‌లో సెర్చ్ చేస్తారు. పోనీ.. నిధులు రాబట్టడంలో వీళ్లేమైనా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారా అంటే అదీ లేదు. ఉద్యోగులను నమ్మలేం, అందుకే కన్సల్టెంట్లతో పనులు చేయిస్తున్నామని కొందరు అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. ఉద్యోగులకు చెప్పలేని రహస్యాలను ప్రైవేట్ వ్యక్తులైన కన్సల్టెంట్లకు మాత్రం ఎలా చెబుతారు? పైగా డేటా లీకైతే ప్రభుత్వ ఉద్యోగులను శిక్షించడానికి నిబంధనలు ఉన్నాయి. కానీ, ప్రైవేట్ వ్యక్తులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేరు కదా!

'నైపుణ్యం' ఎందుకు?

ప్రభుత్వ ఉద్యోగుల్లో నైపుణ్యాలు పెంచడం కోసమంటూ ప్రణాళిక శాఖ మంగళవారం ఒక జీవో జారీ చేసింది. ఇందుకోసం ఏపీ స్టేట్ కెపాసిటీ బిల్డింగ్ కమిటీ, కేంద్రం పరిధిలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ పాలసీ-2025ను ఆమోదిస్తున్నట్టు ఆ జీవోలో పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీకి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం ఈ పాలసీ ఉద్దేశం. ఓ వైపు కన్సల్టెంట్లను మితిమీరి ప్రోత్సహిస్తూ... ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు తగినట్టుగా తీర్చిదిద్దుతామనడమే విచిత్రం!

ఆక్వాతో అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఆక్వా రంగంలోనూ విరివిగా వాడాలన్నారు. రొయ్యలకు ఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందో ఏఐతో ముందే విశ్లేషించి తెలుసుకోవచ్చని, సరైన మందులతో ముందుగానే చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. సాంకేతికను జోడించి, నూతన పద్ధతులు అవలంబిస్తే.. ఆక్వా రంగంలో 30% వృద్ధి రేటు సుసాధ్యం చేయవచ్చని చెప్పారు. విజయవాడలోని ఓ హోటల్‌లో గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌ఎస్‌టీ), ఏపీ మత్స్యశాఖ సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన 'ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ టెక్-2.0' సదస్సుకు చివరిరోజైన మంగళవారం సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. "రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 4 లక్షల ఎకరాల ఆక్వా సాగు 2029-30 నాటికి 10 లక్షల ఎకరాలకు పెరగాలి. అయితే కాలుష్య రహితంగా ఆక్వా సాగవ్వాలి. ప్రకృతి సేద్యం ద్వారా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఏర్పడుతుంది. ఈ విధానాన్ని అమలు చేయాలి. ఆక్వా దాణా విషయంలో తగు మార్పులు చేయాలి. ప్రతి ఆక్వా రైతూ సాగు వివరాలు రిజిస్టర్ చేయించుకోవాలి. ఇష్టానుసారం చేస్తానంటే మాత్రం ప్రభుత్వం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తుంది. ఆక్వాకు ప్రాధాన్యమే మా ప్రభుత్వ అభిమతం. నిబంధనల అమలుకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తాం. కాలుష్య నియంత్రణ విషయంలో కఠినంగా ఉంటాం. రాష్ట్ర స్థూల విలువ జోడింపు(జీవీఏ)లో 8.8% ఆక్వా వాటాగా ఉంది. ఉత్పత్తి తక్కువున్నా వియత్నాం వాళ్లు విలువ జోడింపులో ముందున్నారు. వియత్నాం 3.9 మిలియన్ టన్నులు ఎగుమతులతో 13 బిలియన్ డాలర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ టన్నుల ఎగుమతి చేస్తూ 3 మిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయి. పంటల ఉత్పత్తితో పాటు ప్రాసెసింగ్ ఉంటేనే వ్యవసాయ ఆధార పరిశ్రమకు భవిష్యత్ ఉంటుంది. ఈ ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని రకాలా ప్రోత్సాహం అందిస్తుంది. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు. ప్రపంచ ఆహార అలవాట్లు మారుతున్నాయి. దానికి అనుగుణంగా రైతులు కూడా సాగులో మార్పులు చేయాలి. ఆహార పదార్థాల సర్టిఫికేషన్, ట్రేసబులిటీ అనేది రానున్న రోజుల్లో ప్రాధాన్య అంశంగా మారిపోతుంది. రానున్న రోజుల్లో దక్కే అవకాశాలను గుర్తించి, అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయి" సీఎం చెప్పారు.

ఎండీఎంఏ మత్తులో ఇంజనీరింగ్ విద్యార్థులు

- గుంటూరులో 9 మంది అరెస్ట్.. ఇద్దరు పరారీ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మత్తుమందు మిథలిన్ డయాక్సీ మెథాంఫెటమిన్(ఎండీఎంఏ)ను బెంగళూరు నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న, దాన్ని వినియోగిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు గుంటూరు పోలీసులకు పట్టుబడ్డారు. ఎండీఎంఏ ఉన్న 9 మంది ఇంజనీరింగ్ విద్యార్థులను గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన నితిన్.. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఎం సాయికృష్ణకు ఎండీఎంఏను విక్రయించాడు. గుంటూరు సమీపంలోని గోరంట్లలో ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకుని ఉంటున్న సాయికృష్ణ దీన్ని పరిసర ప్రాంతాల్లోని రెండు ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. దీంతోపాటు గంజాయి కూడా అమ్ముతున్నాడు. ఈ కేసులో మొత్తం 11 మంది భాగస్వాములు కాగా, 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు, జిల్లా అధికారి అరుణకుమారి, సీఐ యశోధరాదేవి తెలిపారు.

విశాఖ, బెజవాడ మరణాలపై విచారణ: సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ, విజయవాడ జీజీహెచ్‌ల్లో మహిళల మరణాలపై లోతైన విచారణ జరపాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన 63 ఏళ్ల మహిళ రేణుక విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. జీబీఎస్ లక్షణాలతో ఈ నెల 6న కేజీహెచ్‌లో చేరిన ఆమె చికిత్స పొందుతూ 17న మృతిచెందారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా జి.కోడూరుకు చెందిన 35 ఏళ్ల సునీత తీవ్ర అనారోగ్య సమస్యలతో సోమవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఆ వెంటనే ఆమె మరణించారు. ఈ రెండు సంఘటనలపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహంను ఆదేశించారు.

రిటైర్డ్ తహశీల్దార్ పేరుతో 400 ఎకరాలు!

- పెందుర్తి మండలంలో ఒకే ఖాతా నంబర్‌పై నమోదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏదైనా భూమికి సంబంధించిన యాజమాన్య వివరాలు అందుబాటులో లేకపోయినా, అనుమానం ఉన్నా వాటిని నోషనల్ ఖాతాలో నమోదు చేస్తారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ రెవెన్యూ శాఖ ఒక ఖాతా నంబరు ఇస్తుంది. ఒక వ్యక్తికి వేర్వేరు గ్రామాల్లో భూములు ఉంటే వేర్వేరు ఖాతా నంబర్లు వస్తాయి. నోషనల్ ఖాతా నంబరులో అంకెలు ఎక్కువ ఉంటాయి. చూడగానే తెలిసిపోతుంది. అయితే విశాఖ జిల్లా పెందుర్తిలో మాజీ తహశీల్దార్ లాలం సుధాకర్‌నాయుడికి చెందిన 'ఖాతా నంబరు 9102' మీద సుమారు 400 ఎకరాల పైచిలుకు ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నాయి. పెందుర్తి, చినముషిడివాడ, గుర్రంపాలెం, ముదపాక, గొరపల్లి, పొర్లుపాలెం, పినగాడి, పెదగాడి, నరవ, పులగాలపాలెం, రాజయ్యపేట, సరిపల్లె, సౌభాగ్యపురం గ్రామాల్లో వివిధ సర్వే నంబర్లలో ఇవి ఉన్నాయి. 'మీ భూమి'లో చూస్తే ప్రతి గ్రామంలో ఆ ఖాతా నంబరు (9102) మీద ఆయన పేరుతోనే భూములు కనిపిస్తున్నాయి. కొన్ని అనువంశికంగా వచ్చాయని, కొన్ని బహుమానంగా వచ్చాయని, కొన్ని కొనుగోలు చేశారని రికార్డులు చూపిస్తున్నాయి. ఈ ఖాతా ఆయన ఆధార్ నంబరుకు లింకై ఉండడం గమనార్హం. పెందుర్తి సహా అనేక మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేసిన సుధాకర్‌నాయుడు గత అక్టోబరు 17న చనిపోయారు. ఆయన పేరిట ఉన్న కొన్ని భూములకు సంబంధించి గతనెల 2న ఇతరుల పేర్లపై మ్యుటేషన్లు జరిగాయి. ఆ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నా.. ఎవరు చేయించుకున్నారనేది లేదు. అవన్నీ మండల కార్యాలయం రికార్డుల్లోనే ఉంటాయి. చనిపోయిన వ్యక్తి పేరిట ఎవరు దరఖాస్తు చేశారనేది ఇక్కడ ముఖ్యం. పులగాలపాలెం సర్వే నం.128లో 3.14 ఎకరాలు, 146-4లో 1.62 ఎకరాలు.. ఇలా సుమారు 10 ఎకరాల వరకు చేతులు మారాయి. వీటి విలువ సుమారు రూ.100కోట్లు ఉంటుంది. ఈ అంశాన్ని రెవెన్యూ అధికారుల వద్ద ప్రస్తావించగా.. హక్కుదారులెవరో తెలియకపోవడం వల్ల అప్పటి తహశీల్దార్ సుధాకర్‌నాయుడి ఖాతా నంబరు నమోదు చేసి ఉంటారని, అందులో మోసం ఏమీ ఉండదని సమర్థించుకున్నారు. సాధారణంగా ఇలాంటి భూములను నోషనల్ ఖాతాలో నమోదు చేస్తారు. ఇక్కడ సుధాకర్‌నాయుడికి ఒకటే ఖాతా ఉంది. పొరపాటున ఆయన పేరు నమోదు చేసి ఉంటే.. ఆయన చనిపోయిన తర్వాత వాటిని ఇతర ఖాతాలకు మళ్లించాల్సి ఉంది. రీసర్వే జరిగినప్పుడైనా ఈ తప్పులు సరిదిద్దాల్సి ఉంది.


సుధాకర్ నాయుడు

సరిచేసే ప్రయత్నమేదీ?

రెవెన్యూ రికార్డుల్లో తప్పులు ఉన్నాయని కొందరు సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సుధాకర్‌నాయుడి పేరిట వందల ఎకరాల భూములు ఉన్నాయనే విషయం వారిదృష్టికి వచ్చింది. దానిపై స్థానిక అధికారులను ప్రశ్నించారు. అక్కడ సరైన స్పందన లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారులను కలిశారు. వారూ తప్పు జరిగిందని అంటున్నారే తప్ప దానిని సరిచేసే ప్రయత్నం చేయడం లేదు. ఈ విషయమై పెందుర్తి తహశీల్దార్ ఆనందకుమార్‌ను ఫోన్లో సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా.. ఆయన నుంచి స్పందన లేదు.

బియ్యం గోడౌన్ల వద్ద ఏఐ కెమెరాలు

- పౌర సరఫరాల శాఖలో కాగిత రహిత పాలన: నాదెండ్ల

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖలో కాగిత రహిత పరిపాలన (పేపర్ లెస్ అడ్మినిస్ట్రేషన్)ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో ఆ శాఖ ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్లు, గొడౌన్ల నిర్వాహకులు, ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ మార్కెటింగ్ ప్రతినిధులతో విడివిడిగా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో దుర్వినియోగం, అక్రమాల నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గొడౌన్లలో నిల్వ చేసే సరుకుల పర్యవేక్షణకు సివిల్ సప్లయిస్, ప్రైవేట్ గొడౌన్ల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

టీచర్ల పనితీరు మదింపు!

- విద్యార్థుల కనీస అభ్యసన పరిజ్ఞానానికి టీచర్లనే బాధ్యులుగా చేయాలి
- ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయండి
- పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా టీచర్ల పనితీరును అంచనా వేయాలని ఆదేశించింది. దీనికి వీలుగా జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ)ని సంప్రదించి 6నెలల్లో సూచికలు రూపొందించాలని పేర్కొంది. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం కనీస స్థాయిలో లేకపోవడానికి టీచర్లను బాధ్యులను చేయడంవల్ల దీర్ఘకాలంలో విద్యా ప్రమాణాలు పెరుగుతాయని అభిప్రాయపడింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధన 25(2)(డీ) ప్రకారం జవాబుదారీతనం, పనితీరులపై సూచికలు తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. అలాగే, 25(2)(ఈ) ప్రకారం ఉపాధ్యాయులు, అధికారుల వ్యవస్థ పనితీరును నిర్దిష్ట కాలంలో మదింపు చేయాలని తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. విద్యార్థుల అధ్యయన, అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు విద్యాహక్కు చట్టం, ఎస్‌సీఈఆర్‌టీ నిబంధనల మేరకు నిర్వహించిన బేస్‌లైన్, టీఏఆర్‌ఎల్(టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) ఫలితాలను గత ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపించారు. విద్యార్థులు చదివే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని, ఐదవ తరగతి విద్యార్థి రెండో తరగతి పాఠ్యాంశాన్ని కూడా చదవలేకపోతున్నాడని తెలిపారు. బేస్‌లైన్, టీఏఆర్‌ఎల్ టెస్టుల వివరాలను తల్లిదండ్రులకు అందజేయడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని స్పష్టం చేసింది.


విశాఖ నోవాటెల్ డౌన్‌లో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని చిల్డ్రన్ పార్కులోకి దూసుకువెళ్లిన లారీ

బీచ్‌రోడ్డులో లారీ బీభత్సం

విశాఖపట్నం/మహారాణిపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విశాఖ బీచ్‌రోడ్డులో ఓ లారీ బీభత్సం సృష్టించింది. శ్రీకాకుళం నుంచి ఇసుక లోడుతో వచ్చిన లారీ ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లేందుకు మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో పందిమెట్ట జంక్షన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టి.. చిల్డ్రన్ పార్కులోకి దూసుకెళ్లింది. ప్రమాద స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రక్షణ గోడను లారీ బలంగా ఢీకొట్టడంతో రాళ్లు సమీపంలో వాకింగ్ చేస్తున్న వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన తుపాకుల పెంటారావు తలకు తగలడంతో గాయమైంది.

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్

- అపోహలు వీడి స్క్రీనింగ్‌కు ముందుకు రావాలి: మంత్రి సత్యకుమార్



ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడులో జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో నటి గౌతమి తదితరులు.

ఒంగోలు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సరైన అవగాహన ఉంటే ప్రాణాలు కబళించే క్యాన్సర్‌ను నివారించవచ్చని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ)పై అవగాహన సదస్సును నిర్వహించారు. మంత్రి సత్యకుమార్, సినీనటి గౌతమి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపట్టిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపిచ్చారు. క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే అంత సులువుగా తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. దానిపై అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం, సినీనటి, లైఫ్ ఎగైన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు గౌతమి సంయుక్తంగా కృషి చేస్తున్నారన్నారు. క్యాన్సర్ తన తల్లిని, అక్క ప్రాణాలను కబళించిందని, ముందస్తుగా గుర్తించకపోవడం వల్లే వారు మరణించారని వెల్లడించారు. ఆ సంఘటనలతో కలత చెందిన తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజున క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షల సర్వేపై తొలి సంతకం చేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్‌లో 88వేల అనుమానిత కేసులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వ్యాధి బారినపడిన వారికి ఉన్నతస్థాయి వైద్యం అందిస్తామని చెప్పారు. ఏడుగుండ్లపాడులో 320 మందికి స్క్రీనింగ్ చేయగా 116 అనుమానిత కేసులు వచ్చాయన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.